# నటి రన్యారావుకు ఏడాది జైలు

## స్మగ్లింగ్ నివారణ బోర్డు కీలక ఉత్తర్వులు

బెంగళూరు : అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయి సంచలనం సృష్టించిన కన్నడ నటి రన్యారావు కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. రన్యారావుకు ఏడాది పాటు జైలు శిక్ష పడింది. విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ బోర్డు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో రన్యారావుతో పాటు– మరో ఇద్దరు నిందితులైన తరుణ్ కొండారు రాజు, సాహిల్‌లకు కూడా ఇదే శిక్ష విధించినట్లు 2లో




# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, జూలై 18, 2025 | సంపుటి - 20 | సంచిక 187 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


# కేంద్ర-రాష్ట్రాల పరస్పర సహకారంతో

# క్లీన్ ఎనర్జీ

భారత మండపం 'ఉర్జా మంథన్ 2025' కార్యక్రమం

తెలంగాణ ప్రభుత్వం తరపున శ్రీధర్ బాబు ప్రతిపాదనలు..



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని భారత మండపం 'ఉర్జా మంథన్ 2025' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భారతదేశ ఇంధన భద్రత, సహకార విధానాలపై చర్చ జరిగింది. దేశంలోని 22 రాష్ట్రాల నుంచి మంత్రులు హాజరై తమతమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ తరఫున హాజరైన మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశ క్లీన్ ఎనర్జీ భవిష్యత్తును నడిపించడంలో మిగతా 2లో



# బిసి ఆర్డినెన్స్‌పై కవిత

# సంచలన వ్యాఖ్యలు

ఇది ముమ్మాటికీ ఆమోదయోగ్యమేనని ప్రకటన

న్యాయనిపుణలుతో చర్చించే వ్యాఖ్యానిస్తున్నట్లు వెల్లడి

బిఆర్ఎస్ వాళ్లు బిసి ఆర్డినెన్స్‌పై మొహం చాటేశారని విమర్శలు

తీన్మార్ మల్లన్న విమర్శలను ఖండించకపోవడంపై ఆగ్రహం

**బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ కవిత ఊహించని షాక్ ఇచ్చారు. ఇంటిపార్టీపై కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే అని.. బీఆర్ఎస్ వాళ్ళు ఆర్డినెన్స్ వద్దని చెప్తున్నారు.. అది తప్పు అని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వాళ్ళు మెల్లగా తన దారికి రావాల్సిందే అని చెప్పారు. తాను న్యాయపరంగా అందరినీ సంప్రదించే కాంగ్రెస్ తెచ్చిన ఆర్డినెన్స్‌ను సమర్థిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఇందుకోసం వారు నాలుగు రోజులు టైం తీసుకుంటారేమో అంతే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు.**

హైదరాబాద్ : 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే అని రేవంత్ సర్కార్ కు బహిరంగ మద్దతును ప్రకటించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్‌కు తాను మద్దతు ఇస్తునట్లు చెప్పారు. తనపై తీన్మార్ మల్లన్న చేసిన కామెంట్స్ కు బీఆర్ఎస్ పార్టీ రియాక్ట్ కాలేదని.. దానిని వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. హైదరాబాద్ లోని తన నివాసంలో మీడియా చిట్ చాట్‌లో ఎమ్మెల్సీ కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో

# బలూచి లిబరేషన్ దాడులు

వరుస ఘటనలతో పాక్ సైన్యం ఉక్కిరిబిక్కిరి

రెండ్రోజుల్లో 27మంది సైనికుల హతం



ఇస్లామాబాద్ : బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్ సైన్యానికి ఊపిరి సలుపనివ్వడం లేదు. వరుస దాడులతో విరుచుకు పడుతున్నారు. గత రెండ్రోజుల్లో 27 మంది పాక్ సైనికులను మట్టుపెట్టినట్లు ఆ సంస్థ ప్రకటించింది.

# అసత్య ఆరోపణలకు మూల్యం తప్పదు

క్షమాపణలు చెప్పకుంటే కోర్టుకు లాగుతా

సిఎం రేవంత్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక

హైదరాబాద్ : తనపై అసత్య ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డిపై కేసు వేస్తానని కెటిఆర్ అన్నారు. మీడియాతో చిట్‌చాట్ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేశారని కేటీఆర్ అన్నారు. దిల్లీలో సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు.సీఎం క్షమాపణ చెప్పకపోతే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేటీఆర్ హెచ్చరించారు. మిగతా 2లో



## కన్నులపండుగగానల్లపోచమ్మఅమ్మవారి

# బోనాల ఉత్సవాలు

హైదరాబాద్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ మరియు నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రోజున తెలంగాణ సచివాలయంలో శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు- 2025 కన్నుల పండుగగా జరిగాయి... సచివాలయ మహిళా ఉద్యోగులు రంగురంగుల సాంప్రదాయ వస్త్రాలంకరణలతో అందంగా ముస్తాబు చేసిన బోనాలను ఎత్తుకొని, ఊరేగింపుగా వెళ్లగా.. బ్యాండ్ మోతలు, డప్పు వాయిద్యాలు, పోతురాజుల వీరంగంతో కదిలిరాగా సచివాలయ నాయకులు మరియు ఉద్యోగులు తమ నృత్యాలతో అలరించారు.. మిగతా 2లో



# విలన్లు క్లైమాక్స్‌లోనే

# అరెస్ట్ అవుతారు

అన్ని కేసులపైనా పక్కా విచారణ జరుగుతోంది

సిబిఐ పేరుతో రాజకీయం చేయాలనుకుంటున్న బిజెపి

తన సవాల్ కెసిఆర్‌కే తప్ప కెటిఆర్‌కు కాదు

కెసిఆర్ కుటుంబం కడుపునిండా విషమే

ఢిల్లీకి వెళ్లకుండా ఫామ్‌హౌజ్‌కు వెళ్లాలా

కేంద్రంతో చర్చించకుంటే సమస్యలకు పరిష్కారమెలా

పక్క రాష్ట్ర సిఎంతో చర్చలు జరపకుంటే ఎలా

కేంద్రమంత్రికిషన్ రెడ్డి లేఖలుకాదు..ప్రణాళికతో రావాలి

ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని.. వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశాల అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పలు అంశాలపై స్పష్టత ఇచ్చారు. తన పాలనపై విమర్శలు చేసే ప్రత్యర్థులపై సూటిగా వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై ఘాటైన పదజాలంతో ప్రస్తావించారు.**

న్యూఢిల్లీ : కేంద్రంతో చర్చలు జరుపకుంటే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు సీఎం. రాష్ట్రానికి సంబంధించి పలు ముఖ్యమైన అంశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రులతో చర్చించామని తెలిపారు. ఇండియా, పాకిస్తాన్ మధ్యే నీటి పంపిణీపై చర్చలు జరుగుతుంటే, నేను పక్క రాష్ట్రం సీఎంతో మాట్లాడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో పర్యటిస్తానని సీఎం తెలిపారు. మిగతా 2లో



# పునరుత్పాదక ఇంధనాలపై సహకారం

**సౌరవిద్యుత్ ఉత్పత్తి జోన్‌లను గుర్తించాలి**

**ప్రాజెక్టుకలు అసవరమైన భూ సేకరణకు మద్దతు**

**సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ**



హైదరాబాద్ : పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు.



# హంద్రీనీవా ప్రాజెక్టుతో రైతులందరికి మేలు

ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు

రాయలసీమకు నీరివ్వడమే మా లక్ష్యం

సీమ కరువు కాటకాలు తెలిసిన వ్యక్తిని

ఎన్టీఆర్ ఆలోచనలో పుట్టిందే హంద్రీనీవా

గత ఐదేళ్లు జగన్ ఏమీ చేయలేదని విమర్శలు

మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి నీటి విడుదల చేసిన సిఎం చంద్రబాబు

కర్నూలు : రాయలసీమకు నీరు ఇచ్చానన్న సంతృప్తి ఎప్పటికీ మర్చిపోలేనని సీఎం చంద్ర బాబు అన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నీటితో బాగుపడే రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాలలో సీఎం పర్యటించారు. జలహారతి కార్యక్రమంలో భాగంగా మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి హంద్రీ నీవాకు నీటిని విడుదల చేశారు.

# ప్రజల ప్రాణాలతో కల్తీకల్లు చెలగాటం



కూకట్‌పల్లి ఘటనతో ప్రభుత్వం కళ్లు తెరవాలి

కల్లు డిపోలకు లైసెన్సులు రద్దు చేయాలి

దుకాణాలు మూసేయాలని ప్రజల డిమాండ్

హైదరాబాద్ : బిఆర్ఎస్ పాలకులు ముఖ్యంగా కెసిఆర్ పుణ్యమా అని హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు తెరుచుకున్నాయి. ఎక్కడా కల్లు లేకున్నా హైదరాబాద్‌లో కల్తీకల్లు వ్యాపారం సాగుతోంది. దీనికి కెసిఆర్, బిఆర్ఎస్ పాలకులు బాధ్యులు. గ్రామాల్లో తాగడానికి కల్లు లేకున్నా హైదరాబాద్‌లో కల్తీకల్లు తాగి ఇటీవల పలువురు మృత్యువాత పడ్డారు.

# హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

**గచ్చిబౌలి పిఎస్ కేసు కొట్టివేత**

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట దక్కింది. రేవంత్ రెడ్డిపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసును హైకోర్టు కొట్టేసింది. కాగా, సొసైటి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్ రెడ్డి

# ఫోన్ ట్యాపింగ్‌పై వివరాలు ఇస్తా: బండి

**ఈనెల24న విచారణకు రావాలని బండికి సిట్ నోటీసులు**



హైదరాబాద్ : మాజీ సీఎం కేసీఆర్ చేసిన పాపాల వల్లే పోలీసుల నుంచి తనకు నోటీసులు వచ్చాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలని జూబ్లీహిల్స్ ఏసీపీ లేఖ రాసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల నుంచి నోటీ–సులు వచ్చాయి. నాతో పాటు– నా కుటుంబం, సిబ్బంది ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. పడకగదిలో దంపతుల మాటలూ ట్యాప్ చేసి జీవితాలను నాశనం చేశారు. నాకు తెలిసిన, నా వద్ద ఉన్న సమాచారం పోలీసులకు తెలియజేస్తానని బండి సంజయ్ అన్నారు.

# నటి రన్యారావుకు ఏడాది జైలు

బోర్డు తెలిపింది. అక్రమ రవాణాకు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్న నేపథ్యంలో శిక్షా కాలంలో వారు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదని తెలిపింది.దీంతో ముగ్గురు నిందితులు ఏడాది పాటు- జైల్లోనే ఉండాల్సిఉంది. ఈ కేసులో ప్రతి మూడు నెలలకు ఒకసారి విచారణలు జరుగుతాయని పేర్కొంది. ఇలా ఏడాది వరకు కొనసాగుతాయని వెల్లడించింది. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ మార్చి తొలి వారంలో రన్యారావు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆమె నుంచి 14.3 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో ఆమె నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేసి రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశారు. ఇక, అక్రమంగా బంగారం తరలించడంలో రన్యారావు సహచరులైన తరుణ్ కొండూరు రాజు, సాహిల్ జైన్ కీలక పాత్ర పోషించినట్లు- దర్యాప్తులో వెల్లడైంది. దీంతో వారిని కూడా అధికారులు అరెస్టు చేశారు.

## కన్నుల పండుగగా నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు

పలహారం బండి ఊరేగింపు నార్త్ పోర్టికో నుండి మొదలై అమ్మవారి చెంతకు చేరేవరకు ఉద్యోగులందరూ కలిసిమెలిసి ముందుకు సాగారు..వివిధ కళాకారుల నృత్యాలు అక్కట్టుకున్నాయి. శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి దేదీప్య మానంగా నైవేద్యం సమర్పించిన సచివాలయ ఉద్యోగుల తదనంతరం ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రెటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీగిరి శ్రీనివాస్ రెడ్డి గారు, జనరల్ సెక్రెటరీ ప్రేమ్ గారు, ట్రెజరర్ కైలాష్ గారు, ఆఫీస్ బేరర్స్, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గారు %ల% సభ్యులు, సచివాలయంలోని వివిధ శాఖలలో వివిధ హోదాలలో పనిచేసే అధికారులు %ల% ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు..

## అసత్య ఆరోపణలకు మూల్యం తప్పదు

నాపై ఏదైనా డ్రగ్స్ కేసు నమోదైందా దానితో నాకు సంబంధమున్నట్లు- ఆధారాలున్నాయా దమ్ముంటే బయటపెట్టాలని సీఎంను సవాల్ చేస్తున్నానని అన్నారు. నేరుగా నా ముందు నిలబడే ధైర్యం లేక చిట్‌చాట్లు చేస్తున్నారు. ఇలా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సీఎంకు కొత్తకాదు. రేవంత్‌రెడ్డి.. మిమ్మల్ని కోర్టుకు లాగుతా. తప్పుడు ఆరోపణలకు మూల్యం చెల్లించుకోక తప్పదు. కేటీ-ఆర్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. బనకచర్లపై సీఎం అడ్డంగా దొరికారు.. చిట్‌చాట్ పేరుతో తప్పును కప్పిపుచ్చు కునేందుకు యత్నించారని ఆరోపించారు. బనకచర్లపై తాను చేసిన సవాల్‌ను సీఎం రేవంత్ స్వీకరించలేదన్నారు. ఈ అంశంలో ఏపీకి వత్తాసు పలకడాన్ని తప్పుపడుతున్నట్లు- హరీశ్ చెప్పారు.

## హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

ఆయన సోదరుడు కొండల్ రెడ్డిపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో పెద్దిరాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. పెద్దిరాజు ఫిర్యాదు మేరకు రేవంత్ రెడ్డి, కొండల్ రెడ్డిపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని రేవంత్ రెడ్డి 2020లో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు జూన్ 20న తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా గురువారంతక కేసు తీర్పు వెల్లడించింది హైకోర్టు. ఫిర్యాదుదారుడు చేసిన ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో రేవంత్ రెడ్డిపై గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది.

## హంద్రీనీవా ప్రాజెక్టుతో రైతులందరికీ మేలు

ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. రాయలసీమ కరవు, కష్టాలు, ప్రజల బాధలు నాకు తెలుసు. నేను ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. అనంతపురంలో కరవు వస్తే గడ్డి తెచ్చి పశువులను కాపాడిన పార్టీ మాది. రాయదుర్గం ఎడారిగా మారకుండా చర్యలు తీసుకున్నాం. సీమ చరిత్రను తిరగరాయాలని ఎన్టీఆర్ తొలిసారి ఆలోచించారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆరే. ఆయన ఆశయాలను తెదేపా నెరవేర్చింది. రాయలసీమకు నీరిచ్చాకే చెన్నైకి నీళ్లు ఇస్తానని ఆనాడు ఎన్టీఆర్ చెప్పారు. హంద్రీనీవా నీరు 550 కి.మీ ప్రవహించి చిత్తూరు, కుప్పం వరకు వెళ్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మల్యాల ద్వారా సుమారు 4 టీఎంసీల నీరు తీసుకెళ్లవచ్చు. కృష్ణగిరి, పత్తికొండ, జీడిపల్లి, పీఏబీఆర్, మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, మదనపల్లె, చిత్తూరుకు నీరిచ్చే అవకాశం వస్తుంది. సమస్య ఎదురైతే సవాలుగా తీసుకొని పనిచేసే మనస్తత్వం నాది. వేరే రాష్ట్రానికి వెళ్తున్న కియాను అనంతపురం తీసుకొచ్చా. 8 నెలల్లో గొల్లపల్లి పూర్తి చేసి కియాకు నీళ్లిచ్చిన ఘనత మాది. రాయలసీమ రైతు కుటుంబాల్లో మార్పు రావాలనేదే నా లక్ష్యం. తొలి దశలో 1.98 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు వస్తుందని బాబు అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన జగన్ ఐదేళ్లపాటు- రాష్ట్రాన్ని నాశనం చేశారు. రాష్ట్రానికి పేరు రావాలని, ప్రజల జీవితాలు బాగుపడాలని నిత్యం కోరుకుంటా. రాయలసీమకు రూ.2 వేల కోట్లు- కూడా వైకాపా ఖర్చు చేయలేదు. హంద్రీనీవాకు కనీసం రూపాయి ఖర్చుపెట్టారా? అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసింది మా ప్రభుత్వమే. మా హయాంలోనే పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, గండికోట వచ్చాయి. నదుల అనుసంధానం జరగాలనేది నా జీవిత ఆశయం. పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానిస్తే కరవు అనే మాటే ఉండదు. ఇప్పుడు రాయలసీమలోని అన్ని జలాశయాలు కళకళలాడుతున్నాయి. రాయలసీమను రతనాలసీమగా మారుస్తామనే ధైర్యం వచ్చింది. శ్రీశైలం నుంచి ఎస్ఆర్‌బీసీ, ముచ్చుమర్రి, మల్యాల కాల్వలు వస్తాయి. హంద్రీనీవా నుంచి అనంతపురం, పత్తికొండ, గొల్లపల్లికి మరో కాల్వ వెళ్తుంది. గాలేరు-నగరి నుంచి గండికోట, అవుకు, మైలవరానికి నీళ్లు వస్తాయి. శ్రీశైలం నుంచి ప్రారంభమైన నీరు తిరుపతికి వెళ్లే పరిస్థితి వస్తుందని అన్నారు. రాజకీయాలు సమస్యలు ఎప్పుడూ ఉంటాయి. క్లైమోమోర్ మైన్స్ కూడా నన్ను ఏమీ చేయలేకపోయాయి. రాయలసీమ లో అన్నీ రకాల వనరులు ఉన్నాయి. మంచి రోడ్లు ఉన్నాయి. ఎక్కడికైనా సులువుగా వెళ్లవచ్చు. వైకాపా హయాంలో ఐదేళ్లపాటు- ఒక్క గుంత కూడా పూడ్చలేదు. రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్లను అందంగా మారుస్తాం. చెప్పిన ప్రతిమాట నిలబెట్టు-కుంటు-న్నానా? లేదా? గత ప్రభుత్వం పింఛను రూ. వెయ్యికి పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకుంది. మేం వచ్చాక ఒకేసారి రూ. వెయ్యి పెంచి పింఛను ఇచ్చాం. దివ్యాంగుల పింఛను ఒకేసారి రూ.6 వేలకు పెంచిన ఘనత మాదే. పేదవాడికి అన్నం పెట్టే క్యాంటీ-న్లు మూసేశారు. మేం వచ్చాక మళ్లీ 207 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. 21 దేవాలయాల్లో అన్నప్రసాదం ప్రారంభించాం అని చంద్రబాబు అన్నారు. హంద్రీనీవా ఫేజ్-1 కాల్వల విస్తరణ పనులు పూర్తి కావడంతో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నీరు విడుదల చేశారు. జలహారతి ఇచ్చి నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్‌లో రెండు మోటార్లను ఆన్ చేశారు. నీటి విడుదలతో రాయలసీమకు తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయి. 12 ఏళ్ల తర్వాత సీమకు 40 టీఎంసీల నీరు అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా జలవనరులశాఖ ఏర్పాటు- చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను సీఎం తిలకించారు. ప్రాజెక్టు అలైన్ మెంట్, ఆయకట్టు-, కృష్ణా రివర్ బేసిన్ మ్యాప్‌లను పరిశీలించారు. పంపింగ్ స్టేషన్ వ్యూపాయింట్ నుంచి నీటి విడుదలను వీక్షించారు. నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ బైరెడ్డి శబరి, ఇరిగేషన్ ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేంద్ర-రాష్ట్రాల పరస్పర సహకారంతో క్లీన్ ఎనర్జీ

కేంద్ర-రాష్ట్రాల పరస్పర సహకారం అవసరాన్ని నొక్కి చెప్పారు. తెలంగాణ నాయకత్వాన్ని హైలైట్ చేస్తూ.. రాష్ట్ర క్లీన్, గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 కింద తీసుకున్న కీలకమైన చర్యలను వివరించారు. బయో ఇంధనాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ), సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్‌వర్క్‌లపై దృష్టి సారించి.. ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తున్నట్టు చెప్పారు. 1.నగర గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్‌ల విస్తరణ : హైదరాబాద్ నగరమే కాకుండా.. ద్వితీయ శ్రేణి పట్టణాలలో సీజీడీ నెట్‌వర్క్‌లను వేగవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా సమానమైన ఇంధన లభ్యతను పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. 2.బీజీఎల్‌లో మరిన్ని సీజీఎన్జీ స్టేషన్లు, పెట్టుబడులు : సీఎన్జీ స్టేషన్ల సంఖ్యను పెంచాలి. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్‌లో పెట్టుబడులను పెంచాలి. తద్వారా తెలంగాణలో పట్టణ, సెమీ-అర్బన్ పైప్డ్ గ్యాస్ మౌలిక సదుపాయాల విస్తరణకు వీలు కల్పించాలని శ్రీధర్ బాబు కేంద్రాన్ని కోరారు. 3.ఎల్ఎన్జీ, సీఎన్జీ టెర్మినల్స్‌కు నిధులు.. పెరుగుతున్న పారిశ్రామిక, దేశీయ అవసరాలను తీర్చడానికి తెలంగాణలో సీఎన్జీ, ఎల్ఎన్జీ టెర్మినల్స్‌ను స్థాపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహ-నిధుల వినియోగాన్ని మంత్రి ప్రతిపాదించారు. 4.తెలంగాణ వ్యవసాయ వ్యర్థాల సామర్థ్యాన్ని పెంచుకోవడం.. తెలంగాణలో గణనీయమైన వ్యవసాయ వ్యర్థాల ఉత్పత్తిని ఉదహరిస్తూ.. రాష్ట్రంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తి ఉపయోగించని సామర్థ్యాన్ని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం వీటిలో పెట్టుబడి పెట్టాలని శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. 5.సీబీజీ, వ్యర్థాల నుంచి శక్తి సాంకేతికతలు, వ్యవసాయ సంపన్న ప్రాంతాలలో కొత్త సీబీజీ యూనిట్లను ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. 6.సాటాట్, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ వంటి పథకాల కింద.. క్లీన్ ఇంధన సాంకేతిక పరిజ్ఞానాలను పెంపొందించడానికి ఎంఎస్ఎంఈలు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలను అందించాలని మంత్రి వ్యాఖ్యానించారు. 7.తూర్పు-పశ్చిమ పైప్‌లైన్ సినర్జీ.. తూర్పు-పశ్చిమ గ్యాస్ పైప్‌లైన్ వెంబడి.. తెలంగాణ వ్యూహాత్మక స్థానాన్ని మంత్రి శ్రీధర్ బాబు హైలైట్ చేశారు. తక్కువ ఖర్చుతో గ్యాస్ ఆధారిత ఇంధన పారిశ్రామిక వినియోగాన్ని పెంచడానికి మౌలిక సదుపాయాలను విస్తరించడంలో కేంద్రం నేతృత్వంలోని మరిన్ని పెట్టుబడులను ప్రతిపాదించారు. 8.ఇంధన భద్రతపై దృష్టి.. ఇంధన రంగంలో దేశంలో కీలక భాగస్వామిగా తెలంగాణ స్థిరమైన, సమగ్ర ఇంధన అభివృద్ధికి జాతీయ నమూనాగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తోందని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. 'ప్రోయాక్టివ్ విధానాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక సంసిద్ధతతో, భారతదేశం క్లీన్ ఎనర్జీ పరివర్తనకు నాయకత్వం వహించడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది' అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు,పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు..

## బలూచి లిబరేషన్ దాడులు

ఈ విషయాన్ని ఆ సంస్థ ఓ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. బీఎల్‌ఏకు చెందిన ఫతే స్క్వాడ్ కలాత్‌లోని నిమ్రాగ్ క్రాస్ వద్ద సైనికులను తరలిస్తున్న ఓ బస్సును లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. ఇందులో 27 మంది సైనికులు చనిపోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బస్సు కరాచీ నుంచి క్వెట్టాకు దళాలను తరలిస్తుండగా ఈ దాడి చోటు-చేసుకొంది. మరో ఘటనలో క్వెట్టాలోని హజార్‌గంజ్‌లో ఐఈడీ పేల్చి మరో ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ వెల్లడించింది. మంగళవారం కలాత్‌లోని ఖజినా ప్రాంతంలో మరో ఐఈడీ పేల్చి నలుగురు సైనికులను , బుధవారం గుజ్రోకోర్ ఏరియాలో దాడి చేసి మరో ఆరుగురు సైనికులను హత్య చేసినట్లు- బీఎల్ఏ ప్రకటించింది. వీరిలో మేజర్ సయిద్ రబ్ నవాజ్ తరీక్ కూడా ఉన్నట్లు- చెప్పింది. సమీపంలోని సైనిక కాన్వాయ్‌ను స్నైపర్లు లక్ష్యంగా చేసుకోవడంతో.. ఆ కాన్వాయ్ అక్కడినుంచి వెళ్లిపోయింది. ఇక ముగ్గురు బీఎల్ఏ దళ సభ్యులు చనిపోయినట్లు- వచ్చిన వార్తలను ఖండించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ బలోచ్ రెబల్స్ మొత్తం 286 దాడులు చేశారు. ఈ క్రమంలో వివిధరకాల వ్యూహాలను అమల్లోకి తెచ్చారు. వీటిల్లో మూడు ఆత్మాహుతి దాడులు ఉన్నాయి. బీఎల్ఏ చేసిన మొత్తం దాడుల్లో 700 మందికి పైగా చనిపోయారు. 290 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు- బీఎల్ఏ చెబుతోంది. ఈ క్రమంలో 133 వాహనాలను లక్షయంగా చేసుకొంది. ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసింది. దీంతోపాటు- ఈ ఏడాది మొత్తం 45 వ్యూహాత్మక ప్రాంతాలను పాక్ నుంచి స్వాధీనం చేసుకొన్నట్లు- గణాంకాలు చెబుతున్నాయి.

## బిసి ఆర్డినెన్స్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు

ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత, కేటీఆర్ మధ్య దూరం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. అన్నాచెల్లాల మధ్య గ్యాప్ రావడానికి కారణాలు ఏంటి అనేది ఇప్పటికి ఇంకా తెలియరాలేదు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్.. కవితకు షాక్ ఇచ్చారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఇంఛార్జ్‌గా ఉన్న కవిత స్థానంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నియమించారు. కేటీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం గులాబీ పార్టీలో, రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కవితకు పార్టీలో, అనుబంధ సంఘాల్లోనూ ప్రాధాన్యం తగ్గుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. తాజాగా ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్ పార్టీపై చేసిన ఆరోపణలతో ఆ పార్టీకి, ఆమెకు దూరం పెరిగినట్లు కనిపిస్తోంది. అన్నపై ఉన్న కోపంతో కవిత ఈ వ్యాఖ్యలు చేశారనే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నేతలు స్పందించకపోవడమనేది దారుణమని ఎంఎల్‌సి కవిత మండిపడ్డారు. ఈ విషయం బిఆర్ఎస్ నేతల విజ్ఞతకే వదిలివేస్తున్నానని, తన దారికి భారత రాష్ట్ర సమితి నేతలు రావాల్సిందేనని స్పష్టం చేశారు. న్యాయ నిపుణులతో చర్చించిన తరువాతనే బిసి రిజర్వేషన్ ఆర్డినెన్స్ ఒక నిర్ణయానికి వచ్చామన్నారు. రెండు బిల్లులు పెట్టాలని తొలుత డిమాండ్ చేసింది కూడా తానేనని తెలియజేశారు. బనకచర్లపై చర్చకు వెళ్లనని సిఎం రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారని, బుధవారం ఢిల్లీ సమావేశంలో ఎజెండాలో మొదటి అంశమే బనకచర్ల అని పేర్కొన్నారు. బనకచర్లపై చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయించడం మంచి పద్ధతి కాదని హితువు పలికారు. ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రుల మధ్య బనకచర్ల ప్రాజెక్టుపై చర్చలు జరిపారని తెలియజేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే గోదావరి జలాలు హక్కులు తెలంగాణ రాష్ట్రం కోల్పోతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు గోదావరి జలాలను ఎపి సిఎం చంద్రబాబు నాయుడు చేతిలో పెట్టారని దుయ్యబట్టారు. బనకచర్లతో తెలంగాణకు జరుగుతున్న నష్టం గురించి చెప్పడం లేదని కవిత చురకలంటించారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ ఏడారిగా మారే అవకాశం ఉందన్నారు. తెలంగాణ హక్కులను చంద్రబాబు నాయుడు కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని, దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలించే హక్కులేదని, తక్షణమే రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు. గోదావరి రివర్ మెనేజ్‌మెంట్ బోర్డు హైదరాబాద్‌లో ఉంటే కృష్ణా రివర్ మెనేజ్‌మెంట్ విజయవాడలో ఉంటుందని విభజన చట్టంలో ఉందని చెప్పారు. రెండు నదులకు సంబంధించిన బోర్డు విషయంలో రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని చురకలంటించారు. మన భూభాగంలో ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ రిపేర్లు తెలంగాణ ప్రభుత్వం చేయాలని, ఎపి భూభాగంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ రిపేర్లు చంద్రబాబు ప్రభుత్వం చేయాలని విభజన చట్టంలో ఉందన్నారు. నదులు అనుసంధానం విషయంలో కమిటీలు ఉన్నాయని, ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చింది ఏమీ లేదని కవిత మండిపడ్డారు.

# ప్రజల ప్రాణాలతో కల్తీకల్లు చెలగాటం

కూకట్‌పల్లి ఘటనతో కల్లు ఉత్పత్తిపై అనుమానాలు బలపడ్డాయఇ. గ్రామాల్లో సరిగా ఉత్పత్తి లేకున్నా హైదరాబాద్‌లో భారీగా కల్లు ఉన్నట్లు డిపోలు నడుపుతున్నారు. తాటి, ఈత చెట్ల నుంచి సీజన్ వారీగా మాత్రమే కల్లు వస్తుంది. ఒక్కో చెట్టు నుంచి గరిష్ఠంగా 12 లీటర్ల కల్లు తయారవుతుంది. వాస్తవానికి డిసెంబరు నుంచి కల్లు తీయడం మొదలు పెడతారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కల్లు ఉత్పత్తి బాగా ఉంటుంది. మే, జూన్ నెలల్లో కల్లు ఉత్పత్తి తగ్గుతుంది. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో కల్లు ఉత్పత్తి ఉండదు. ఆ నాలుగు నెలల్లో గీత కార్మికులు తాటి, ఈత చెట్లను ఎక్కరు. కానీ.. నగరంలోని కల్లు డిపోల్లో మాత్రం అన్ని సీజన్‌లలోనూ నిరంతరాయంగా కల్లు అమ్మకాలు జరుగుతున్నాయి. సీజన్ లేనప్పుడు.. కల్లు ఉత్పత్తి కాకున్నా.. విక్రయాలు ఎలా సాధ్యమనేది ఎక్సైజ్ అధికారులకు తెలిసినా చెప్పడం లేదు. ఇటీవల కూకట్‌పల్లి ఘటనతో కల్లు దుకాణాలపై మళ్లీ ప్రజల్లో ఆందోళన వస్తోంది. వీటిని ఎత్తేయాలని కోరుకుంటున్నారు. ప్రజల ప్రాణాలు తీస్తున్న కల్లు దుకాణాలను నగరాల నుంచి ఎత్తేయాలని అంటున్నారు. రాష్ట్రంలో 77.78 లక్షల ఈత, తాటి చెట్లు- ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అత్యధిక చెట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా రెండో స్థానంలో ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా ఈత చెట్లు-న్నాయి. ఇక్కడ తాటిచెట్ల సంఖ్య తక్కువే. రాష్ట్రంలో 4,064 తాడి సహకార సంఘాలు ఉన్నాయి. వాటి పరిధిలో 4,697 కల్లు తయారీ కేంద్రాలున్నాయి. వీటిలో 1,95,391 మంది సభ్యులున్నారు. తాటిచెట్టు ఎక్కి కల్లు తీసి.. ఆ చెట్టుకిందనే విక్రయించుకోవడానికి ప్రభుత్వం ట్రీ ఫర్ ట్రేడ్‌లైసెన్స్‌లు ఇస్తుంది. ఇలాంటి లైసెన్స్‌లు పొందిన వాళ్లు రాష్ట్రంలో 29,272 మంది ఉండగా.. వాళ్లు 3,541 దుకాణాలను నడుపుతున్నారు. అధికారికంగా ఎక్సైజ్‌శాఖ ఈ లెక్కలు చెబుతున్నా.. అనుమతుల్లేని కల్లు దుకాణాలు అంతకు రెండింతలు ఉంటాయని అంచనా. రెండ్రోజులుగా జరుగుతున్న దాడుల్లోనూ హైదరాబాద్‌లో అనుమతి లేని కల్లు దుకాణాలు వెలుగులోకి వస్తున్నాయి. కల్తీకల్లు తయారీదారులు ఎక్సైజ్ సిబ్బందిని మామూళ్ల మత్తులో దింపుతున్నారు. దీంతో క్లోరల్ హైడ్రేడ్ మత్తులో కల్తీకల్లును తయారు చేసి ప్రజలను ముంచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంతో పోలిస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా తాటి చెట్టు ఎక్కి.. కల్లు గీసే గీత కార్మికులు తగ్గిపోతున్నారు. 2023-24లో గీత కార్మికులకు 53 లక్షల తాటి, ఈత చెట్లు కేటాయించగా.. 2024-25లో కేటాయింపుల సంఖ్య 50 లక్షలకు పడిపోయింది. అంటే.. నిజాయితీగా కల్లు విక్రయించే వాళ్లకు పెద్దగా లాభాలు లేకపోవడంతో గీతకార్మికులు ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తున్నారు. కానీ, చెట్లే లేని చోట విచ్చలవిడిగా కల్లు కాంపౌండ్లు కొనసాగుతూ.. రూ.కోట్లలో వ్యాపారం సాగుతుండడాన్ని బట్టి.. కల్తీకల్లు ఏ స్థాయిలో విజృంభిస్తోందో అర్థం చేసుకోవచ్చు. అందుకు హైదరాబాద్ కల్లు దుకాణలే నిదర్శనం. వీటిని ఎత్తేస్తే తప్ప ప్రజల ప్రాణాలకు భరోసా లేదు.

# పునరుత్పాదక ఇంధనాలపై సహకారం

తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు- చేయాలన్నారు. గ్రిడ్ స్టెబిలిటీ-, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు అధ్యయనం చేయాలని తెలిపారు. ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం ప్రభుత్వ మద్దతు అవసరమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రతిపాదించిన పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలపై తెలంగాణ ప్రభుత్వ సహకారం కోరుతూ లేఖ రాశారు. బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, ముఖ్యంగా కోల్ ఇండియా లిమిటెడ్, నేవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకుని, సౌర, పవన విద్యుత్ ఎ÷-లాంట్లు-, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు , బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి కీలకమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు వచ్చే మూడేళ్లలో దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్శించనున్నాయన్నారు. తెలంగాణలోని అధిక సౌరవిద్యుదుత్పత్తి సామర్థం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం గురించి ప్రస్తావించారు. గ్రిడ్ స్టెబిలిటీ-, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను అభివృద్ధి చేయడం ముఖ్యమని అన్నారు. ఈ ప్రతిపాదనలు, ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు అవసరమని కేంద్రమంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు విజయవంతంగా అమలుకావడానికి రాష్ట్ర ప్రభుత్వం, సీపీఎస్‌యూల మధ్య నిర్మాణాత్మక భాగస్వామ్యం, సరైన సమన్వయం అత్యంత అవసరమని వెల్లడించారు. ఇందుకోసం ముఖ్యమంత్రి ప్రత్యేకమైన చొరవతీసుకోవాలని కోరుతున్నామన్నారు. పునరుత్పాదక విద్యుదుత్పత్తిలో తెలంగాణ సామర్థ్యాన్ని గుర్తిస్తూ రాష్ట్రంలో హరితాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణమైన చిత్తశుద్ధితో సహకారం అందిస్తోందని చెప్పారు. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భారతదేశ సుస్థిర విద్యుత్ వ్యవస్థలో తెలంగాణ పాత్ర కీలకం కానున్న సందర్భంలో ఈ ప్రాజెక్టుల ప్రాధాన్యత మరింత పెరగనుందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు-గా ఆత్మనిర్భరతతో కూడిన భవిష్యత్‌ను ఏర్పర్చుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిర్మాణాత్మక సహకారం అవసరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# విలన్లు క్లైమాక్స్‌లోనే అరెస్ట్ అవుతారు

రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు ఇచ్చి తీరుతామన్నారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్ తప్ప పాత పథకాలన్నీ అమల్లోనే ఉన్నాయని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదని.. ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు. ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రేవంత్ తెలిపారు. నదుల అనుసంధానం కోసం కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇచ్చంపల్లి నుంచి కావేరికి అనుసంధా నించాలనే ప్రతిపాదన ఉంది. ప్రతిపక్షనేత పదవి ఇవ్వాలని కేసీఆర్‌ను కేటీఆర్ అడుగుతున్నారు. దానికి కేసీఆర్ అంగీకరించడం లేదు. సొంత వివాదాలతోనే ఆ కుటుంబానికి సరిపోతోంది. కేటీఆర్ నాయకత్వాన్ని కవిత ఒప్పుకోవడం లేదు. కేంద్రం పిలిచినప్పుడు వెళ్లకుండా.. కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లాలా అక్కడికి వెళ్తే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి?హైదరాబాద్‌లో లోకేశ్‌ని కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిశారు? కేదార్ అనే వ్యక్తితో కలిసి కేటీఆర్ దుబాయ్‌లో డ్రగ్స్ తీసుకున్నారు. డ్రగ్స్ కలగలిపి తీసుకోవడం వల్లే కేదార్ మరణించాడు. ఆయన మరణంపై పూర్తినివేదిక ఉంది. మద్యంలో కాక్టెయిల్ విన్నాం.. డ్రగ్స్‌లో తొలిసారి కాక్‌టెయిల్ అని వింటు-న్నాం. అవసరమైనప్పుడు కేదార్ మరణానికి గల కారణాల రిపోర్టును బయటపెడతాం. ఆ రిపోర్టును అసెంబ్లీలో పెట్టడానికి సిద్ధమే. నేను చర్చిస్తానంటోంది ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో మాత్రమే.. కేటీఆర్‌తో కాదని స్పష్టం చేశారు. ఢిల్లీకి వెళ్లడం నేరంగా మాట్లాడుతున్నారు.. కేంద్రానికి సంబంధించిన అంశాలపై కేంద్రంతోనే మాట్లాడాలన్నారు. ఢిల్లీకి వెళ్లకుండా ఎక్కడికి వెళ్లాలి.. ఫామ్ హౌస్ కి వెళ్ళాలా? అని ఫైర్ అయ్యారు. 33, 34 సార్లు ఢిల్లీకి వచ్చానని.. 48 సార్లు వచ్చానని మాట్లాడుతున్నారన్నారు. తన ప్రియారిటి రాష్ట్రమని.. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ , వివాదాలను పరిష్కరించుకోవడం ముఖ్యమన్నారు. వ్యూహంతో పని చేస్తున్నామని.. గత ప్రభుత్వం సాధించనివి ఎన్నో.. తాను సాధించానన్నారు. ఢిల్లీలో కేంద్రం ఉన్నప్పుడు, ఇక్కడికి వచ్చే రాష్ట్రం కోసం మాట్లాడాలన్నారు. తాను ఎవరికైనా భయపడితే రేవంత్ రెడ్డిని కాదని ఫైర్ అయ్యారు.. రాష్ట్ర అవసరాల కోసం ఢిల్లీతోపాటు, అవసరమైతే రాష్ట్రాలకు కూడా వెళ్లాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మహారాష్ట్రకు వెళ్తామని.. నీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై అక్కడ మాట్లాడుతామన్నారు.బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ ఎలాంటి చర్చలు జరగలేదని ప్రకటించిందని సీఎం తెలిపారు. అయితే, తాను ఇప్పటికే మూడు సమస్యలను పరిష్కరిం చానని పేర్కొన్నారు. మిగిలిన సమస్యలపై అధికారులు, సాంకేతిక నిపుణుల కమిటీ- చర్చిస్తుందని వివరించారు. నేను ఇంజనీర్ కాదు... సాంకేతిక అధ్యయనం తర్వాతే నిర్ణయం తీసుకుంటాం అని పేర్కొన్నారు. ప్రజలు నాకు అధికారం ఇచ్చారు.. రాష్ట్ర సమస్యలను కేంద్రానికి తీసుకెళ్లడం నా బాధ్యతని సీఎం స్పష్టం చేశారు. ఢిల్లీకి కాకుండా ఫామ్ హౌస్‌కు వెళ్తే సమస్యలు పరిష్కారం కావు అని పరోక్షంగా కేసీఆర్‌పై విమర్శలు చేశారు. నెలకు ఖచ్చితంగా రెండు సార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో సమన్వయం చేసుకుంటానని హామీ ఇచ్చారు.ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో అసెంబ్లీలో చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. కేటీఆర్ నాయకత్వాన్ని చెల్లెలే అంగీకరించడం లేదు. గతంలో సవాల్ విసిరితే పారిపోయారని అంటూ తీవ్ర విమర్శలు చేశారు. గంజాయి బ్యాచ్‌కి నేను భయపడను. భయపడి ఉంటే నేను రేవంత్ రెడ్డి అవుతానా? అంటూ విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై మా వ్యూహం మాకుందని, కేటీఆర్ డ్రగ్స్ కేసుపై, గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతుందన్నారు. విలన్లు క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారని, కేటీఆర్ లోకేష్ ల మీటింగ్ సంగతేంటని ఆయన ప్రశ్నించారు. కిషన్ రెడ్డికి బీసీ రిజర్వేషన్లపై సవాల్ విసిరిన రేవంత్.. ఫోన్ ట్యాపింగ్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంతో కలిసి పని చేస్తామని, కేసీఆర్ సభకు రావాలన్నారు. తనపై ఉన్న కేసులపై హడావుడి చేయడం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు. నేను హడావుడి చేస్తే మళ్లీ మీడియానే ప్రశ్నిస్తుంది అంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ సీబీఐ కేసుల పేరుతో రాజకీయాలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. రెండేళ్ల తర్వాత కార్పొరేషన్ నామినే-టె-డ్ పోస్టులను మళ్లీ భర్తీ చేస్తామని సీఎం ప్రకటించారు. గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతుంది. విలన్లు ఎప్పుడైనా క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారు. కాళేశ్వరం, ఫోన్ టాపింగ్, హెచ్ఎండిఏ ఎన్నో కేసులో విచారణ జరుగుతుంది. ఫోన్ టాపింగ్ కేస్ హైకోర్టు పర్యవేక్షణలో జరుగుతుంది. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు హైకోర్టుకు వివరిస్తున్నాం. ప్రభాకర్ రావు ఇండియాకు ఆలస్యంగా రావడానికి కారణం కేంద్ర ప్రభుత్వమే.. కేంద్రం ఎందుకు ప్రభాకర్ రావును తీసుకురాలేదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కేసును సీబీఐకి ఇవ్వాలని కొందరు అడుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తులో ఏం తప్పులున్నాయో ఎత్తి చూపించండి. రాష్ట్రంలో దర్యాప్తు జరుగుతున్న పలు కేసులను ఈడీ తీసుకుంది. ఈ కేసుల విచారణలో పురోగతి ఎందుకు లేదో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ దిల్లీకి వెళ్లవచ్చు. రాష్ట్రం కోసం ఆయన పనిచేస్తానంటే ఎవరూ అడ్డుకోరు. గతంలో డ్రగ్స్ కేసులో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది నేను కాదు. ఛాలెంజ్ చేయడం.. కోర్టుకెళ్లి స్టే తెచ్చుకోవడం కేటీఆర్‌కు అలవాటే. శాఖాపరమైన విచారణలు రాత్రికి రాత్రి పూర్తికావని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మాకు వ్యూహం ఉంది. 50 శాతం రిజర్వేషన్లు వద్దని 2018లో పంచాయతీరాజ్ చట్టంలో కేసీఆర్ మార్పులు చేశారు. 2014కు ముందు 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 23 శాతానికి కుదించారు. రిజర్వేషన్ల కుదింపును సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. దీనిపై అవగాహన లేకుండా చాలా మంది మాట్లాడుతున్నారు. ముస్లిం రిజర్వేషన్లు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచే ఉన్నాయి. భాజపా పాలిత రాష్ట్రాల్లోనూ వారికి రిజర్వేషన్లు అమలవుతున్నాయి. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేసిన తర్వాతే కిషన్‌రెడ్డి మాట్లాడాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

# సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి

### ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటు

### రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరగా అనుమతులు

### కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన సిఎం రేవంత్



న్యూఢిల్లీ,జూలై17 : తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. రాష్ట్రంలో అధునాతన సౌకర్యాలు, పరిశోధన కేంద్రాలు ఉన్నందున మైక్రో ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబులతో కలసి ఆయన కేంద్రమంత్రిని కలిసారు. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ ఇప్పటికే పరిశోధనా సౌకర్యాలతో, సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ముందంజలో ఉన్నదని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉద్యోగాలు, పెట్టుబడులు పెరగడంతోపాటు–, దేశీయ టెక్నాలజీ రంగానికి తెలంగాణ కీలక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రూ.8 వేల కోట్ల విలువైన రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు– హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు– పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. దీంతోపాటు– కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు– చేసి, ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందించాలన్నారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు గ్రామీణ, పట్టణ ప్రాంతాల అనుసంధానాన్ని పెంచి, హైదరాబాద్‌లో రద్దీ తగ్గిస్తుందని సీఎం తెలిపారు. హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడరేవుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. ఈ మార్గం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు ఉపయోగపడుతుందని వివరించారు. ఇందులో భాగంగా వికారాబాద్ – కృష్ణా (122 కి.మీ. అంచనా వ్యయం రూ.2,677 కోట్లు–), కల్వకుర్తి – మాచర్ల (100 కి.మీ. అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు–), డోర్నకల్ – గద్వాల (296 కి.మీ. అంచనా వ్యయం రూ.6,512 కోట్లు–), డోర్నకల్ – మిర్యాలగూడ (97 కి.మీ. అంచనా వ్యయం రూ.2,184 కోట్లు–) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మార్గాలు రాష్ట్రంలో అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయ ఎగుమతులకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు– ఐటీ– మంత్రి శ్రీధర్ బాబు, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామ సహాయం రఘురామరెడ్డి, సురేశ్ షెట్కార్ కూడా హాజరయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, ఆర్ అండ్ బీ కార్యదర్శి వికాస్ రాజ్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ కూడా ఈ భేటీలో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణలో సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పార్క్, రైల్వే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే విషయంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు దోహదపడతాయని సీఎం అభిప్రాయపడ్డారు.

# బీహార్‌లో నితీష్ ఉచిత వల

### 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఆఫర్

పాట్నా,జూలై17 : బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో నితీష్ ప్రభుత్వం ఓటర్లపై ఉచితాల వలను ప్రయోగించింది. ప్రజలకు 125 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని గురువారం ప్రకటించారు. మొదటి నుండి రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరలకు విద్యుత్‌ను అందిస్తున్నాము. ఇప్పుడు ఆగస్ట్ 1 నుండి అంటే జులై బిల్లు నుండే రాష్ట్రంలోని గృహ వినియోగదారులు 125 యూనిట్ల విద్యుత్ వరకు ఎలాంటి నగదు చెల్లించాల్సి అవసరం లేదు. దీంతో రాష్ట్రంలోని మొత్తం 1.67కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో గృహాల పైకప్పులపై లేదా ప్రభుత్వ స్థలాల్లో సౌరవిద్యుత్ ఎ÷–లాంట్లను ఏర్పాటు– చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కుటీ–ర్ జ్యోతి పథకం కింద అత్యంత పేద కుటు–ంబాలకు, సౌరవిద్యుత్ ఎ÷–లాంట్లకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, మిగిలిన వారికి ప్రభుత్వం తగిన మద్దతును అందిస్తుందని తెలిపారు. అంటే గృహ వినియోగదారులు ఇకపై 125 యూనిట్ల వరకు విద్యుత్ కోసం ఎటు–వంటి ఖర్చు భరించాల్సిన అవసరంలేదని, రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 10,000 మెగావాట్ల వరకు సౌరశక్తి అందుబాటు–లో ఉంటుందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నేత, మాజీ డిప్యూటీ– సిఎం తేజస్వీయాదవ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తమ నేత 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని ప్రకటించడంతో బీహార్ సిఎం నితీష్‌కుమార్ దిగిరావాల్సి వచ్చిందని ఆర్‌జెడి అధికార ప్రతినిధి శక్తి సింగ్ యాదవ్ ఏద్దేవా చేశారు.

# బిఆర్ఎస్ హయాంలో వేల ఫోన్ల ట్యాపింగ్

### సిట్ ముందు వాంఙ్మూలం ఇచ్చిన తీన్మార్ మల్లన

హైదరాబాద్,జూలై1 : బీఆర్ఎస్ పాలనలో వేల ఫోన్లు ట్యాప్ చేసి ప్రజాస్వామ్యాన్ని కేసీఆర్ ఖూనీ చేసిందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విమర్శించారు. గురువారం ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు ఆయన హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా తీన్మార్ మల్లన్న స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. విచారణ అనంతరం మల్లన్న మీడియాతో మాట్లాడుతూ.. మావోయిస్టు సానుభూతిపరులనే ఆరోపణలతో మా ఫోన్లు ట్యాపింగ్ చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో తన రెండు ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయని తెలిపారు. అప్పటి ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా, ప్రజల అభీష్టానికి మద్దతుగా పోరాడుతున్నాననే నా ఫోన్ ట్యాప్ చేశారన్నారు. నాతో పాటు నా అనుచరుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని.. మా కదలికలు తెలుసుకోవడానికి ట్యాపింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రజల ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం అప్పటి ప్రభుత్వానికి ఏమి వచ్చిందని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ తీవ్రమైన నేరమని.. ట్యాపింగ్‌కి పాల్పడిన వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ట్యాపింగ్ విషయంలో నా అభిప్రాయాన్ని సిట్ అధికారులకు చెప్పానని.. అవసరమైతే మళ్ళీ పిలుస్తామని అధికారులు చెప్పారని తెలిపారు.

# నర్స్ నిమిష ప్రియ కేసు సున్నితాంశం

### ప్రభుత్వం చేయగలిగిన ప్రయత్నం చేస్తోంది

### విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్

న్యూఢిల్లీ,జూలై17 : యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటోన్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో ఉత్కంఠ కొనసాగుతోంది. విషయంలో భారత్ చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేస్తోందని, ఆమెను రక్షించే అవకాశాలను పరిశీలిస్తున్నామని, అయితే ఇది సున్నితమైన అంశమని తాజాగా విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఈ కేసులో అన్ని రకాలుగా సాధ్యమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఆమె కుటుంబం కోసం ఒక న్యాయవాదిని నియమించాం. కేసు పురోగతి వంటి వివరాలు తెలుసుకునేందుకు దౌత్యపరంగా సహకరిస్తున్నాం. అలాగే ఈ సమస్యను పరిష్కారం చూపేలా స్థానిక అధికారులు, కుటుంబ సభ్యులతో తరచూ సంప్రదింపులు చేస్తున్నాం అని జైశ్వాల్ వెల్లడించారు. ఈ ప్రయత్నాల ఫలితంగా ఇటీవల మరణశిక్ష వాయిదాపడిన అంశాన్ని ప్రస్తావించారు. ఇక కేసు విషయమై కొన్ని మిత్రదేశాలతో టచ్‌లో ఉన్నామని చెప్పారు. యెమెన్ జాతీయుడి హత్యకేసులో నిమిషకు మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. అది జులై 16న అమలు కావాల్సిఉండగా.. భారత ప్రభుత్వ ప్రయత్నాలతో తాత్కాలికంగా వాయిదాపడింది. నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించు కునేందుకు మరింత సమయం ఇవ్వాలని గత కొన్ని రోజులుగా యెమెన్ ప్రభుత్వాన్ని భారత్ కోరుతోంది. ఈ విషయంలో స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్‌తో నిరంతరం జరిపిన సంప్రదింపులు ఫలించాయని ఇటీవల మన ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. మరోపక్క.. మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబం మాత్రం ఆమెకు శిక్ష పడాల్సిందేనని పట్టు–బడుతోంది. మధ్యవర్తిత్వం, సయోధ్య కోసం ప్రస్తుతం జరుగుతోన్న ప్రయత్నాలు కొత్తవేమీ కావు. మాకు ఎలాంటి ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. డబ్బుతో మనిషి ప్రాణానికి వెలకట్టలేం. మాకు న్యాయం దక్కాల్సిందేననని అర్థం వచ్చేలా పోస్టులో మెహది సోదరుడు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

# జూలై 23 నా విద్య సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

### -వామపక్ష విద్యార్థి సంఘాలు



హైదరాబాద్ : నేడు హైదరాబాద్ జిల్లా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వామపక్ష విద్యార్థి సంఘాలు రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 23 వ తేదీన తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్య సంస్థల బంద్ ను విజయవంతం చేయాలనీ పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యాలయమైన మార్క్స్ భవన్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ కి పిడిఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, కంచనపల్లి శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్, పిడిఎస్‌యూహైదరాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాకేష్,హరీష్,పిడిఎస్‌యూ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌లు హాజరై మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు,ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకోడం కారణంగా అధికారాన్ని కోల్పోయింది. కెసిఆర్‌ను గద్దె దించే పోరాటల్లో ఈ వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయి.గత ప్రభుత్వం చేసిన తప్పిదలు మేము చేయము పేద విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిలను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తామని,విద్య రంగానికి 15% నిధులు కేటాయిస్తామని,నిరుద్యోగ సమస్య తీరుస్తామని తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనా అందిస్తామని అధికారంలోకి వచ్చిన ఈ రేవంత్ రెడ్డి సర్కార్ 2 సంవత్సరలు కావొస్తున్న కూడ ఇప్పటి వరకు పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోగ కనీసం విద్య రంగం ఎదురకొంటున్న సమస్యలపై ఒక సమీక్షా నిర్వహించకుండా ఇప్పటివరకు విద్య శాఖ మంత్రిని నియమించకుండా,ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ ప్రవేట్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ విచ్చలవిడిగా ప్రవేట్ యూనివర్సిటీలకు అనుమతులిస్తూ పేద,మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్రకు తెరలేపుతూన్నారన్నారు.ప్రజా పాలనా అని మాటల్లో చెపుతూ,ఆచరణలో అప్రజాస్వామ్య పాలనా కొనసాగుతుందన్నారు.ఇచ్చిన ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి ప్రశ్నించే వారిపైన అక్రమ కేసులు పెడుతున్నారన్నారు.ఒకవైపు ధనిక రాష్ట్రం అంటూనే మరో వైపు ఖజానా ఖాళీగా ఉందని నిస్సిగ్గుగా మాట్లాడుతున్న తీరు చేతగాని తనానికి నిదర్శనమన్నారు.ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని ఇచ్చిన హామీలను అమలు చేస్తూ,ఎలాంటి పెండింగ్ బకాయిలు పెట్టకుండా,విద్య రంగంలో ఉన్నా అన్ని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ, ఫీజు నియంత్రనా చట్టం తీసుకోస్తు, విద్యార్థులందరికి ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని మరియు జాతీయ నూతన విద్య విధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలనీ డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23 న తలపెట్టిన విద్య సంస్థల బంద్ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని బంద్ ను విజవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో నాయకులు నాగేంద్ర,గౌతమ్,ఆసిఫ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం

### ధైర్యే సహాసే లక్ష్మి,, ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు సాగాలని..

### ప్రభుత్వ సంకల్పమని శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



శామీర్ పేట, జూలై–17 (ది క్రైమ్ న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకొని రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం శామీర్ పేట మండలంలోని అలియాబాద్‌లోని శుభం పంక్షన్ హాల్‌లో సెర్ప్, మెప్మా ఆద్వర్యంలో స్వయం సహాయక సంఘాలు సభ్యులతో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల లో చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బ్యాంక్ లింకేజీ కింద 619 స్వయం సహాయక సంఘాలకు రూ. 38 కోట్ల 86 లక్షలు, 5 మండలాలకు 3698 స్వయం సహాయక సంఘాలకు సభ్యులకు వడ్డీ రాయితీ కింద కోటి 79 లక్షలు, 5 మంది మహిళలకు లోన్ భీమా కింద 3 లక్షల 19 వేల విలువగల చెక్కుల మేడ్చల్ శాసభ్యులు సిహెచ్. మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి లతో కలిసి చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీలో ఆడబిడ్డకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా సంఘాలకు బస్సులిచ్చి కిరాయికి ఇచ్చే విధంగా అవకాశం కల్పించామని, గతంలో మహిళలను లక్షాదికారులను చేయాలని లక్షం కాగా ప్రస్తుత ప్రభుత్వము కోటీశ్వరులను చేయాలని కృత నిశ్చయంతోపనిచేస్తుందని తెలిపారు. ఇందుకు అర్హులైన ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరేందుకు ప్రస్తుతం ఉన్న సభ్యులు, సంఘాంలో చేరితే వచ్చే లాభాలగురించి క్షుణ్ణంగా వివరించి నూతన సభ్యులకు సభ్వత్యం కల్పించాలని సూచించారు. మహిళలు నిర్ధిష్టమైన లక్ష్యాలను ఎంచుకొని అందుకు తగిని విధంగా ప్రణాళికను సిద్దం చేసుకుని, లక్ష్యాలను సాధించేందుకు మరింత కష్టపడాలని ఆయన తెలిపారు. చిన్న వ్యాపారమే కదా అని అనుకోకుండా, నిరంతరం కృషి చేస్తే మున్ముందు ప్రగతి సాధించడం పెద్ద కష్టం కాబోదని, తద్వారా ఆర్థికంగా ఎదుగుటకు దోహదపడుతుంది ఆయన సూచించారు. ఈ సందర్భంగా చామకూర మాల్లారెడ్డి మాట్లాడుతూ ,, ధైర్యే సహాసే లక్ష్మి,, ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు సాగాలని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 36 వేల స్వయం సహాయక సంఘాలలో సభ్యులు ఉన్నారని, అర్హులైన మహిళలందరిని స్వయం సహాయక సంఘాల గ్రూపులలో చేర్పింటకు కృషి చేయాలన్నారు. మహిళల స్వాలబన కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు రుణాలు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తుందని సూచించారు. ప్రపంచ దేశాలలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యం. మను చౌదరి మట్లాడుతూ మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువును అమ్ముకొనుటకు ప్రభుత్వ అవకాశాలు కల్పిస్తుందని, తద్వారా వచ్చే లాభాలను వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాని చెప్పారు. ఇంట్లో బాధ్యతలు నిర్వహణలో మహిళలే రోల్ మోడల్‌గా ఎదుగుతున్నారని, స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన సభ్యులకు వ్యాపారం చేసేందుకు కావల్సిన శిక్షణలు ఇస్తామని తెలిపారు. సమాజంలో మహిళలు అభివృద్ధి చెందితే వారి కుటుంబంతో పాటు రాష్ట్రం , దేశం మొత్తం బాగుంటదని ఆయన వివరించారు. అత్యదికంగా మహిళలు పనిచేస్తున్న దేశాలు అభివృద్ధిలో కొనసాగుతున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మహిళా సంఘాల ద్వారా లబ్దిపొందిన మహిళా సభ్యులు తమ తమ అనుభవాలను తెలియజేసారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధులు ఇందిరా మహిళా శక్తి పై పాడిన పాటలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా , వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింగ్ యాదవ్, గ్రందాలయ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఇంచార్జీ డిఆర్‌డిఓ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతమ్మ, జిల్లా సమాఖ్య అధ్యక్షులు అజయల క్ష్మి, తహాశీల్దార్, యంపిడిఓ, అలియాబాద్ మున్సిపల్ కమీషనర్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సెర్ప్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

### ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో మంత్రి వివేక్

మెదక్,జూలై17 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం మెదక్ లో ఇందిరా మహిళాశక్తి సంబురాలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. మొదటి విడత నిదిరమ్మ ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని.. వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో మహిళలకు పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. అర్హులైన అందరికీ సర్కార్ పథకాలు ఇస్తున్నామని.. ఆర్థిక ఇబ్బందులున్నా కూడా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, క్యాంటీ–న్లు ఇస్తున్నామని అన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధుల విషయంలో బీజేపీ ఎంపీలు కృషి చేయాలని అన్నారు మంత్రి వివేక్. హామీల అమలుపై ప్రతి నెల రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా పాలనలో ప్రజల సమస్యలకోసం కంకణ బద్ధులై పనిచేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖజానా చూస్తే అప్పులే ఉన్నాయని. ఖజానా మొత్తం ఖాళీ అయిందని.. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసిందని మంత్రి వివేక్ అన్నారు. పదేళ్లలో గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ లు ఇవ్వలేదని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెదక్ నియోజకవర్గంలో 9 వేల ఇండ్లు ఇవ్వడం జరిగిందని అన్నారు మంత్రి వివేక్. ఖజానా ఖాళీ ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్లు ఎలా ఇస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయని.. ముఖ్యమంత్రి మాట ప్రకారం ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మహిళలకు మేలు చేయాలని గరీబి హటావో స్కీం తీసుకొచ్చారని.. బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.కార్యక్రమంలో ఎంపిరఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు

### బిఆర్ఎస్ నేతల ఇళ్లపై దాడులు

### కెటిఆర్‌పై చిల్లర విమర్శలు మానాలి

### బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,జూలై17 : రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటి పైన దాడి, నా క్యాంపు కార్యాలయం, పాడి కౌశిక్ రెడ్డి ఇంటి పైన, సునీత లక్ష్మారెడ్డి పైన , మర్రి రాజశేఖర్ రెడ్డిపైన దాడి చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్రంలో పూర్తిగా శాంతి భద్రతలు కరువై హత్యలు, ఎక్కువ అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్ర ఆదాయం పడిపోయింది. చిల్లర మాటలు బంద్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశాడు. ఎవడో దుబాయ్‌లో చనిపోతే మా కేటీఆర్‌కు ఏం సంబంధం. ఆ రిపోర్ట్ నీ దగ్గర ఏమైనా ఉంటే రేవంత్ రెడ్డి ముక్కులో పెట్టు–కో. ఈడీ ఎందుకు రేవంత్ రెడ్డిని అరెస్ట్ చెయ్యడం లేదు, కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డికి అండగా ఉంటు–న్నాడు. కేంద్రంతో సఖ్యతతో ఉంటానని పేరుకే అంటు–న్నావు, నీ వల్ల రాష్ట్రానికి ఒక్క ఉపయోగం జరగలేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేటీ–ఆర్ పైన చేసిన ఆరోపణల్లో రుజువు ఉంటే చూపించు లేదంటే కేటీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పు రేవంత్ రెడ్డి. లోకేష్, కేటీఆర్‌ను అర్ధరాత్రి పూట కలిశాడు అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. అర్ధరాత్రి పోయి కలిసే అలవాటు– రేవంత్ రెడ్డికే ఉన్నది, మా కేటీఆర్‌కు లేదు. ఈ రాష్ట్రం కోసం, ప్రజల కోసం మేము భయపడం. ఏదో ఒకటి చేసి మా పైన కేసులు పెడితే మేము భయపడతాం అని రేవంత్ రెడ్డి అనుకుంటు–న్నాడు. మా పై తెలంగాణ ఉద్యమంలో 300 పైగా కేసులు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు. మా పైన ఇంటిలిజెన్స్ వ్యవస్థతో రేవంత్ రెడ్డి నిఘా పెడుతున్నాడు, మాకేం కాదు. రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను రోజూ ట్యాప్ చేస్తున్నాడు. మా వెనుక ఇంటలిజెన్స్ వాళ్ళను పెట్టి ఎక్కడ అంటే అక్కడ తిప్పుతున్నారు. మా చుట్టూ నిఘా పెట్టారు. మా అందరి ఫోన్స్ ట్యాప్ అవుతున్నవి. విలేకరుల ఫోన్ ట్యాప్ చేస్తున్నారా. నా తో విలేకరులు మాట్లాడేది ఎలా తెలుస్తుందని అన్నారు.

## సంపాదకీయం

# హద్దుమీరుతున్న నేతల రాజకీయ భాష!

రాజకీయ నాయకుల విమర్శల్లో భాష హద్దు దాటుతోంది. హుందాగా ఉండాల్సిన వారు బజారు భాష మాట్లాడుతున్నారు. విమర్శల కోసం ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ముఖ్యంగా పదేళ్లు అధికారం వెలగబెట్టిన బిఆర్ఎస్ నేతలు, ఐదేళ్లు అధికారం వెలగబెట్టిన వైకాపా నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారు. పత్రికలు, ఛానళ్లు కూడా వీటిని యదాతథంగా ప్రసారం చేస్తున్నాయి. నాయకుల విమర్శలు చేసే సమయంలో మాట్లాడే భాషపై ఆంక్షలు విధించాలి. లేకుంటే రానురాను అది పరిధి దాటి పోగలదు. మంత్రులుగా చేసిన వారు, ముఖ్యమంత్రులుగా చేసిన వారు సైతం భాషను పరిధి దాటి వినియోగిస్తు న్నారు. సన్నాసి, లుచ్ఛా లఫంగా, ఏం పీకుతావ్, రఫారఫా,సిగ్గులేదు... ఇలా అనేక రకాల పదాలు వాడుతున్నారు. కావాలనే అన్ని పదాలను ఇక్కడ ప్రస్తావించడం లేదు. తెలంగాణలో దాదాపు పదేళ్లు పాలన చేసిన కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో భాషను సాధనంగా చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరవాత మార్పు కనిపించింది. మధ్యలో కొంతకాలం మళ్లీ ఎదురుదాడి చేసే సమయంలో దుర్భాషను వాడారు. ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులతో పాటు ఇతర నేతలు కూడా హద్దుమీరి మాట్లాడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్ నేతలే కొంత సంయమనం పాటిస్తున్నారు. ఎపిలో జనగ్ ఆయన అనుచరులు కూడా ఇలాగే తెగించారు. ఇలాంటి భాష మాట్లాడితే ప్రజలు మెచ్చి అధికారం కట్టబెడతారని వారు భావిస్తున్నట్లుగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కల్వకుంట్ల కుటుంబ సభ్యులంతా అధికారం అనుభవించారు. వారి చుట్టాలు, పక్కాలు, కులమైతే చాలన్నట్లుగా పదవులను చేపట్టారు. సంతోష్‌తో పాటు సమీప బంధువులు కూడా మంత్రి పదవుల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనేక ఉన్నతస్థాయి నామినేటెడ్ పదవులు పొందారు. ఉద్యమం చేసి ప్రాణత్యాగాలు చేసిన 1400 మంది కుటుంబాలను, ఇతరులను ఉద్యమ నాయకుడు కెసిఆర్ గడ్డిపరకల్లా తీసి అవతల పడేశారు. ప్రొపెసర్ కోదండరామ్ లాంటి వారిని కూడా మర్చిపోయారు. జర్నలిస్టులను గంజిలో ఈగల్లాగా విసిరి పడేశారు. ఇప్పుడు అధికారం పోయేసరికి వారికి పిచ్చెక్కినట్లుగా ఉంది. అందుకే ఏడాదిన్నరకే నిత్యం రంకెలు వేస్తున్నారు. కాంగ్రెస్ మొత్తం ఏదో తప్పిదం చేసిందన్న భావనలో ఉచ్చనీచాలు మరచి విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా కెటిఆర్ వాడుతున్న భాష జుగప్సాకరంగా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించా క అధికారం చేబూనిన కల్వకుంట్ల కుటుంబం అసలు ప్రజలను మనుషులగా చూడలేదు. తెలంగాణను తమ సొంత జాగీరుగా భావించారు. ఆడిందే ఆటగా పాలన సాగించారు. అధికారంలో ఉండి లక్షలాది మంది ఉద్యమకారుల త్యాగాలను, ఆశయాలను తుంగలో తొక్కారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ సామాజిక వర్గపు వారి సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. పోలీసులు,ఇతర అవినీతి అధికారుల అండదండలతో ప్రజాధనాన్ని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేలాది ఎకరాల భూములను కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, కుటుంబానికి వత్తాసు పలికిన నాయకులకు పంచిపెట్టడం జరిగింది. కాళేశ్వరం మొదలు అనేక విషయాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఎంతగా తెగించారా అని అర్థం అవుతోంది. ఎసిబి దాడులు, ఇడి విచారణలు, కొనసాగుతున్న దర్యాప్తులతో కళ్లు చెదిరిపోతున్నాయి. వందలకోట్లు అధికారులే వెనకేసుకుంటే ఇక అసలు నాయకులు ఎంత వెనకేసుకున్నారో ఊహించుకోవచ్చు. అంతెందుకు ఫార్ములా కేసులో డబ్బులు నేరుగా దాటించిన కెటిఆర్ బరితెగించి మాట్లాడుతున్నారు. లొట్టపీసు కేసు అని అంటున్నారు. అంటే ఎంతగా డబ్బు మదం ఉంటే ఇలా మాట్లాడగలరో అర్థం చేసుకోవాలి. ఇలా లొట్టపీసు కేసు..ఏం పీక్కుంటారో పీక్కోండి అని అనడం ఎంతవరకు సబబో చెప్పాలి. ఎపిలో జగన్ కూడా ఇలాగే నా వెంట్రుక కూడా పీకలేరు అని అనడం చూశాం. ఇలా మంత్రులుగా, సిఎంగా చేసిన వ్యక్తులు మాట్లాడాల్సిన భాషేనా అని ప్రజలు నిలదీసే రోజులు తప్పకుండా వస్తాయి. రావాలి కూడా. అనేక ప్రభుత్వ శాఖలలో కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్న అనేక దర్యాప్తుల విషయాలను సోషల్ మీడియా ప్రజలకు తెలియజేయడం తప్పు ఎలా అవుతుంది.? తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజలపై మీడియా సంస్థలపై ప్రతిపక్షాలపై నిఘా, నియంత్రణ, అణచివేత కొనసాగిన విషయం కేటీఆర్ మర్చి పోయి ఉంటాడు. అందుకే అసహనంతో విమర్శలు చేసే క్రమంలో ఉచ్చనీచాలు మరచి మాట్లాడుతున్నారు. అధికారం ఉన్నప్పుడు తెలంగాణ నీళ్లు పంపిణీ చేసి రాయలసీమను రతనాల సీమను చేస్తామని ప్రకటించారు. ఇప్పుడేమో సిఎం రేవంత్ రెడ్డి బాబుకు నీళ్లు దానం చేశారని విమర్శలు చేస్తున్నారు. మేడిగడ్డమీద చర్చ పెడతామంటారు. సవాళ్లు విసరుతారు. నిజానికి ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ఉన్నవి సవాళ్లు విసరడానికా లేక పాలన సాగించడానికా అన్నది ప్రజలు చర్చించాలి. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కాళేశ్వరం ప్రారంభోత్సవానికి పిలవడం చూశాం. ఆయన ప్రమాణస్వీకారానికి అమరావతి వెళ్లి సంబురాలు చేసుకోవడం చూశాం. మంత్రి రోజా ఆహ్వానాన్ని అందుకొని నగరి సందర్శించి ఆతిథ్యం పుచ్చుకోవడం కూడా చూశాం. ఇవన్నీ మరచిపోయిన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు ఇష్టానుసరాంగా వ్యంగ్యాలు పలుకుతున్నారు. కేవలం ఒక కుటుంబం అధికారానికి, అక్రమాస్తుల కోసం, అహంకారానికి మాత్రమే తెలంగాణ సాధించామా అన్న బాధ కలుగుతోంది. ఇకనైనా తెలంగాణ ప్రజల భాషను, నిజాయితీ, సంస్కృతి, మంచితనం పాటిస్తే మంచిది. జగన్ కూడా తనతండ్రి వైఎస్ లాగా హుందాగా ఉండడం నేర్చుకోవాలి. భాషను తిట్టడానికి ఉపయోగించరాదు. ఇరుపార్టీల నేతలు హుందాగా ప్రతిపక్ష బాధ్యతలు నెరవేర్చాలి. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపాలి. ప్రజలకు మేలుచేసేలా చర్యలు ఉండాలి. ప్రతిపక్ష పాత్రను క్రమశిక్షణతో,బాధ్యతగా నిర్వహించినప్పుడే ప్రజలు ఆదరిస్తారని గుర్తించి మసలుకుంటే మంచిది.

# ఎరువులు ఇవ్వరెందుకు?



రాష్ట్రంలో ఎరువుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు అనుభవించిన ఈ బాధలు మళ్లీ ఇప్పుడు స్వరాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో పునరావృతమయ్యాయి. సర్కారు చేతులెత్తేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడచూసినా అన్నదాతల చెప్పులు, పాస్ పుస్తకాల క్యూ లైన్లు కనిపిస్తున్నాయి. సరిపడా యూరియా లేదని చెబుతూ అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. మన దేశంలో 95 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే. వీరిపై అధిక భారం పడకుండా ప్రభుత్వాలు ఎరువులను సబ్సిడీపై అందించాలి. కానీ, దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, ఇప్పుడు పాలిస్తున్న బీజేపీ రైతులను పట్టించుకున్న పాపానపోలేదు. కొన్నేండ్లుగా దేశంలో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. వాణిజ్య పంటల సాగు కూడా ఎక్కువ అయ్యింది. దాంతో రసాయన ఎరువుల వాడకం గణనీయంగా పెరిగింది. సేంద్రియ సాగును ప్రోత్సహించడంలో భాగంగా పీఎం ప్రణామ్ పథకాన్ని తీసుకువచ్చిన కేంద్ర ప్రభుత్వం ఎరువులపై ఇచ్చే రాయితీలను క్రమంగా ఎత్తివేస్తున్నది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఎరువులపై రూ.2.54 లక్షల కోట్లు సబ్సిడీ ఉండగా, తర్వాతి ఆర్థిక సంవత్సరంలో దాన్ని రూ.1.75 లక్షల కోట్లకు తగ్గించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఎరువులపై ఇచ్చే సబ్సిడీ నిధుల్లో కేంద్రం 22.25 శాతం కోత విధించింది. గత యాసంగి పంట సీజన్‌కు సంబంధించి నత్రజని, భాస్వరం, పొటాష్, సల్ఫర్ వంటి ఎరువుల సబ్సిడీ కింద రూ.51,875 కోట్లను కేంద్రం కేటాయించగా, ఈసారి రూ.22,303 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే 57 శాతం కోత విధించింది. ఈ క్రమంలోనే రాష్ట్రాలకు ఎరువుల సరఫరాను కూడా కేంద్రం తగ్గించింది. అంతేకాదు, వాడకం ఎంత తగ్గిస్తే అంత ఎక్కువగా ప్రోత్సాహకాలు ఇస్తామని, ఆ మేరకు సబ్సిడీ మొత్తాన్ని ఇతర అవసరాలకు కేటాయిస్తామని ఆశచూపడంతో రాష్ట్రాలు కిక్కురుమనడం లేదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఎరువుల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు, ఇంధన ధరలు అంతర్జాతీయంగా గణనీయంగా తగ్గాయి. టన్ను యూరియా ధర గతేడాది 627 డాలర్లు ఉండగా, ప్రస్తుతం 330 డాలర్లకు పడిపోయింది. అదే విధంగా డీఏపీ ధర 925 డాలర్ల నుంచి 540 డాలర్లకు తగ్గింది. ఫాస్పారిక్ యాసిడ్, అమ్మోనియా ధరలు ఏడాది వ్యవధిలో 35 శాతం వరకు తగ్గాయి. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గాయన్న విషయాన్ని కేంద్రం ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతున్నది. పైగా రికార్డు స్థాయిలో ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ భారాన్ని రైతులపై మోపడం లేదని అబద్ధాలు వల్లె వేస్తున్నది.

## బీహార్‌లో ఆందోళన కలిగిస్తున్న హత్యలు

### పట్టపగలే ఆస్పత్రితో నేరస్థుడిని హతమార్చిన దుండగులు

పాట్నా : అసెంబ్లీ ఎన్నికల ముందు బీహార్‌లో హత్యల పరంపర ఆందోళన కలిగిస్తోంది. మొన్నటికి మొన్న బీజేపీ నేత, వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా ఇంటి దగ్గరే హత్యకు గురయ్యారు. కారులో ఇంటికి చేరిన ఆయన్ను అతి సమీపం నుంచి తుపాకీతో కాల్చడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన నుంచి ఇంకా తేరుకోక ముందు తాజాగా గురువారం ఉదయం పట్టపగలు ఆస్పత్రిలో కరుడుగట్టిన ఒక నేరస్థుడ్ని ప్రత్యర్థి గ్యాంగ్ తుపాకులతో కాల్చి చంపింది. ఈ ఘటన రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నితీష్ ప్రభుత్వంలో ప్రజలకు భద్రత కరవైందని విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. కరుడుగట్టిన నేరస్థుడు చందన్ మిశ్రా వైద్యం నిమిత్తం పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. పాట్నాలోని పరాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ప్రత్యర్థి వర్గానికి ఐదుగురు సభ్యులు కలిగిన ముఠా ఆస్పత్రిలోని చందన్ మిశ్రా ఉన్న గదిలోకి ప్రవేశించి తుపాకులతో విరుచుకుపడ్డారు. బుల్లెట్లు- దూసుకెళ్లడంతో చందన్ మిశ్రా అక్కడికక్కడే చనిపోయాడు. ఇక తుపాకీ శబ్దాలకు రోగులు, బంధువులు హడలెత్తిపోయారు. అనంతరం దుండుగులు అక్కడ నుంచి పరారయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయింది. బక్సర్ జిల్లా నివాసి అయిన చందన్ మిశ్రా కరుడు గట్టిన నేరస్థుడు. అతడిపై డజన్ల కొద్దీ కేసులున్నాయి. భాగల్పూర్ జైల్లో ఉంటున్నాడు. వైద్య చికిత్స కోసం పెరోల్‌పై పాట్నా ఆస్పత్రికి వచ్చాడు. అయితే ప్రత్యర్థి వర్గం కాల్చి చంపినట్లు పోలీసులు తెలిపారు. బాక్సర్ జిల్లా పోలీసుల సాయంతో నిందితులను గుర్తించినట్లు- పోలీసులు వెల్లడించారు. ఈ హత్యలో ఆస్పత్రి సిబ్బంది ప్రమేయం ఉందా? అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు- సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ కార్తీకాయ్ శర్మ పేర్కొన్నారు. చందన్ మిశ్రా గాయాలతో ప్రాణాలు కోల్పోయాడని చెప్పారు. నేరస్థులను పట్టుకుంటామని ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా హామీ ఇచ్చారు. ఇటువంటి సంఘటన దురదృష్టకరమని... దీనిపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందని చెప్పారు. నేరస్థులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అన్నారు. అయితే ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, హత్యలకు సిఎం సమాదానం చెప్పాలని విపక్ష తేజస్వీ యాదవ్ డిమాండ్ చేశారు.




## వల్లభనేని వంశీకి షాక్

### ముందస్తు బెయిల్‌పై మళ్లీ విచారించండి

### హైకోర్టుకు సుప్రీం ధర్మాసనం ఆదేశం

న్యూఢిల్లీ : అక్రమ మైనింగ్ కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీం ధర్మాసనం పక్కన పెట్టేసింది. ఈ కేసులో వంశీకి ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం అనుమతించింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినకుండా ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని సుప్రీం తప్పుబట్టింది. ఈ క్రమంలో గన్నవరం వైసిపి నేత వల్లభనేని వంశీ ముందస్తు బెయిల్ పై మరోసారి హైకోర్టులో విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వంశీకి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఏపీ ప్రభుత్వ వాదనలు వినకుండా హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టుకు తెలిపారు. విచారించిన సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పై తాజాగా విచారణ చేపట్టాలని హైకోర్టును ఆదేశించింది. ఇరువురి వాదనలు విని మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసిన నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వారం రోజుల్లో కౌంటరు దాఖలు చేస్తామని ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. ఈ పిటిషన్‌పై తాజాగా విచారణ చేపట్టాలని ధర్మాసనం ఆదేశించింది. కేసు మెరిట్స్‌లోకి, పీటీ- వారెంట్స్‌లోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది న్యాయస్థానం. ఇరువురు వాదనలు విని మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టును ఆదేశించింది సుప్రీం. వారం రోజుల్లో కౌంటర్ దాఖలు చేస్తామని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ.. కోర్టుకు చెప్పారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు ఇవ్వాలని ఏపీ హైకోర్టును సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. ఫిబ్రవరి 16న హైదరాబాద్‌లో ఉన్న వంశీని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గన్నవరంలో టీ-డీపీ కార్యాలయంపై దాడి, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు, భూ కబ్జా, నకిలీ ఇళ్ల పట్టాల కేసు ఇలా వివిధ కేసుల్లో దాదాపు 137 రోజుల పాటు- జైలులో ఉన్న వంశీ ఇటీ-వలే విడుదలయ్యారు. ఆయనపై నమోదైన కేసుల్లో కొన్నింటికి ముందుస్తు బెయిల్, మరికొన్ని కేసుల్లో షరతులతో కూడిన బెయిల్ లభించడంతో ఈనెల 2న వంశీ విజయవాడ జైలు నుంచి బయటకు వచ్చారు.


## లిక్కర్ కేసులో అసలు దోషి జగన్

### అందుకే ఎదురుదాడి విమర్శలు

### మండిపడ్డ మాజీమంత్రి సోమిరెడ్డి

నెల్లూరు,జూలై17(ఆర్ఎన్ఎ): ఏపీ లిక్కర్ కేసులో అసలు బాస్ జగనేనని ప్రపంచానికి తెలిసిపోయిందని టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ భయంతోనే జగన్ అతి క్రూర మనస్తత్వంతో వ్యవహారిస్తున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఘాటు విమర్శలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ డిప్రెషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. 'సినిమాల్లో విలన్స్ నరికేయండి.. ఆ నా కొడుకుని అని అంటారు.. నువ్వ కూడా అదే డైలాగ్ చెబుతావా? ఇటువంటి వాళ్లని చూస్తే రాజకీయాల్లోకి ఎందుకొచ్చామా అనిపిస్తుందని అంటూ కామెంట్స్ చేశారు. టీడీపీ ముఖ్య నేతలు ఏమి చేశారని జైళ్లకి పంపారని ప్రశ్నించారు. చంద్రబాబు ఇళ్లు, పార్టీ కార్యాలయంపై దాడులు ఎందుకు చేయించారని నిలదీశారు. జగన్ బుద్ధిమంతుడు.. తాము అరాచకవాదులమా అంటూ ఫైర్ అయ్యారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారని విమర్శించారు. 11 సీట్లతో ప్రజలు ఈడ్చికొట్టారు. అసెంబ్లీకి రావంటావా? రిజైన్ చేయి, మీ ఎమ్మెల్యేలతో రిజైన్ చేయించు. సిట్ కేసులో రూ.3200 కోట్లు ఎక్కడికి పోయాయో చెప్పు అంటూ సోమిరెడ్డి సవాల్ చేశారు. ఇన్ని కేసులు ఉన్నా నోరు మెదపవే. నీ మద్యం తాగించి 33 మందిని చంపేశావ్? లక్షల మందిని బెడ్ ఎక్కించావ్?' అంటూ జగన్‌పై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అరాచక పాలన సాగించిన జగన ఇప్పుడు నీతులు పలుకుతున్నారని, మళ్లీ తమదే రాజ్యం అంటూ పోజులు కొడుతున్నారని మండిపడ్డారు. కలలో కూడా ప్రజాలు జగన్‌ను నమ్మరని అన్నారు.

## మనసును అదుపుతోనే విజయం సాధ్యం!



ఆధ్యాత్మికం

తిరుమల : మనిషి బలం, బలహీనత... రెండూ మనసే. మనిషిని దైవత్వానికి చేరువ చేసేది మనసే. రాక్షసుడిగా దిగజార్చేది మనసే. బలహీనమైన మనసు ప్రతి అల్ప విషయానికీ ఉద్విగ్న భరితమవుతుంది. ప్రశంసిస్తే ఆకాశంలో విహరిస్తుంది. విమర్శిస్తే పాతాళానికి కుంగిపోతుంది. తాళం చెవి ఎడమవైపు తిప్పితే గడియ పడుతుంది, కుడిపక్కకు తిప్పితే గడియ తెరుచుకుంటుంది. మనసూ ఎటు తిప్పితే అటు తిరుగుతుంది. భౌతిక సుఖాలకు వ్యతిరేకంగా తిప్పితే ఆధ్యాత్మికత వైపు తిరుగుతుంది. మనసులోని వ్యతిరేక భావనలను తొలగించి సానుకూలమైన ఆహ్లాదకరమైన ఆలోచనలతో నింపితే శారీరక రుగ్మతలూ దగ్గరకు రావు. నేటి శాస్త్రవేత్తలు కూడా చాలా రోగాలకు కారణం మనసే అని,మనసు హాయిగా ఉంచుకున్నవారికి రోగాలు దరిచేరవని ధృవీకరిస్తున్నారు. ధర్మబద్ధమైన కర్మలను నిష్కామంగా ఆచరిస్తూ బుద్ధికి మనసును అప్పజెప్పి జీవనయానాన్ని కొనసాగించాలి. ఎప్పటికప్పుడు ఆత్మావలోకనం చేసుకుంటూ మనసులో చెలరేగే ఆలోచనలు ప్రలోభాలు సంఘటనలను అవగాహన చేసుకుని, విచక్షణతో వాటి ప్రభావాన్ని కొద్దికొద్దిగా తగ్గించు కోవాలి. అప్పుడు కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు దారి తప్పకుండా ఉంటాయి.

## శ్రీ ఆదర్శ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు





**పెద్దపల్లి ప్రతినిధి:** పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి శ్రీ ఆదర్శ పాఠశాలలో గురువారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు బోనాలు తీసుకొని పోచమ్మ దేవాలయనికి వెళ్లి మొక్కలు చెల్లిచుకున్నారు. పిల్లలు పోతారాజుల వేశాధారణతో నృత్యాలు చేస్తూ విద్యార్థులు డాన్సలు చేస్తూ గ్రామ ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీఆదర్శ పాఠశాల కరెస్పాండెంట్ చిప్ప భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణలో బోనాల పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.ఈ పండుగ ఆషాడ మాసంలో ప్రారంభమై శ్రావణమాసం చివరిదాకా జరుపుకోవడం జరుగుతుందని, వర్షాలు బాగా కురవాలని పాడి పంటలు బాగా అభివృద్ధి చెందాలని ప్రజలంతా ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పోతరాజు విన్యాసాలు గ్రామ ప్రజలను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు చిప్ప సుజాత, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవు

**- ఎస్ఐ సిరిసిల్ల అశోక్**



**ఇల్లంతకుంట, జూలై 17,:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ లో గురువారం స్థానిక పోలీసులు వాహన తనిఖీ నిర్వహించారు. ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ..... నెంబర్ ప్లేట్ లేని వాహనాలు రోడ్లపై తిరిగినా, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడినా కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తామని కావున ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. బాధ్యతారహితంగా మైనర్లకు వాహనాలిచ్చి రోడ్లపైకి పంపిస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ హెచ్చరించారు.


## పార్టీ మహాసభలకు కదిలిన కమ్యూనిస్టులు



**యైటింక్లయిన్ కాలని.** పెద్దపల్లిలో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా 4వ మహాసభకు కాలనీ పట్టణ పార్టీ శ్రేణులు గురువారం తరలివెళ్లారు. పార్టీ చేపడుతున్న పోరాటాలకు ఆకర్షితులై, సిద్ధాంతాలకు కట్టుబడి కార్మిక, కర్షక, యువజన, మహిళా, విద్యార్థి సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వంతో కదం కలిపేందుకు కదిలిన కాలనీ కమ్యూనిస్టులు జిల్లా సభలకు ఉదయం బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఈ మహాసభలు పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యలపై సమగ్ర పోరాట కార్యాచరణ రూపొందించడానికి, మార్గదర్శకంగా నిలవనున్నాయ న్నారు. ఈ మహాసభలలో భాగ స్వాములు కావడం గర్వకారణ మని, పార్టీ పటిష్టత కోరకు, ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు ఈ సభలు దశ, దిశ ను చూపుతుందని వ్యాఖ్యానించారు. ఇక మహా సభలకు తరలివెళ్లిన వారిలో పార్టీ కమాన్ పూర్ మండల కార్యదర్శి కె.రాజారత్నం, నాయకులు ఎల్. ప్రకాష్, జి. రవీందర్, బి. అన్నారావు, శ్యామ్సన్, జి. సాంబశివరావు, బుర్ర తిరుపతి, కొండ్ర సత్యనారాయణ, సురేష్, నారాయణ, ఆంజనేయులు, లింగయ్య, గోపాల్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు మంత్రి అడ్లూరి అభినందనలు

**మానకొండూర్, జూలై 17,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదీప్ (పాట్నా), శ్రీరామ్ (వారణాసి) ఐఐటీలో ఇటీవల సీటు సంపాదించగా విద్యార్థులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభినందించారు.ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఎస్సీ, ఎస్టీ గురుకులాలు ఉన్నాయని తల్లిదండ్రులు గురుకులాలను వినియోగించుకుని విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరుతూ విద్యార్థుల కృషి కారణమైన ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, అధ్యాపకులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గురుకులాల సమన్వయ అధికారి, ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, సీనియర్ తెలుగు అధ్యాపకులు శివకుమార్,వీరయ్య విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోను రాణించి నెంబర్ వన్ స్థాయికి చేరాలి

## ◆ కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి 17( హైదరాబాద్ న్యూస్ )** గురువారం చిట్యాల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. 10 వ తరగతి గదిని పరిశీలించి విద్యార్థులతో హిందీ పాఠం చదివించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో బాగా రాణించాలంటే ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపల్ కు సూచించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని, తల్లిదండ్రులు నుండి దూరం వచ్చి చదువుకుంటున్నారని, విద్యార్థులను మన పిల్లలుగా భావించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ, విద్యా ప్రగతికి బాటలు వేయాలని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్టోర్ రూము, వంటగదిని పరిశీలించి వంట గది నిర్వహణను స్వయంగా ఫోటో తీసుకున్నారు. పాఠశాల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ భోజనం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భోజనం బావుంది... స్టోర్ రూమ్ నిర్వహణ బావుంది.. ఇలానే మంచిగా నిర్వహించండని సిబ్బందిని అభినందించారు. విద్యార్థులకు వసతి, భోజనంతో విద్యాభ్యాసానికి మంచి వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. భోజన సమయంలో విద్యార్థులతో రాహుల్ శర్మ స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి అభిప్రాయాలను సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మురుగునీరు వెళ్లేందుకు అవుట్ లెట్, కాంపౌండ్ వాల్, సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ప్రిన్సిపాల్ కోరగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఎంపీడీవో జయశ్రీ, ప్రిన్సిపల్ సుమలత తదితర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ-1 భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ

**తిమ్మాపూర్, జూలై 17,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మనగర్ లో 12లక్షల ప్రభుత్వ నిధులతో మంజూరైన అంగన్వాడీ-1 కేంద్ర భవనానికి గురువారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ..... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా, వైద్యానికి పెద్దపేట వేసి అంగన్వాడీల ద్వారా గ్రామస్థాయిలో చిన్నపిల్లలకు, గర్భిణీస్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం గొప్ప విషయమని, అంగన్వాడి కేంద్రాన్ని త్వరగా నిర్మించి పిల్లలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, జిల్లా మహిళ సంక్షేమ అధికారిణి పీడీ సత్యవతి, సిడిపిఓ, అంగన్వాడీ మండల సూపర్ వైజర్ ఇస్రత్ సుల్తానా, స్పెషల్ ఆఫీసర్ సురేందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు రాచపల్లి సరిత, మాజీ ఎంపీపీ కుంట రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు కేతిరెడ్డి ఎల్లారెడ్డి, ఎండి.సమద్, గూడ కమలాకర్, అల్లాడి రఘు, రాచపల్లి దుర్గా ప్రసాద్, సోమయ్యగారి అశోక్, ఎండి. అంకూస్, కన్నం రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో అధిక ఫీజుల దోపిడి అరికట్టాలి

**- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్**

**- రాష్ట్ర ప్రభుత్వం పీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి -**


**బుక్స్ యూనిఫామ్ అధిక ధరలకు అమ్ముతున్న ప్రైవేటు స్కూల్ల పై చర్యలు తీసుకొని పర్మిషన్ లేని ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయాలి**



**పెద్దపల్లి ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్య వ్యాపారాన్ని అరికట్టాలని పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 25% ఉచితంగా విద్య హక్కు చట్టం ప్రకారం సీట్లు కేటాయించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలో అధిక ఫీజుల దోపిడి జరుగుతుందని, పుస్తకాలు, యూనిఫామ్, అడ్మిషన్ ల పేరుతో అధిక ఫీజుల దోపిడిని ఆరికట్టడంలో జిల్లా విద్యాధికారి, జిల్లా స్థాయి అధికారులు విఫలం అయ్యారని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ఎంఈఓ లు ప్రైవేటు స్కూల్ యజమానులతో కుమ్మక్కై విచ్చలవిడిగా అధిక ధరలకు బుక్స్ యూనిఫామ్స్ పర్మిషన్ లేని బిల్డింగ్లలో రాత్రి పగలు అమ్ముకుంటున్న వాటిపై చర్య తీసుకోకుండా నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ప్రభుత్వ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ స్పందించి ప్రైవేటు పాఠశాలల యజమానులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో అనుమతి లేని పాఠశాలలపై కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ పీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమాని నిర్వహించడమే కాదు ప్రభుత్వ ఉద్యోగులు,పిల్లలు ఎంపీ,ఎమ్మెల్యే ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచ్ అందరు ప్రభుత్వ బడులలో వారి పిల్లల్ని చేర్పించాలని అప్పుడే నిజమైన బడిబాట కార్యక్రమానికి ఉపయోగం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వం విద్యకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ ప్రైవేట్ పాఠశాలలో ఇష్టానుసారంగా ఫీజులు దోపిడి చేస్తూ అడ్మిషన్ పేరుతో స్టేషనరీ పేరుతో దీంతో ఒక్కొక్క విద్యార్థితో, విద్యార్థుల తల్లిదండ్రులకు అనేక భారం అవుతున్న పరిస్థితి ఉందని, వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉందని పేద, మధ్యతరగతి కుటుంబంలో ఉన్నటువంటి విద్యార్థులు చదువుకోవాలంటే చదువుకు దూరమయ్యే పరిస్థితి కనపడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఫీజుల నియంత్రణ విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దంపతులు





**ధర్మపురి, జులై 17:** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానమునకు గురువారం అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ దంపతులు మరియు బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీ శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం పక్షాన మేల తాళాలతో స్వాగతం పలికిన పిదప వేద పండితులు అర్చకులు ఆశీర్వచనం అందించారు. తదుపరి దేవస్థానం పక్షాన శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం చిత్రపటం దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్ ఇచ్చి వారిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సంకటన శ్రీనివాస్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్, మరియు ధర్మకర్తల మండలి సభ్యులు దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలి

◆ అంతర్గాం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష







**పెద్దపల్లి ప్రతినిధి :** పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అంతర్గాం మండలంలో విస్తృతంగా పర్యటించారు. అంతర్గాం మండలం మద్దిరాల గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు, అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, పొట్యాల గ్రామంలోని ఎంపిపిఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రాహ్మణపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, గోలివాడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత కల్పించాలని, ఎక్కడా గడ్డి, పిచ్చి మొక్కలు పెరగకుండా జాగ్రత్త వహించాలని, పాఠశాలల్లోని పిల్లలకు విష జ్వరాలు రాకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, రాబోయే 5 సంవత్సరాల పాటు ఎటువంటి అవసరాలు లేకుండా పాఠశాలల్లో మౌలిక వసతులకల్పనకు ప్రతిపాదనలు అందించాలని, వాటిని వెను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మద్దిరాల గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన సంపూర్ణ సహకారం అధికారులు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట అంతర్గాం ఎంపిడిఓ వేణుమాధవ్, ఈఈ హౌసింగ్ రాజేశ్వర్, డీఈ హౌసింగ్ దస్తగిరి, డీఈ పంచాయతీ రాజ్ అప్పల్ నాయుడు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ నిర్మాణం పనులు ప్రారంభించిన "ఎమ్మెల్యే"



**యైటింక్లయిన్ కాలని. :** స్థానిక వాటర్ ట్యాంక్ కూడలికి సమీపంలో అసంపూర్తి గా నిలిచిపోయిన డెయిలీ కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని గురువారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం ఇక్కడికి వచ్చిన ఆయన అసంపూర్తిగా, నిరుపయోగంగా నిలిచిపోయిన మార్కెట్ ను, తిరిగి ఉపయోగంలోకి తేవాలనే సంకల్పంతో రూ. 20 లక్షల నిధులను వెచ్చించి, పునర్నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. అర్థాంతరంగా, అసంపూర్తిగా నిర్మాణం పనులు నిలిచిపోయి, కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా మారిన డెయిలీ కూరగాయల మార్కెట్ కారణంగా, స్థానిక ప్రజలు పడుతున్న అవస్థలను దృష్టిలో ఉంచుకుని రూ.20 లక్షల నిధులతో మార్కెట్ పునర్ నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందన్నారు. డెయిలీ మార్కెట్ పునర్నిర్మాణం పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మారెల్లి రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.శంకర్ నాయక్, నాయకులు జి.రాజేష్, సాగంటి శంకర్, జె. దామోదర్, యాదగిరి తిరుపతి, తిరుపతి రెడ్డి, ఆకుల రాజిరెడ్డి, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో భూ వివాదాలను పరిష్కరించాలి

- అటవీ భూముల్లో నూతన ఆక్రమణలకు ఆస్కారం లేదు - అటవీ శాఖ అధికారులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి** రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో భూ వివాదాలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి అటవీ శాఖ అధికారులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేతకు పాల్పడే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని , చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. అటవీ శాఖ, రెవెన్యూ శాఖ మధ్య ఉన్న భూ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎక్కడా కూడా నూతనంగా అటవీ ఆక్రమణలకు తావు ఇవ్వడానికి వీలు లేదని అన్నారు. అటవీ భూములు, పట్టా భూములకు పక్కాగా డిమార్కింగ్ చేయాలని అన్నారు. మండలంలో తహసిల్దార్ తో అటవీ అధికారులు భూముల రికన్సిలేషన్ చేయాలని అన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూములలో సాగు చేసుకునే వారి ఇబ్బందులకు గురి చేయవద్దని అన్నారు. అటవీ ప్రాంతంలో చిన్న చిన్న అభివృద్ధి పనులకు అవసరమైన మరమ్మత్తు పనులకు అనుమతులు సకాలంలో జారీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు సురేష్ , జిల్లా అటివిశాఖ అధికారి శివయ్య,అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారుపల్లి గ్రామాన్ని సందర్శించిన డిఎంహెచ్వో





**ముత్తారం.జులై.17. :** ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని డీఎంహెచ్వో అన్న ప్రసన్న,జిల్లా క్షయ వ్యాధి అధికారి డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కిరణ్, మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ వాణిశ్రీ సందర్శించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డిఎంహెచ్వో మాట్లాడుతూ కాలానుగుణంగా ప్రబలే వ్యాదుల పై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అమరేందర్ రావ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ డబల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తి చేయాలి

- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా కలెక్టర్ మను చౌదరి

**శామీర్ పేట కలెక్టరేట్, జులై :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో పూర్తి చేయాల్సిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లపై జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలో మొత్తం 30068 డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఉండగా అందులో29094 ఇల్లు కేటాయించడం జరిగిందని మిగిలిన 974 ఇళ్ల కేటాయింపు ఈ వారంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు జిల్లాలో జిహెచ్ఎంసి పరిధిలో వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న 6880 ఇళ్ల నిర్మాణాలను వచ్చే మూడు నెలల లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డబల్ బెడ్ రూమ్ జిహెచ్ఎంసి ఈఈలు జిల్లా పంచాయతీ ఆర్ అండ్ బి అధికారులు, హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## గేట్లు బద్దలు కొట్టి నీటిని వదులుకుంటాం

- ఇల్లంతకుంట మండల బాధిత రైతులు



**ఇల్లంతకుంట, జూలై 17,:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు బ్రిడ్జిపై పొత్తూరు, కట్కూరు, వల్లంపట్ల, ఒగులాపూర్, నర్సక్కపేట, రంగంపేట, వంతడుపుల, గాలిపెల్లి, జవారిపేట, తాళ్ళపెల్లి గ్రామాల రైతులు గురువారం నిర్వహించిన ధర్నాలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పాల్గొని మద్దతు తెలిపారు. సిద్దం వేణు మాట్లాడుతూ. ... రైతులు దుక్కి దున్ని పొలాలు సిద్ధం చేసుకుని వర్షాలు లేక, కాలువల ద్వారా నీళ్లు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని, మధ్యమనేరు కుడి కాలువ, వాగు ద్వారా నీటిని విడుదల చేసి సుమారుగా 15000 ఎకరాలకు తక్షణమే నిరందజేయాలని కోరారు. బిఆర్ఎస్ హయాంలో రైతులు నీళ్ల కోసం ఆలోచన చేసిన వెంటనే వాళ్ళు కోరిన విధంగా నీటిని విడుదల చేశామని, కాళేశ్వరం నీటిని అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహారిస్తుందని, ఎమ్మెల్యే కవ్వంపల్లి వెంటనే స్పందించి నీటి పారుదల శాఖ మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి రైతులకు రెండు రోజులలోగా నీటిని అందజేయాలని లేని యెడల రైతుల ఆధ్వర్యంలో మిడ్ మానేరు ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు మాట్లాడుతూ. ..మద్యమానేరు కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని, రెండు రోజుల్లో నీళ్లు విడుదల చేయకపోతే రైతులందరం కలిసి మధ్యమానేరు ముట్టడించి గేట్లు బద్దలు కొట్టి నీటిని వదులుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఏరియాను సందర్శించిన కార్పొరేట్ సివిల్ జీఎం



**యైటింక్లయిన్ కాలనీ. :** సింగరేణి కార్పొరేట్ సివిల్ జనరల్ మేనేజర్ డి. వెంకటేశ్వర్లు గురువారం రామగుండం రెండవ ఏరియాను సందర్శించారు. ఉదయం ఏరియాకు వచ్చిన ఆయన ఏరియా కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ బి. వెంకటయ్యతో సమావేశమై, ఏరియా కు సంబంధించిన సివిల్ పనులు, అనుమతుల నిమిత్తం కార్పొరేట్ లో పెండింగ్లో ఉన్న పనుల అంశాలపై చర్చించారు. కార్పొరేట్ సివిల్ జీఎం గా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఏరియాకి వచ్చిన సందర్భంగా ఆయనను ఏరియా జీఎం వెంకటయ్య ఏరియా సివిల్ అధికారులతో కలిసి శాలువాతో సన్మానించి, పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఏరియా సివిల్ డీజీఎం ధనుంజయ, డీజీఎం ఐఇ మురళీకృష్ణ, డివైఎస్ఇ వినయ్ సాగర్ ఇఇ సివిల్ ప్రతాపగిరి రాజు, సివిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఏసీపీ ప్రశాంత్ రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు




**జమ్మికుంట జూలై 17 :** జమ్మికుంట బిజెపి నాయకులు నాగపురి విజయ్ గౌడ్ గుర్రం పరుశురాం గౌడ్ ఇటీవల ఏసిపి గా బాధ్యతలు స్వీకరించిన పింగిలి ప్రశాంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు గురువారం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ని శాలువాతో సన్మానించి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడటంలో ప్రశాంత్ రెడ్డికి మంచి పేరు ఉందని, అలాగే భవిష్యత్ లో మరింత పేరు ప్రఖ్యాతలు పొందాలని ఆకాంక్షించారు.

# పెద్దపల్లి సిపిఐ జిల్లా కార్యదర్శిగా తాండ్ర సదానందం...



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా సిపిఐ కార్యదర్శిగా మూడవసారి తాండ్ర సదానందం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ అధినాయకత్వం, జిల్లా కార్యవర్గ సభ్యులు మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను స్వీకరించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పార్టీ నాయకులు కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన తాండ్ర సదానందం శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాటుసారా అమ్ముతూ పట్టుబడిన వారి బైండోవర్



**ముత్తారం.జూలై.17.:** ముత్తారం మండలంలోని మచ్చుపేట, ఖమ్మంపల్లి రామకృష్ణాపూర్, జిల్లెలపల్లి గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలో నిరంతరంగా దాడులు నిర్వహిస్తున్నామని ఈ దాడుల్లో భాగంగా నాటుసారా అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని వారిని గురువారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి ఎదుట సంవత్సరకాలానికి లక్షరూపాయల పూచికత్తుతో బైండోవర్ చేసినట్లు తెలిపారు. మండలంలో నాటు సారా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మంత్రిని కలిసిన పద్మశాలి సంఘం సభ్యులు



**ధర్మారం, జూలై, 17 :** పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని ధర్మారం పద్మశాలి సంఘం సభ్యులు ధర్మపురి క్యాంప్ ఆఫీస్ లో ఎస్సీ, ఎస్టి, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా సంఘ సభ్యులు మంత్రికి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఒడ్నాల శంకరయ్య, డాక్టర్ కామిని శ్రీనివాస్ కుంట రాజు దేవసాని సత్యనారాయణ, మరియు సభ్యులు గుర్రం రాజేశం, తన్నేరు లక్ష్మి నర్సయ్య, సిరిమల్ల మోహన్, ఎలిగేటి మహేందర్, విట్ట రవి, గుడిమల్ల సురేష్, పులి విట్టల్, తుమ్మ శ్రీనివాస్, బుదారపు మధు, గౌడ శేఖర్, సుంకే శ్రీనివాస్, కొక్కుల శ్రీనివాస్, కుంట తిరుపతి, ఇప్పలపల్లి సురేందర్, కదారి గంగాధర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక వాహనాల పట్టివేత... ఆరుగురిపై కేసు నమోదు



**తిమ్మాపూర్, జూలై 17,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, రెండు బొల్లెరో వాహనాలను గురువారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.కొహెడ మండలం విజంపల్లికి చెందిన గీకురు అజయ్(32), బెజ్జంకి మండలం గూడెంకు చెందిన గూడెల్లి అనిల్, (28)అనే ఇద్దరు బొలేరోల ద్వారా మండలంలోని నుస్తులాపూర్ కు చెందిన అలువాల కిషన్(37),రేణికుంటకు చెందిన కర్ర రాజు(25), కనకుంట్ల వినయ్(23) బొంగోని రమేష్(45) ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా ఇసుకతో సహా వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలుపుతూ ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ హెచ్చరించారు.

## అనుమతులు లేకుండా రోడ్డు తవ్వకాలు..

**- తుంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి**



**శామీర్ పేట, జూలై 17 ):** అనుమతులు లేకుండా సిసి రోడ్డు తవ్వుతున్న వ్యక్తికి జరిమానా విధించిన మున్సిపల్ కమిషనర్ జ్యోతి. గురువారం తుంకుంట మున్సిపాలిటీ పరిధిలో ఏడవ వార్డు ఆర్టీసీ కాలనీలో అక్రమంగా అనుమతులు లేకుండా తన ఇంటి డ్రైనేజ్ కోసం సిసి రోడ్లు తవ్వుతున్న వ్యక్తి పై జర్మన్ విధించారు. కమిషనర్ మాట్లాడుతూ రోడ్లు, చెట్లు నరకడం చేయకూడదని అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యవసరం పరిస్థితిలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాన్ని సంప్రదించ వలసిందిగా తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**శామీర్ పేట, జులై 16 :** ఉద్దెమర్రి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫీదర్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గురువారం శామీర్ పేట ఏ ఈ రాఘవేందర్రావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎల్లాగూడ, అద్రస్ పల్లి గ్రామ అగ్రికల్చర్ లో, కేశవపురం, ఉద్యమరి గ్రామ పొలాలలో విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏ ఈ రాఘవేందర్రావు తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నట్లు, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగాధిపతిగా పదవీ బాధ్యతల స్వీకరణ



**రామగిరి, జూలై 17:-** రామగుండం-త్రీ ఏరియా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగాధిపతిగా నియమితులైన సి.జె.సురేఖ గురువారం రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావుకు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. వారు భూపాలపల్లి ఏరియా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగాధిపతి గా పనిచేసి ఆర్.జీ-త్రీ ఏరియాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

# పేదల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ

- ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి







**పెద్దపల్లి ప్రతినిధి :** పేదల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డిలు అన్నారు. గురువారం రోజున పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్ భవన్ లో సిపిఐ 4వ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు ముందు పతాకావిష్కరణ సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గౌతమ్ గోవర్ధన్ చేయగా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి అమరుల స్తూపానికి నివాళులు అర్పించారు. ఈ మహాసభలకు అధ్యక్ష వర్గంగా ఏఐవైఎఫ్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లో మార్కపురి సూర్య, రేణిగుంట్ల ప్రీతం వ్యవహరించారు. ఈ మహాసభలలో సంతాప తీర్మానం తో పాటు సిపిఐ జిల్లా రాజకీయ రిపోర్టును జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి లు మాట్లాడుతూ సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు కలిగిన పార్టీ అని, పార్టీని కార్యకర్తలు రక్షిస్తే పార్టీ ప్రజాస్వామ్యన్ని రక్షిస్తుందని, సిపిఐ లో ఉన్న అనుబంధ సంఘాలు, సిపిఐ కార్యకర్తలు, నాయకులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. భారతదేశంలో కార్మిక చట్టాలు సిపిఐ పోరాటాల ద్వారానే ఏర్పడ్డాయని, ఆ చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని పేర్కొన్నారు. సిపిఐ పార్టీ ఆవిర్భావం నుండి ఇప్పటివరకు తెలంగాణలో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసిందని, ఈ ఉద్యమంలో అనేకమంది సిపిఐ నాయకులు అమరులయ్యారని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తెలంగాణలోని భూములను సిపిఐ పార్టీ ద్వారానే పంచిపెట్టడం జరిగిందని తెలిపారు.ఎర్రజెండా కింద ఉన్న అన్ని పార్టీలు ఏకమై ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు విద్య, ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేసే కార్మికుల హక్కులను, మహిళలకు వారి సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిన పార్టీ సిపిఐ పార్టీ అని అన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని సుప్రీం కోర్ట్ ఈ కేసును సుమోటో ద్వారా స్వీకరించి, మావోలపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న మారనకాండను నిలిపివేసేటట్లుగా ఆదేశాలు ఇవ్వాలని, ఆటవిక చట్టాన్ని అమలుపరుస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని నివారించి , భారతదేశంలోని కమ్యూనిస్టులు ఒకే తాటిపై వచ్చి, కార్మికుల, కర్షకుల హక్కులను కాపాడాలని పిలుపునిచ్చారు. మావోలను అంత చేయడం వారి తరం కాదని, బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్, సంఘ్ అజెండాను భారతదేశంలో అమలు చేస్తుందని, దానిని ఎలాగైనా తిప్పి కొడతామని బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఐ పార్టీ పెద్దపెల్లి జిల్లాలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. **సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య :** సిపిఐ పార్టీ పెద్దపల్లి జిల్లాలో బలోపేతం చేయాలని, దానికి పెద్దపెల్లి జిల్లాలోని సిపిఐ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వారానే కార్మిక, కర్షకుల హక్కులను సాధించవచ్చునని పెద్దపెల్లి జిల్లాలో సింగరేణి లో పనిచేసే కార్మికులు పోరాటాల ద్వారా నే తమ హక్కులు సాధించుకున్నారని తెలిపారు. **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవైన శంకర్:** పోరాటాల ద్వారానే తమ హక్కులను సాధించుకోవచ్చు అని, పెద్దపెల్లి జిల్లాలో సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త తమవంతుగా పరిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# డిఆర్డిఓ నరేష్ సేవలు అభినందనీయం..

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి 17 ( హైదరాబాద్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు గత సంవత్సరం ఫిబ్రవరి 14న విధులలో చేరిన నరేష్ డిఆర్డీఓ విధుల నిర్వహణలో అమూల్యమైన సేవలు అందించారని అన్నారు. జగిత్యాల జిల్లాకు మే 28న వెళ్లిన సందర్భంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో నరేష్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. డిఆర్డిఓగా నరేష్ విధులు నిర్వర్తించిన కాలంలో ఉపాధిహామీ పథకం పనులు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. అలాగే సరస్వతి పుష్కరాల నిర్వహణలో స్టాళ్లు ఏర్పాటు, గిరి వికాసం వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో తనదైన శైలిలో చురుకుగా వ్యవహరించారని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అందించిన సేవలకు నరేష్‌ను జిల్లా యంత్రాంగం తరఫున కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ, డిఆర్డీఓ బాలకృష్ణ, డిపిఆర్వో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మెప్మా పిడి రాజేశ్వరి, ఎస్బిఎం కో ఆర్డినేటర్ భాస్కర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంగం జిల్లా అధ్యక్షులు శంకరయ్య, స్వామి, ఉదయ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్








**ధర్మపురి, జులై 17, (ది క్రైమ్ న్యూస్):** దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతగా గురువారం ధర్మపురి పట్టణంలోని ఎస్.హెచ్ గార్డెన్స్‌లో అభినందన సభను బిసి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలుచేసే నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ పార్టీ గొప్పతనాన్ని చూపుతోందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ లేకుండా పోవడంతో పాటు కార్యకర్తలకు కూడా గమ్యం లేకుండా పోయిందని ఆయన వివరించారు. పార్టీలో అధికారం కోసం లోపాయికారిగా పోరు కొనసాగుతోందని, ప్రజల సమస్యలపైన వారికి దృష్టి లేకుండా పోయిందని మంత్రిఅడ్లూరి తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల సంక్షేమానికి చేసిన పనులు ఏమిటో చెప్పాలని బిఆరెస్ నాయకులను మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. బీసీలపై ప్రేమ ఉంటే బీసీ నేతను పార్టీ అధ్యక్షుడిగా నియమించాలని లక్ష్మణ్ కుమార్ బిఆరెస్ పార్టీ నాయకులకు సూచించారు. ఇప్పటి పరిస్థితిని గమనిస్తున్న ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని, కాంగ్రెస్ పార్టీ ఎన్నో కష్టాలను ఎదుర్కొని అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పార్టీలో వ్యక్తిగత కోపాలు, ఫిరాయింపులకు చోటు లేకూండ పార్టీ బలంగా ఉండాలని నాయకులకు అడ్లూరి సూచించారు. ప్రతి పక్ష పార్టీలు మనలో ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నిస్తున్నాయని, కార్యకర్తలు అపోహలకు లోనుకాకుండా పార్టీ పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సామాజిక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# వయసు సెంచరీ కొట్టాలంటే..





ఏజ్ యాభైదాటాక కొన్ని ఆరోగ్య సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి. యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు అలవాటైన ఆహార నియమాలే కొనసాగిస్తానంటే.. అరవైలోనే ఆస్పత్రిపాలు కావాల్సి వస్తుంది. డెబ్బయ్ దాటకుండానే రనౌట్ అయ్యే ప్రమాదమూ ఉంది. యాభై ఏండ్లు దాటాక జీర్ణశక్తి కాస్త మందగిస్తుంది. శరీర పోషక అవసరాలూ మారుతుంటాయి. మలివయసులో ఆరోగ్యంగా ఉండాలంటే.. కొన్ని రకాల ఆహార పదార్థాలను దూరంగా ఉంచడం ఎంతైనా మంచిది. అవేంటంటే.. వేపుళ్లు వద్దు: వయసులో హాఫ్ సెంచరీ కొట్టాక.. రోజువారీ ఆహారంలో వేపుళ్ల కోసం వేయించుకు తినడం మానేయాల్సిందే! పండుగకో పబ్బానికో రుచి చూడొచ్చు కానీ, ప్రతిరోజూ కరకరలాడే వేపుళ్లు తింటే ప్రమాదమే! వాటిలో ఉండే నూనె శరీరానికి మంచిది కాదు. పైగా పొట్టలో కొలెస్ట్రాల్ కూడా పేరుకుపోతుంది. అంతగా తినాలి అనుకుంటే.. ఎయిర్ ఫ్రయిర్‌లో గానీ, ఓవెన్‌లో గానీ తయారుచేసుకుంటే కాస్త మంచిది! చక్కెరకు చెక్: జ్యూస్, గ్రీన్ టీ, బలవర్ధకం.. లాంటి లేబుల్స్ చూసి అవి ఆరోగ్యవంతమైనవి అనుకొని మోసపోతుంటాం. నిజానికి చూడాల్సింది అందులోని చక్కెర శాతం. అవి నడివయసుకు మంచివి కావు. చక్కెరకు చెక్ పెడితే గానీ, కొలెస్ట్రాల్‌కు కామా పడదు! చాపల్యం చాలు: యాభై ఏండ్లు వచ్చే వరకు ఆస్వాదించిన రుచులు చాలు. జిహ్వ చాపల్యాన్ని ఎంత వదులుకుంటే అంత ఆరోగ్యం. రుచుల కోసం ప్యాకేజ్డ్ ఫుడ్‌కు అలవాటుపడితే చేటు తప్పదు. వీటిలో కనిపించకుండా చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. దీనిని హిడెన్ షుగర్ అంటారు. వీటి బదులు తాజా పండ్లు తినడం మంచిది. మందుకు నో: వయసు పెరుగుతున్న కొద్దీ.. మద్యం వల్ల కలిగే దుష్ఫలితాలూ పెరుగుతాయి. మద్యంతో కాలేయం మీద ఒత్తిడి పెరుగుతుంది. యాభయ్యో పుట్టినరోజు నాడు డ్రింకింగ్ హ్యాబిట్‌కు స్వస్తి పలకండి. ఉప్పు ముప్పు: రోజువారీ ఆహారంలో 2300 మిల్లీగ్రాములకు మించి ఉప్పు ఉండకూడదన్నది నిపుణుల మాట. కానీ, మనం అంతకు ఎన్నో రెట్లు లాగించేస్తుంటాం. నడివయసులో వచ్చే అధిక రక్తపోటు లాంటి సమస్యలను ఉప్పు తీవ్రతరం చేస్తుంది. వీలైనంత వరకు ఉప్పు తగ్గించడం అత్యవసరం అని గుర్తించండి.

## ఈ ఆహారంతో కిడ్నీలు పదిలం



కిడ్నీలను దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచుకునేందుకు పోషకాలతో నిండిన సమతులాహారం కీలకం. ఆహార నియమాల్లో చిన్నపాటి మార్పులతో కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. సోడియం, పాస్ఫరస్, పొటాషియంతో కూడిన ఆహారం అధికంగా తీసుకోవడం కిడ్నీలపై అదనపు భారం మోపుతుంది. ఇతర కాంప్లికేషన్స్ తలెత్తకుండా ఈ తరహా ఆహారాన్ని తగిన మోతాదు మించకుండా చూసుకోవాలి. అధిక ప్రొటీన్ ఆహారం కూడా కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో మూత్రపిండాలపై పనిభారం పెంచుతుంది. ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు తీసుకుంటే వాటిలో ఉండే పోషకాలు, యాంటీఆక్సిడెంట్ల కిడ్నీ పనితీరుకు ఊతమిస్తాయి. పండ్లు, కూరగాయలతో పాటు తృణధాన్యాలను తీసుకోవడం, బీపీ, శరీర బరువును అదుపులో ఉంచుకోవడంతో కిడ్నీ పనితీరు మెరుగవుతుంది. విటమిన్స్, మినరల్స్‌తో కూడిన ఆహారం కిడ్నీలకు మేలు చేయడంతో పాటు రోజంతా ఉత్సాహంగా, ఉత్తేజంగా ఉండేందుకు ఉపకరిస్తాయి. ఇవి వాపు ప్రక్రియ నివారించి, రోగ నిరోధక వ్యవస్థను ఉత్తేజితం చేస్తాయి. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు పోషకాహారంతో పాటు సమతులాహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీల ఆరోగ్యానికి పండ్లలో ముఖ్యంగా జామ, యాపిల్, పియర్, పపాయ, పైనాపిల్ తీసుకోవాలని చెబుతున్నారు. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్స్ కిడ్నీలు దెబ్బతినకుండా కాపాడతాయి. ఇక ఐరన్, విటమిన్ కే వంటి కిడ్నీ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పాలకూర, కేల్ వంటి ఆకుకూరలు తీసుకోవాలి. ఫైబర్ అధికంగా ఉండే బ్రౌన్ రైస్, క్వినోవా కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఫిష్, తోఫు వంటి లీన్ ప్రొటీన్ కిడ్నీ ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు.

## ఈ అద్భుతమైన ఆకుపచ్చపండు రోజూ తింటే.. డాక్టర్‌తో పని లేదు.. మందుల అవసరమే ఉండదట..!

సీజనల్ పండ్లలో అవోకాడో ఒక ప్రసిద్ధ పండు. అవకాడోలో చాలా పోషకాలు ఉన్నాయి. ఇది అధిక కొవ్వు ఆమ్లాలు, విటమిన్లు , ఫైబర్, ఖనిజాలు, ప్రోటీన్లతో సహా అవసరమైన పోషకాలను కలిగి ఉంటుంది. ఇది అనేక వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఇది రుచికరమైన, పోషకమైన పండు. అవకాడో మన జుట్టు, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది మధుమేహం, క్యాన్సర్, అజీర్ణం, డయేరియా వంటి వ్యాధుల నుండి ఉపశమనాన్ని అందించడంలో కూడా సహాయపడుతుంది. అవకాడో పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఆర్థరైటిస్‌లో మేలు చేస్తుంది: ఆర్థరైటిస్‌లో అవకాడో చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది. ఇది కీళ్ళు, కణజాలం, కండరాల వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. మోకాళ్ల నొప్పులను తగ్గిస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణ : అవకాడో అధిక కొవ్వు, తక్కువ కార్బోహైడ్రేట్ ఆహారం. తక్కువ కార్బోహైడ్రేట్ కంటెంట్ కారణంగా, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అవకాడో అనేది శక్తిని పెంచే ఆహారం. అధిక రక్తపోటు నుండి ఉపశమనం: అవోకాడో ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది రక్త కణాలను నయం చేయడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. క్యాన్సర్‌లో మేలు చేస్తుంది: ప్రోస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో అవకాడో చాలా ప్రభావవంతంగా ఉంటుంది. మోనోశాచురేటెడ్ కొవ్వులో కెరోటినాయిడ్లు తగినంత ఉంటాయి.. ఇది క్యాన్సర్‌ను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: అవకాడో పండ్లలో ఫ్లేవనాయిడ్స్, సపోనిన్లు, టానిన్లు ఉంటాయి. ఈ సమ్మేళనాల సహాయంతో ఇది ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యలు, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. చర్మ సమస్యలను నయం చేయడానికి : యాంటీ ఆక్సిడెంట్ గుణాలు పుష్కలంగా ఉండే అవకాడోస్ తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అవకాడో అనేక చర్మ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో మేలు చేస్తుంది.

## శరీరం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే వీటిని తప్పక తీసుకోవాలి.. లేదంటే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే!



ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు సరిపడా నీళ్లు తాగాలని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ రోజువారీ పనుల్లోపడి నీటిని సమృద్ధిగా నీళ్లు తాగరు. రోజంతా గడచిన తర్వాత ఎక్కువ నీరు తాగలేదనే విషయం గుర్తుంది. కానీ ఇలా మళ్లీ మళ్లీ జరిగితే, మీరు పెద్ద ఇబ్బందుల్లో పడతారు. అందుకే రోజంతా తగినంత నీరు త్రాగాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో శరీరంలో నీటి శాతాన్ని పెంచడానికి, నీటి శాతం ఎక్కువగా ఉండే కొన్ని రకాల పండ్లు, కూరగాయలను కూడా తినవచ్చు. అవసరమైతే, పండ్ల రసాలు కూడా తాగవచ్చు. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత 1 గ్లాసు నీరు తాగడం అలవాటు చేసుకోవాలి. రోజులో ప్రతి భోజనానికి కనీసం అరగంట ముందు ఒక గ్లాసు నీరు త్రాగాలి. ఇలా చేస్తే ఆహారం జీర్ణమవడంతోపాటు ఆహారంలోని పోషకాలు సమృద్ధిగా శరీరానికి అందుతాయి. నిమ్మకాయ-పుదీనా లేదా దోసకాయ-తులసి ఆకులతో తయారు చేసిన నీటిని కూడా త్రాగవచ్చు. నీటి రుచి మారడంతో, మళ్లీ మళ్లీ నీరు తాగాలనే విషయం మీరు గుర్తుంచుకుంటారు. మొదట్లో కాస్త కష్టంగా అనిపించినా క్రమంగా అది అలవాటుగా మారుతుంది. ఇది మీ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. అనేక వ్యాధుల నుంచి తేలిగ్గా బయటపడవచ్చు. శరీరం హైడ్రేట్ గా ఉండాలంటే తాజా పండ్లు తినాలి. ఎండాకాలం వచ్చిందంటే చాలు పుచ్చకాయలు మార్కెట్‌లో అధికంగా దొరుకుతాయి. ప్రతిరోజూ కొన్ని పుచ్చకాయ ముక్కలు తినడానికి ప్రయత్నించాలి. పుచ్చకాలయలోని పోషకాలు శరీరంలో నీటి కొరతను తీరుస్తుంది. పంటినొప్పికి.. ఇంటి చిట్కాలు పంటినొప్పి.. భరించలేని సమస్య. దాని ప్రభావం ముఖం, తలమీద కూడా ఉంటుంది. కారణం ఏదైనా పంటినొప్పికి మనవాళ్లు ఇంటిచిట్కాలకే ప్రాధాన్యం ఇస్తారు.

### బీకేర్‌ఫుల్..! శరీరంలో ఈ ఖనిజం లోపం ఉంటే జుట్టు నెరిసిపోతుందట..

అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటేనే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే.. మనం తీసుకునే ఆహారంలో ఖనిజాలు, విటమిన్లు, పోషకాలు ఉండేలా చూసుకోవాలి.. అలాంటి ముఖ్యమైన ఖనిజాల్లో రాగి ఒకటి.. రాగి ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది.. కానీ ఇది తక్కువ పరిమాణంలో అవసరం. ఈ పోషకం ఎర్ర రక్త కణాలు, ఎముకలు, బంధన కణజాలం, కొన్ని ముఖ్యమైన ఎంజైమ్‌లను తయారు చేయడానికి ఉపయోగిస్తారు. కాపర్ కొలెస్ట్రాల్ ప్రాసెసింగ్, మీ రోగనిరోధక వ్యవస్థ సరైన పనితీరు, కడుపులో శిశువుల అభివృద్ధికి కూడా కాపర్ అవసరం.. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. ఆరోగ్యకరమైన వయోజన వ్యక్తికి ప్రతిరోజూ 900రాగి అవసరం.. ఈ పోషకం లోపం వల్ల అలసట, బలహీనత, తరచుగా అనారోగ్యం, బలహీనమైన, పెళుసుగా ఉండే ఎముకలు, జ్ఞాపకశక్తి కోల్పోవడం, నడవడంలో ఇబ్బంది, చలికి సున్నితత్వం, లేత చర్మం, జుట్టు నెరిసిపోవడం, కంటి చూపు కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి.. అందుకే.. కాపర్ రిచ్ ఫుడ్స్ ను తప్పనిసరిగా తీసుకోవాలి.. రాగి సమృద్ధిగా ఉండే పదార్థాలు ఏంటో ఇప్పుడు తెలుసుకోండి.. కాపర్ రిచ్ ఫుడ్స్.. నట్స్ ను పోషకాల నిధి అని పిలుస్తారు. వీటిలో ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇందులో రాగి కూడా సమృద్ధిగా లభిస్తుంది. బాదం, వేరుశెనగ లాంటి వాటని తింటే ఈ పోషకానికి లోటు ఉండదు రొయ్యలు సముద్రపు అడుగుభాగంలో ఎక్కువగా ఉంటాయి. ఇంకా పలు ప్రాంతాల్లో వీటిని పెంచుతారు. రొయ్యల మాంసంలో తక్కువ కొవ్వు ఉంటుంది. అంతేకాకుండా అధిక ప్రోటీన్, సెలీనియం, విటమిన్ 12తో సహ పలు విటమిన్లు, ఖనిజాలతో నిండి ఉంటుంది. అంతేకాకుండా, ఇందులో రాగి కూడా పుష్కలంగా ఉంటుంది. డార్క్ చాక్లెట్: డార్క్ చాక్లెట్‌ని ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు.. ఇందులో కోకో ఘనపదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. తక్కువ చక్కెర కంటెంట్ కూడా ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని నిత్యం తినడం వల్ల శరీరానికి రాగి పుష్కలంగా అందుతుంది. తృణధాన్యాలు: తృణధాన్యాలు (గింజలు) వంటి వాటిల్లో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో రాగి పుష్కలంగా లభిస్తుంది. ఇందులో నువ్వులను రాగి పవర్‌హౌస్ అని కూడా పిలుస్తారు. ఆకు కూరలు: గ్రీన్ లీఫీ వెజిటేబుల్స్ దాదాపు అన్ని మంచివే.. వీటిలో అన్ని రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఫైబర్, విటమిన్ కె, కాల్షియం, మెగ్నీషియం, ఫోలేట్ ఇందులో ఉంటాయి. బచ్చలికూర, పాలకూర లాంటివి తింటే శరీరంలో రాగి లోపం అనే మాటే ఉండదు.

## పంటినొప్పికి.. ఇంటి చిట్కాలు



పంటినొప్పి.. భరించలేని సమస్య. దాని ప్రభావం ముఖం, తలమీద కూడా ఉంటుంది. కారణం ఏదైనా పంటినొప్పికి మనవాళ్లు ఇంటిచిట్కాలకే ప్రాధాన్యం ఇస్తారు. అలాంటి ప్రభావవంతమైన చిట్కాలు ఓ ఐదు ఉన్నాయి. అయితే, ఇవి వైద్యుడి చికిత్సకు ప్రత్యామ్నాయాలు మాత్రం కాదు. చిట్కాలు ప్రయోగించినా పంటినొప్పి తగ్గలేదంటే వైద్యుణ్ని సంప్రదించడం మానుకోవద్దు. ఉప్పునీళ్లు ఉప్పులో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఉప్పునీళ్లను పుక్కిలించినప్పుడు నోట్లో ఉండే బ్యాక్టీరియా నశించిపోతుంది. నొప్పి, మంట కూడా తగ్గిపోతుంది. దీనికోసం ఓ గ్లాసు గోరువెచ్చటి నీళ్లలో టీస్పూన్ ఉప్పు కలుపుకోవాలి. ఈ ద్రావణాన్ని ఓ ముప్పై సెకండ్లపాటు పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా రోజులో కొన్నిసార్లు చేస్తూ ఉండాలి. ముఖ్యంగా తిన్న తర్వాత, పడుకునే ముందు పుక్కిలించడం మర్చిపోవద్దు. లవంగం నూనె పంటినొప్పి ఉపశమనానికి వందల ఏండ్లుగా లవంగం నూనెను ఉపయోగిస్తున్నారు. ఇందులో కూడా ఎనల్జీసిక్, యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువే. లవంగం నూనెలో ఉండే యూజెనాల్ అనే మూలకం పంటినొప్పి నుంచి తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తుంది. పత్తి ఉండను తీసుకుని దాన్ని కొన్నిచుక్కల లవంగం నూనెతో తడపాలి. తర్వాత నొప్పిగా ఉన్న దంతాలు, చిగుళ్ల దగ్గర మర్దన చేయాలి. రోజులో పలుమార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మంచుముక్కలు ఓ పల్చటి వస్త్రంలో మంచుముక్కలు తీసుకోవాలి. దీంతో నొప్పి ఉన్న దగ్గర్లో బుగ్గపై రుద్దుకోవాలి. ఇలాఓపది పదిహేను నిమిషాలపాటు చేస్తేనొప్పి ఉన్నచోట మొద్దుబారినట్టుగాఉంటుంది.పంటినొప్పిని తప్పించుకోవడానికి ఈ ప్రక్రియను కొన్నిగంటలకోసారి చేస్తూ ఉండాలి. పెప్పర్‌మింట్ టీ దీనిలో పుదీనా ఉంటుంది. దీనికి నోటిని చల్లగా చేస్తూ తిమ్మిరి కలగజేసే గుణాలు ఉంటాయి. పెప్పర్‌మింట్ టీని నోట్లోకి తీసుకోవడం ద్వారా పంటినొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. చల్లటి పెప్పర్‌మింట్ టీని నోట్లో ఓ ముప్పై సెకండ్లపాటు పుక్కిలించి ఉమ్మేయడం మంచిది. పెప్పర్‌మింట్ టీ బ్యాగ్‌ను నొప్పి ఉన్నచోట ఉంచినా ఇదే ఫలితం ఉంటుంది. ఇలా వీలైనన్ని సార్లు చేయాలి. వెల్లుల్లి వెల్లుల్లిలో యాంటీమైక్రోబియల్, యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. దీనిలో ఉండే అలిసిన్ చెడు బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఓ వెల్లుల్లి రేకును మెదుపుకోవాలి. దీన్ని నేరుగా చిగుళ్లు, పంటిపై ఉంచాలి. వెల్లుల్లి రేకును, పేస్టును చప్పరించినా మంచి ఫలితాలే ఉంటాయి.

## పంచామృతం అంటే ఏంటి..? ఎలా తయారు చేసుకోవాలి.. ఆరోగ్యానికిది అమృతంతో సమానం..!



దేవుడికి పంచామృతాలతో అభిషేకం చేస్తారు. భారతీయ సంప్రదాయం ప్రకారం, పంచామృతం అనేది పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార లేదా బెల్లం మిశ్రమం. ఇవి ఐదు పవిత్ర పదార్థాలు హిందూ మతంలో ఆరాధన, భక్తిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పంచామృతం హోమం హవన్, పూజ సమయంలో అనేక మతపరమైన ఆచారాలలో ఉపయోగిస్తుంటారు. ఈ ఐదు పదార్థాలను ఉపయోగించడం ద్వారా, దేవునికి అంకితమైన పవిత్రమైన, స్వచ్ఛమైన నైవేద్యం సిద్ధమవుతుంది. ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని సమతుల్యం చేయడానికి దోహదం చేస్తుంది. ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పండ్ల నుంచి వచ్చే రసం గానీ, కొబ్బరి నీళ్లు గానీ కలిపితే పంచామృతం అవుతుంది. ఐదు పవిత్ర పదార్థాలతో తయారు చేసే ఈ పదార్థం.. దేవుడికి అభిషేకం చేయడానికి, పూజలో ఉపయోగిస్తారు. పంచామృతాన్ని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? పూజలో పంచామృతాన్ని ఎందుకు ఉపయోగిస్తారు..? ఇక్కడ తెలుసుకుందాం.. పంచామృతం ప్రయోజనాలు: 1. పాలు: పాలు స్వచ్ఛత, పోషణకు చిహ్నంగా పరిగణించబడతాయి. 2. పెరుగు: పెరుగు ఆరోగ్యం, శ్రేయస్సుకు చిహ్నంగా పరిగణించబడుతుంది. 3. నెయ్యి: నెయ్యి జ్ఞానం, కాంతికి చిహ్నంగా పరిగణించబడుతుంది. 4. తేనె: తేనె మాధుర్యం, జీవితానికి చిహ్నంగా పరిగణించబడుతుంది. 5. గంగాజలం: గంగాజలం స్వచ్ఛతకు చిహ్నంగా పరిగణించబడుతుంది. పంచామృతం ఆచార ప్రయోజనాలు: పంచామృతం దేవతలను అభిషేకించడానికి ఉపయోగిస్తారు. దేవతలకు పంచామృతాలతో అభిషేకం చేయడం వల్ల దేవతలు త్వరగా ప్రసన్నమవుతారని, భక్తుల కోర్కెలు నెరవేరుతాయని విశ్వాసం. పూజలో కూడా పంచామృతాన్ని ఉపయోగిస్తారు. పంచామృతాలతో దేవుడిని పూజించడం ద్వారా పూజా ఫలాలు రెట్టింపు అవుతాయని విశ్వాసం. ఆధ్యాత్మిక ప్రయోజనాలు: పంచామృతం మనస్సును శాంతపరచడంలో, ఏకాగ్రతను పెంచడంలో సహాయకరంగా పరిగణించబడుతుంది. పంచామృతం ప్రతికూల శక్తిని వదిలించుకోవడానికి, సానుకూల శక్తిని ఆకర్షించడంలో సహాయపడుతుందని విశ్వసిస్తారు.

## పరగడుపున టమాటాలు తింటే ఇలా అవుతుందా..? ఖచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయం ఇది..!

ఇంట్లో కూరగాయలు, పప్పు రుచిని పెంచడానికి ఉపయోగించే టమాటాలు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. టమాటాలను తరచుగా కూరలు, సలాడ్‌లు, సూప్‌లు, చట్నీలలో ఉపయోగిస్తారు. టమాటాలు చర్మ ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా పనిచేస్తాయి. టమాటాలను అందం కోసం కూడా చాలా హోం రెమెడీస్ లో ఉపయోగిస్తుంటారు. అంతే కాదు, టమాటాలను అనేక సౌందర్య ఉత్పత్తులలో కూడా ఉపయోగిస్తారు. టమాటాలో విటమిన్ సి, లైకోపీన్, విటమిన్ కె, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. దీన్ని తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. టమాటా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది . టమోటాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం. టమాటా తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. 1- బాగా పండిన టమాటాలను ఉదయం పూట నీళ్లు తాగకుండా ఖాళీ కడుపుతో తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. 2- రికెట్స్‌తో బాధపడుతున్న పిల్లలకు రోజూ ఒక గ్లాసు టమాటా రసం ఇవ్వాలి. దీంతో వారికి ఎంతో మేలు జరుగుతుంది. 3- టమాటా తినడం వల్ల పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి మెరుగుపడుతుంది. 4- బరువు తగ్గడానికి, మీరు టమాటాలు తినండి. మీరు టమాటాను సలాడ్‌లో కూడా చేర్చుకుని తినవచ్చు. లేదా 1-2 గ్లాసుల టమాటా రసం చేసుకుని కూడా తాగొచ్చు. 5- ఆర్థరైటిస్‌తో బాధపడేవారు టమాటా తినాలి. టమాటా జ్యూస్‌లో సెలెరీని కలిపి తాగడం సహాయపడుతుంది. 6- గర్భిణీలకు కూడా టమాటా మేలు చేస్తుంది. దీని కారణంగా శరీరానికి విటమిన్ సి లభిస్తుంది. గర్భధారణ సమయంలో శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. 7- కడుపులో నులిపురుగుల సమస్య ఉంటే ఖాళీ కడుపుతో టమాటా ఎండుమిర్చి కలిపి తింటే మంచిది. 8- రోజూ పచ్చి టమాటాలు తింటే ముఖం మెరుస్తుంది. 9- టమాటా తినడమే కాకుండా ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది. ఇందుకోసం టమాటా గుజ్జును ముఖానికి రాసుకుంటే మెరుపు వస్తుంది. 10- టమాటా తినడం మధుమేహంలో ప్రయోజనకరంగా ఉంటుంది. కంటి చూపును మెరుగుపరుస్తుంది.

# తొక్కిసలాట పాపం ఆర్‌సీబీదే

హై కోర్టుకు నివేదిక సమర్పించిన కర్ణాటక ప్రభుత్వం ఐపీఎల్ 2025 విజయోత్సవ వేడుకల్లో చోటు చేసుకున్న తొక్కిసలాట పాపం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)దే అని కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. హై కోర్టుకు సమర్పించిన నివేదికలో ఆర్‌సీబీ బాధ్యతారాహిత్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంది. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆర్‌సీబీ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆర్‌సీబీ టైటిల్ సాధించడంతో ఆ జట్టు ఆటగాళ్లు, అభిమానుల ఆనందానికి హద్దే లేకుండా పోయింది.బెంగళూరు నగరం వేదికగా నిర్వహించిన విజయోత్సవ వేడుకలకు లక్షలాది మంది అభిమానులు తరలిరావడంతో చిన్నస్వామి స్టేడియం ముందు భారీ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది గాయపడ్డారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సంఘటనపై కన్నెర్ర చేసిన కర్ణాటక హైకోర్టు సమగ్ర విచారణ జరిపి నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తాజాగా ఈ ఘటనకు సంబంధించిన నివేదికను కర్ణాటక ప్రభుత్వం హైకోర్టుకు అందజేసింది. అందులో సంచలన విషయాలను వెల్లడించింది. 'ఆర్‌సీబీ నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట జరిగింది. విజయోత్సవ వేడుకల విషయంలో ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ ఏకపక్షంగా





వ్యవహరించింది. పోలీసులను సంప్రదించకుండా.. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సోషల్ మీడియా వేదికగా విజయోత్సవ వేడుకల్లో భాగం కావాలని అభిమానులకు పిలుపునిచ్చింది. ఆర్‌సీబీ షేర్ చేసిన ఓ వీడియోలో ఆ జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్వయంగా అభిమానులు విజయోత్సవ వేడుకల్లో భాగం కావాలని పిలుపునిచ్చాడు. ఈ పోస్ట్‌ను 44 లక్షల మంది వీక్షించారు. ఈ వీడియో కారణంగా సుమారు 2-3 లక్షల మంది అభిమానులు స్టేడియానికి వచ్చేలా చేసింది. చిన్నస్వామి స్టేడియం సీటింగ్ కెపాసిటీ 35 వేలు కాగా.. అభిమానులు లక్షల్లో తరలి వచ్చారు. గేట్ నంబర్ 1, 2, 21 వద్ద అభిమానులు గేట్లను బద్దలు కొట్టి లోపలికి వచ్చే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలోనే తొక్కిసలాట జరిగింది. ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్‌తో పాటు ఈవెంట్ ఆర్గనైజింగ్ కంపెనీ డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ) మధ్య సమన్వయం లేకపోవడమే ఈ దురదృష్టకర ఘటనకు కారణం. జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ప్రకారం స్టేడియం లోపల 79 మంది పోలీసులు మాత్రమే ఉన్నారు. బయట ఎవరూ లేరు. అంబులెన్స్‌లు కూడా ఘటన స్థలం వద్ద లేవు. పోలీస్ యంత్రాంగం వైఫల్యం కూడా ఉంది.'అని కర్ణాటక ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది. ఈ రిపోర్ట్‌ను సీక్రెట్‌గా ఉంచేందుకు ఎలాంటి చట్టపరమైన కారణాలు లేవని హైకోర్టు ఆదేశించడంతో.. ప్రభుత్వం సమర్పించిన వెంటనే బయటకు వచ్చింది. ఇప్పటికే ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ.. ఆర్‌సీబీ మేనేజర్, కేఎస్‌సీఏ అధికారులు, ఈవెంట్ మేనేజర్‌పై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ తొక్కిసలాట నేపథ్యంలో విజయోత్సవ వేడుకలపై బీసీసీఐ ఆంక్షలు విధించడంతో పాటు పలు గైడ్‌లైన్స్ జారీ చేసింది.

# స్పోర్ట్స్




## ఆండ్రీ రస్సెల్ సంచలన నిర్ణయం

### అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై
### సిరీస్ మధ్యలో రిటైర్మెంట్ ప్రకటన

వెస్ట్ ఇండీస్ ఆల్ రౌండర్ ఆటగాడు ఆండ్రీ రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశాడు. ఆస్ట్రేలియాతో జరిగే టీ20 సిరీస్ తర్వాత ఆట నుంచి తప్పుకోనున్నాడు. జులై 21 నుంచి వెస్టిండీస్, ఆస్ట్రేలియా మధ్య 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో ఆండ్రీ రస్సెల్‌ను ఎంపిక చేశారు. అయితే అతను సిరీస్ మధ్యలోనే రిటైర్మెంట్ తీసుకుంటాడు.రస్సెల్ రెండో మ్యాచ్ తర్వాత రిటైర్మెంట్ తీసుకుంటాడు. సిరీస్‌లో రెండో మ్యాచ్ జులై 23న జమైకాలోని సబీనా పార్క్ కింగ్‌స్టన్‌లో జరుగుతుంది. ఈ మ్యాచ్ రస్సెల్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ అవుతుంది.37 ఏళ్ల ఆండ్రీ రస్సెల్ 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు, నవంబర్ 15న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో తన తొలి, ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడాడు. ఆరు నెలల తర్వాత 2011లో రస్సెల్ టీ20, వన్డేల్లోకి అరంగేట్రం చేశాడు.ఆండ్రీ రస్సెల్ వన్డేల్లో 4, టీ20ల్లో 3 అర్ధ సెంచరీలు సాధించాడు. వన్డేల్లో అతని అత్యుత్తమ స్కోరు 92 నాటౌటు, ఇది ఒక రికార్డు. రస్సెల్ ఇన్నింగ్స్ వన్డేలలో తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్ చేసిన ఏ ఆటగాడికైనా అత్యధిక స్కోరు ఇదే. .వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనుంది, దీనికి భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనున్నాయి. రస్సెల్ దానికంటే ముందే రిటైర్మెంట్ తీసుకోబోతున్నాడు. అతను తన కెరీర్‌లో 2 సార్లు ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమయ్యాడు. వెస్టిండీస్ 2012, 2016లో టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది, రెండింటిలోనూ ఆండ్రీ రస్సెల్ కీలక పాత్ర పోషించాడు. 2016 సెమీ-ఫైనల్‌లో అతను టీమ్ ఇండియాపై 20 బంతుల్లో 43 పరుగులు చేశాడు. ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 4 ఓవర్లలో కేవలం 21 పరుగులు మాత్రమే ఇచ్చాడు.

## అదరగొట్టిన భారత మహిళల జట్టు

### ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో విజయం

సౌథాంప్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత మహిళల జట్టు అదరగొట్టింది. నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్‌పై తొలి టీ20 సిరీస్?ను 3-2 తేడాతో ఇప్పటికే నెగ్గిన టీమ్?ఇండియా, ఇప్పుడు అదే జోష్?లో తొలి వన్డేలో రాణించింది.అలా మూడు వన్డేల సిరీస్‌లో భారత్? శు భారంభం చేయగా, తొలి వన్డే ఆసక్తికరంగా సాగింది. హర్మన్‌సేన ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. అయితే తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది.బర్త్ డే గర్ల్ సోఫియా డంక్లీ (83: 92 బంతుల్లో 9 ఫోర్లు), డేవిడ్‌సన్ రిచర్డ్స్ (53) అర్ధశతకాలతో రాణించారు. దీంతో ఆ జట్టు స్కోరు 250 దాటింది. క్రాంతి గౌడ్ (2/55), స్నేహ్ రాణా (2/31) ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. తెలుగమ్మాయి శ్రీచరణి ఒక వికెట్ తీసింది. అమన్‌జోత్ కౌర్ మరో వికెట్ తీసింది.అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 48.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీప్తి శర్మ (62బి: 64 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) చెలరేగింది. తన మెరుపు ఇన్నింగ్స్?తో ఆకట్టుకుంది. జెమీమా రోడ్రిగ్స్ (48: 54 బంతుల్లో 5 ఫోర్లు) అదరగొట్టింది. కానీ అర్ధశతకం మిస్ చేసుకుంది.వికెట్‌కు 90 పరుగులు జోడించిన దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్ (48) జట్టును విజయపథంలో నడిపించారు. ప్రతీకా రావల్ (36), స్మృతి మంధాన (28), హర్లీన్ డియోల్ (27), హర్మన్ ప్రీత్ కౌర్ (17), రిచా ఘోష్ (10), అమన్‌జోత్ కౌర్ (20బి: 14 బంతుల్లో 3 ఫోర్లు) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఛార్లెట్ డీన్ 2, లారెన్ బెల్, సోఫీ ఎకెల్‌స్టోన్, లారెన్ ఫైలర్ ఒక్కో వికెట్ తీశారు. తొలి వన్డేలో విజయంతో విజయంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యం సాధించింది. లక్ష్య ఛేధనలో టీమిండియాకు ఆశించిన శుభారంభం దక్కలేదు. దూకుడుగా ఆడే ప్రయత్నంలో స్మృతి మంధాన(28) కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగింది. దాంతో తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యమే నమోదైంది. ఆ తర్వాత ప్రతీకా రావల్ ఔటవ్వగా, హర్లీన్ డియోల్ వెనువెంటనే వెనుదిరిగారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(17) తన వైఫల్యాన్ని కొనసాగించింది. దాంతో భారత్ 124 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో జెమీమాతో కలిసి దీప్తి శర్మ జట్టును ఆదుకుంది. ఈ క్రమంలో దీప్తి శర్మ 52 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. జెమీమా తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకుంది. దాంతో ఐదో వికెట్‌కు నమోదైన 90 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే రిచా ఘోష్(10) కూడా ఔటవ్వడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. భారత విజయానికి చివరి 33 బంతుల్లో 33 పరుగులు చేయాల్సి రాగా.. అమన్‌జోత్ కౌర్(14 బంతుల్లో 3 ఫోర్లతో 20 నాటౌట్) దూకుడుగా ఆడి భారత విజయాన్ని లాంఛనం చేసింది. వరుసగా రెండు బౌండరీలు బాది విజయాన్ని అందించింది.




## సరికొత్త సృష్టించిన ఆస్ట్రేలియా

### 27 పరుగులకే విండీస్ ఆలౌట్
### 176 పరుగులతో తేడాతో ఓటమి

ఆస్ట్రేలియా టీమ్ సరికొత్త సృష్టించింది. వెస్టిండీస్‌ను కేవలం 27 పరుగులకే ఆలౌట్ చేసింది. ఇది టెస్ట్‌ల్లో రెండో అత్యల్ప స్కోరు. జమైకాలోని కింగ్‌స్టన్ వేదికగా మూడో టెస్ట్ (డే అండ్ నైట్)లో 175 పరుగులతో విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. మొదటి టెస్ట్‌లో 159 పరుగుల తేడాతో.. రెండవ టెస్ట్‌లో 133 పరుగుల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఇక కెరీర్‌లో వందో టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న మిచెల్ స్టార్క్ భీకర బౌలింగ్‌తో విండీస్ బ్యాట్స్‌మెన్లను బెంబేలెత్తించాడు. స్టార్క్ 6 వికెట్లు తీయగా.. బొలాండ్ 3, హేజిల్‌వుడ్ ఒక వికెట్ తీశారు. ఆసీస్ బౌలర్లకు దెబ్బకు ఏకంగా ఏడుగురు వెస్టిండీస్ బ్యాట్స్‌మెన్ డకౌట్ అయ్యారు. గ్రేవిస్ అత్యధికంగా 11 పరుగులు చేయగా.. మైకేల్ లూయిస్, అల్జారీ జోసఫ్ తలో 4 పరుగులు చేశారు.ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 225 పరుగులు చేసింది. కామెరాన్ గ్రీన్ 46, స్టీవ్ స్మిత్ 48 పరుగులు మాత్రమే రాణించారు. విండీస్ తరుపున షమర్ జోసెఫ్ 4 వికెట్లు పడగొట్టగా.. జాడెన్ సీల్స్, జస్టిన్ గ్రీవ్స్ తలో మూడు వికెట్లు తీశారు. అనంతరం వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 143 పరుగులకు ఆలౌట్ అయింది. జాన్ కాంప్‌బెల్ అత్యధికంగా 36 పరుగులు చేయగా.. షాయ్ హోప్ 23 పరుగులు చేశాడు. ఆసీస్ బౌలర్లలో స్కాట్ బోలాండ్ మూడు వికెట్లు, జోష్ హేజిల్‌వుడ్, పాట్ కమ్మిన్స్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్‌కు తలో వికెట్ దక్కింది. ఆసీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 82 పరుగుల ఆధిక్యం లభించింది.అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా.. 121 పరుగులకు ఆలౌట్ అయింది. కామెరాన్ గ్రీన్ అత్యధికంగా 42 పరుగులు చేయగా.. మిగిలిన బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. వెస్టిండీస్ జట్టు తరపున అల్జారి జోసెఫ్ ఐదు వికెట్లు తీయగా.. షమర్ జోసెఫ్ నాలుగు వికెట్లు పడగొట్టారు. 204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్.. 14.3 ఓవర్లలో 27 పరుగులకే కుప్పకూలింది. 10 మంది బ్యాట్స్‌మెన్ రెండెంకెల స్కోరును దాటలేకపోయారు. స్టార్క్ 9 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీయగా.. బోలాండ్ హ్యాట్రిక్ వికెట్లు తీశాడు. 14వ ఓవర్‌లో వరుసగా మూడు వికెట్లు తీసి.. ఆసీస్ తరుపున టెస్ట్‌ల్లో హ్యాట్రిక్ సాధించిన పదో బౌలర్‌గా నిలిచాడు.స్టార్క్ కేవలం 15 బంతుల్లోనే 5 వికెట్లు పడగొట్టాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా ఐదు వికెట్ల తీసిన బౌలర్‌గా నిలిచాడు. తన మొదటి ఓవర్ మొదటి బంతికే వికెట్ల వేట మొదలు పెట్టిన స్టార్క్.. వరుసగా బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్‌కు పంపించాడు. అంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన ఎర్నీ టోషాక్ (1947లో భారత్‌పై), ఇంగ్లాండ్‌కు చెందిన స్టువర్ట్ బ్రాడ్ (2015లో ఆస్ట్రేలియాపై), ఆస్ట్రేలియాకు చెందిన స్కాట్ బోలాండ్ (2021లో ఇంగ్లాండ్‌పై) పేరిట ఉంది. వీరు ఒక్కొక్కరు 19 బంతుల్లో ఐదు వికెట్లు పడగొట్టారు. ఇప్పుడు స్టార్క్ ఈ రికార్డును బ్రేక్ చేశాడు. తన వందో టెస్ట్‌లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు.

## ప్లేయర్లను బోర్డు సరిగ్గా పట్టించుకోవడం లేదు

### వెస్టిండీస్ జట్టు మాజీ క్రికెటర్ బ్రియన్ లారా

ప్రపంచ క్రికెట్‌లో వెస్టిండీస్ జట్టు ఒకప్పుడు భీకరంగా ఉండేది. కరీబియన్ జట్టుతో మ్యాచ్ అనగానే ప్రత్యర్థులు బెంబేలెత్తిపోయేవారు. కానీ, ప్రస్తుతం విండీస్ క్రికెట్ జట్టు పరిస్థితి పూర్తి భిన్నంగా తయారైంది. అది రోజురోజుకూ పతనమవుతోంది. రీసెంట్?గా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు మ్యాచ్?లో 27 పరుగులకే ఆలౌట్ అవ్వడం దీనికి ఓ ఉదాహరణ. అయితే దీనిపై ఆ జట్టు మాజీ క్రికెటర్ బ్రియన్ లారా స్పందించాడు. జట్టు ఇలా అయిపోవడానికి విండీస్ క్రికెట్ బోర్డే ప్రధాన కారణం అని అన్నాడు. ప్లేయర్లను బోర్డు సరిగ్గా పట్టించుకోవడం లేదని, అందుకే 30 ఏళ్లలోపు ఉన్నవాళ్లు సైతం రిటైర్ అవుతున్నారని అన్నాడు. టాలెంట్ ఉన్న వాళ్లను దేశం కోసం ఆడేలా చేయడంలో బోర్డు విఫలమైందని పేర్కొన్నాడు. ఈ విషయంలో భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డులను చూసి నేర్చుకోవాలని ఫైర్ అయ్యాడు.అంతేకాకుండా వెస్టిండీస్ క్రికెట్? పతనానికి ఫ్రాంచైజీ లీగ్?లే కారణం అని ఆరోపించాడు. భారీగా ఫీజు చెల్లిస్తున్నందున తమ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ఆడడం కంటే ఐపీఎల్, బిగ్ బాష్ వంటి ఫ్రాంచైజీ లీగ్?ల్లో ఆడేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నాడు. ఈ కారణంగా తమ ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్?కు వీడ్కోలు పలుకుతున్నారని పేర్కొన్నాడు. ఇందుకు 29ఏళ్ల పూరన్ ఇటీవల కెరీర్?కు రిటైర్మెంట్ ప్రకటించడమే ఉదాహరణగా చెప్పాడు."కెరీర్‌లో తమకు నచ్చిన నిర్ణయం తీసుకునే ఆటగాళ్లు చాలా అనేకం ఉన్నారు. ఇందులో నికోలస్ పూరన్ లాంటి టాలెంటెడ్ క్రికెటర్లూ ఉన్నారు. అతడు 29 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. పూరన్ ఎందుకిలా చేశాడో అందరికీ తెలుసే. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం ఆరుదాకా ఫ్రాంచైజీ లీగ్‌లు ఉన్నాయి. ఇవన్నీ తమ ప్లేయర్లకు భారీగా ఫీజు చెల్లిస్తున్నాయి" అని లారా రీసెంట్?గా ఓ పాడ్?కాస్ట్?లో మాట్లాడాడు. అయితే ఈ పరిస్థితికి విండీస్ బోర్డే కారణం అని లారా అన్నాడు కాగా, 29ఏళ్ల పూరన్ రీసెంట్?గా ఇంటర్నేషనల్ క్రికెట్?కు రిటైర్మెంట్ ప్రకటించి ఆశ్చర్యపర్చాడు. టీ20 స్టార్ గా పేరున్న పూరన్ పొట్టి ఫార్మాట్?లో 106 టీ20ల్లో 2275 పరుగులు చేశాడు. 61 వన్డేల్లో 1,983 రన్స్ సాధించాడు. ఇందులో 3 సెంచరీలు, 11 హాఫ్ సెంచరీలున్నాయి.

## ఫిట్‌గా లేకపోతే పక్కన పెట్టండి

టీమిండియా దిగ్గజ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ ఇంగ్లండ్ పర్యటనలో జస్‌ప్రీత్ బుమ్రాకు పదే పదే రెస్ట్ ఇవ్వడాన్ని టీమిండియా దిగ్గజ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ తప్పుబట్టాడు. ఫిట్‌గా లేకుంటే సిరీస్ మొత్తానికి పక్కన పెట్టాలని సూచించాడు. ఒక మ్యాచ్ ఆడి మరో మ్యాచ్ రెస్ట్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించాడు. ఇవేం పిల్ల చేష్టలు అంటూ టీమిండియా మేనేజ్‌మెంట్‌పై అసహనం వ్యక్తం చేశాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా జస్‌ప్రీత్ బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడుతాడని సిరీస్ ప్రారంభానికి ముందే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. బుమ్రా కూడా మూడు టెస్ట్‌లు మాత్రమే ఆడుతానని తెలిపాడు.ఈ క్రమంలోనే తొలి టెస్ట్ ఆడిన బుమ్రా రెండో టెస్ట్‌కు దూరంగా ఉన్నాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్ట్‌తో రీఎంట్రీ ఇచ్చాడు. ఈ మూడు టెస్ట్‌ల్లో టీమిండియా ఒకే ఒక్క మ్యాచ్ గెలిచింది. సిరీస్‌లో 1-2తో వెనుకంజలో నిలిచింది. సిరీస్‌పై పట్టు సాధించాలంటే టీమిండియాకు నాలుగో టెస్ట్ గెలవడం అత్యంత కీలకం. అయితే వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా.. బుమ్రా నాలుగో




టెస్ట్‌కు దూరమవుతాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నిర్ణయాన్ని మాజీ క్రికెటర్లు తప్పుబడుతున్నారు. నాలుగో టెస్ట్‌కు 8 రోజుల విశ్రాంతి లభించిందని, బుమ్రాను ఖచ్చితంగా ఆడించాలని సూచిస్తున్నారు.తాజాగా ఈ వ్యవహారంపై ఓ ఛానెల్‌తో మాట్లాడిన దిలీప్ వెంగ్ సర్కార్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. 'భారత జట్టు తరఫున ఆడటం ముఖ్యం. ఫిట్‌గా లేకపోతే సిరీస్ నుంచి తప్పుకోండి. అతని(బుమ్రా)కి తొలి టెస్ట్ తర్వాత 7-8 రోజుల విశ్రాంతి లభించింది. అయినా రెండో టెస్ట్‌కు దూరంగా ఉంచడం ఆమోదయోగ్యమైన నిర్ణయం కాదు. బహుషా గంభీర్, అగార్కర్‌కు ఇలా చేయడం నచ్చుతుందేమో. నాకు మాత్రం ఇలా ఆటగాళ్లు తమకు నచ్చిన మ్యాచ్ ఆడటం అస్సలు నచ్చదు. ఫిట్‌గా ఉంటే జట్టుకు అందుబాటులో ఉండాలి. జట్టు తరఫున అన్ని మ్యాచ్‌లు ఆడాలి. బుమ్రా వరల్డ్ క్లాస్ బౌలర్. అతను భారత్‌కు విజయాలు అందించగలడు. ఒక్కసారి విదేశీ పర్యటనకు వచ్చేరంటే.. జట్టు తరఫున ప్రతీ మ్యాచ్ ఆడాలి. వ్యక్తిగత ప్రాధాన్యత ఆధారంగా మ్యాచ్‌లను ఎంచుకునే ఆస్కారం ఇవ్వద్దు.'అని దిలీప్ వెంగ్‌సర్కార్ చెప్పుకొచ్చాడు.

# విశ్వజ



## బరువు తగ్గాలనుకుంటున్నారా..? రాత్రి పడుకునే ముందు ఈ 5 డ్రింక్స్ తాగండి..

అనారోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు కారణంగా చాలామంది అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. గంటల తరబడి కూర్చొని ఆఫీస్ వర్క్ చేయడం, వ్యాయామం లేకపోవడం వల్ల మధుమేహం, గుండె జబ్బులు, ఊబకాయం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. బరువు తగ్గేందుకు జిమ్‌కి వెళ్తున్న, తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకున్న ఫలితం లేకుండాపోతుంది. అయితే రాత్రిపూట కొన్ని ఆరోగ్యకరమైన డ్రింక్స్‌ను తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గొచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం. జీలకర్ర టీ.. జీలకర్ర, పుదీనా, అల్లం కలిపి దాదాపు 10 నిమిషాల పాటు నీటిలో మరిగించాలి. తిన్న అరగంట తర్వాత ఈ డ్రింక్ తాగితే కొవ్వు కరిగిపోతుంది. ఇది జీర్ణవ్యవస్థను కూడా శుభ్రం చేస్తుంది. గ్రీన్ టీ.. గ్రీన్ టీ లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, కాటెచిన్లు జీవక్రియను వేగవంతం చేస్తాయి. దీంతో బరువు తగ్గుతాం. రాత్రిపూట గ్రీన్ టీ తాగితే, నిద్రలోనూ కేలరీలు బర్న్ అవుతాయి. దాల్చిన చెక్క నీరు... దీనిలోని యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెరను నియంత్రిస్తాయి. రాత్రిపూట తాగితే బరువు తగ్గడంలో సహాయపడుతుంది. పుదీనా టీ.. పుదీనా టీ జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా మంచి నిద్రకూ సహాయపడుతుంది. కొవ్వు కరిగిస్తుంది. నిమ్మకాయ నీరు.. రాత్రి భోజనం తర్వాత లేదా నిద్రకు ముందు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి త్రాగితే శరీరంలోని టాక్సిన్లు బయటికివస్తాయి. జీర్ణక్రియను మెరుగుపడుతుంది. శరీరంలోని కొవ్వును ఇట్టే కరిగిస్తుంది.

## ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదు.. !

సాధారణంగా మనం వంటల్లో ఉపయోగించే ఉల్లిపాయ కేవలం రుచి కోసమే కాదు, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఒక పోషకాహార గని. దీనిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు. రోగనిరోధక శక్తి పెంపు: ఉల్లిపాయలో ఉండే విటమిన్ సి మరియు క్వెర్సెటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి, తద్వారా జలుబు, దగ్గు వంటి సాధారణ ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. %సాశ్రీంశీ =ఝుఎ% "అతిగా నిద్రిస్తున్నారా? అయితే ఈ రోగాలకు వెల్కమ్ చెప్పినట్టే " గుండె ఆరోగ్యానికి రక్షణ: ఇది రక్తపోటును నియంత్రించి, చెడు కొలెస్ట్రాల్ (%ూణూ%) స్థాయిలను తగ్గిస్తుంది. దీనిలోని సల్ఫర్ సమ్మేళనాలు రక్తాన్ని పల్చబరచి, రక్తం గడ్డకట్టడాన్ని నివారిస్తాయి, తద్వారా గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. జీర్ణక్రియ మెరుగుదల: ఉల్లిపాయలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీనిలోని ప్రీబయోటిక్స్ పేగులోని మంచి బ్యాక్టీరియా వృద్ధికి తోడ్పడి, ప్రేగు ఆరోగ్యాన్ని కాపాడతాయి. యాంటీ-క్యాన్సర్ లక్షణాలు: క్వెర్సెటిన్ మరియు ఆంథోసైనిన్స్ వంటి సమ్మేళనాలు కొన్ని రకాల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో



సహాయపడతాయి. ఎముకల ఆరోగ్యం: ఉల్లిపాయలో ఉండే విటమిన్ సి మరియు కాల్షియం ఎముకల సాంద్రతను పెంచి, వాటిని బలోపేతం చేస్తాయి. రక్తంలో చక్కెర నియంత్రణ: డయాబెటిస్ ఉన్నవారికి ఉల్లిపాయ చాలా ప్రయోజనకరం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

# రోజూ చపాతీలు తింటున్నారా, మంచిదేనా - నిపుణుల సూచనలు..!!



ప్రస్తుత కాలంలో జీవన శైలి.. ఆహారపు అలవాట్లలో మార్పు కనిపిస్తోంది. ఎక్కువ మంది రాత్రి వేళ చపాతి తీసుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అధిక బరువుతో నియంత్రణతో పాటుగా అనేక ఆరోగ్య సమస్యలకు చపాతీ ఆహారం మేలు చేస్తుంది. ఇదే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవా ల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. చపాతీలతో పాటుగా తీసుకునే కూరల విషయంలోనూ పలు సూచనలు చేసారు. చపాతీలు సాధారణంగా గోధుమపిండితో తయారు చేస్తారు. ఇందులో ఉండే ఫైబర్ ఆరోగ్యానికి మంచిదేనని నిపుణులు చెబుతున్నారు. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుందని, మలబద్ధకాన్ని నివారిస్తుందని, పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇందులో బి1, బి2, బి3, బి6, బి9, ఇ విటమిన్లతో పాటు ఐరన్, కాపర్, మాంగనీస్?, సిలికాన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, పొటాషియం, అయోడిన్, జింక్, కాల్షియం వంటి ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయని పేర్కొంటున్నారు. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చని పేర్కొంటున్నారు. చపాతీలు రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయని, డయాబెటిస్?తో బాధపడుతున్న వారికి లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించా లనుకునే వారికి మంచిది. చపాతీల్లో ఉండే బి విటమిన్లు, జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయి. చపాతీలు గుండె ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. చపాతీ ఆరోగ్యానికి మంచిదే కదా అని ఎక్కువ నూనె, నెయ్యితో చేసుకోవడం వల్ల బాడీలో అనవ సర కొవ్వులు చేరతాయని నిపుణులు చెబుతున్నారు. పుల్కా చేసుకొని తింటే మరీ మంచిదని పేర్కొంటున్నారు. మార్కెట్లో దొరికే పిండిలో మైదా కూడా కలిసి ఉంటుందని, కాబట్టి ముడి గోధుమ లు తీసుకొని స్వయంగా పట్టించుకొని ఆ పిండితో చపాతీ చేసుకుంటే మంచిది. చపాతీ లో కాంబినే షన్ కోసం పప్పు.. బంగాళాదుంప కర్రీ అని కాకుండా అన్ని రకాల కాయగూరలతో చేసిన కూరలు తీసుకోవడం వల్ల పోషకాలన్నీ శరీరానికి అందుతాయని సూచిస్తున్నారు. ఈ క్రమంలో క్యారెట్ ముక్కలు, బీన్స్, పాలకూర వంటి వాటిని ఉడికించి, గోధుమ పిండి కలుపుకొని చపాతీలు చేసు కుంటే అటు రుచికి, ఇటు ఆరోగ్యానికి ఆరోగ్యం. గోధుమపిండికి రాగి పిండి, సోయాబీన్ పిండి, చిరుధాన్యాలతో తయారుచేసిన పిండి వంటివి కూడా కలుపుకొని చపాతీ తయారు చేసుకోవచ్చు.

# చేపలు తింటున్నారా? ఇవి తప్పక తెలుసుకోండి

చేపలు భారతీయ సంప్రదాయ ఆహారంలో ప్రధానమైనవి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు సమృద్ధిగా ఉండే చేపలతో వచ్చే హెల్త్ బెనిఫిట్స్ అన్నీ ఇన్నీ కావు. చేపలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. శరీర వాపును తగ్గిస్తాయి.చేపలు ప్రోటీన్ యొక్క అద్భుతమైన మూలంగా చెప్పవచ్చు. చేపలు కండరాల వృద్ధికి కీలకంగా పని చేస్తాయి. చేపలలో విటమిన్ %ణ% మరియు సెలీనియం వంటి ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజాలు ఉంటాయి. ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు చేపలలో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు గుండె సంబంధిత ఆరోగ్యాన్ని నిర్వహించడానికి కీలకమైనవి. తరచూ చేపలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఇవి రక్తపోటును తగ్గించడంలో మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. చేపలను ఆహారంలో తరచుగా తీసుకోవడం మెదడు పనితీరును మెరుగుపరచగలదు. మానసిక ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. ప్రోటీన్ మూలం చేపలు అధిక నాణ్యత గల ప్రోటీన్ మూలం గా చెప్పవచ్చు , కాబట్టి కండరాల నిర్మాణానికి చేపలు బాగా ఉపయోగపడతాయి . ప్రోటీన్ కణజాలాలను మరమ్మతు చేయడానికి మరియు ఎంజైమ్‌లు మరియు హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి చేపల అవసరం ఉంది. ఆహారంలో చేపలను చేర్చడం అధిక క్యాలరీలు లేకుండా తగినంత ప్రోటీన్ తీసుకునేలా చేస్తుంది. విటమిన్లు మరియు ఖనిజాలు చేపలు విటమిన్ %ణ% వంటి విటమిన్లతో సమృద్ధిగా ఉంటాయి. చేపలలో ఉండే పోషకాలు ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనది. ఇది సెలీనియంను కూడా కలిగి ఉంటుంది. ఇది కణాలను నష్టం నుండి రక్షించే యాంటీఆక్సిడెంట్. ఈ పోషకాలు మొత్తం ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు తోడ్పడతాయి. %సాశ్రీంశీ =ఝుఎ% రీల్స్ అతిగా చూస్తున్నారా? అయితే మీ ఆరోగ్యం ప్రమాదంలో పడినట్లే! సాంస్కృతిక ప్రాముఖ్యత భారతదేశంలో, చేపలకు సాంస్కృతిక ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో ఇది ప్రధానమైన ఆహారంగా చెప్తారు. ఆహారంలో చేపలను చేర్చడం పోషకాహారాన్ని మెరుగుపరచడమే కాకుండా తరాలుగా అందించిన వంటకాల సంప్రదాయాలను కూడా కాపాడుతుంది.





# మార్కెట్

## బాలెనో, ఎర్టిగా వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ : మారుతి సుజుకీ..ఎర్టిగా, బాలెనో వాహన ధరలను 1.4 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ రెండు మోడళ్లలో భద్రత ప్రమాణాలను మెరుగుపర్చడంలో భాగంగా ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను నెలకొల్పింది. దీంతో వీటి ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో రూ.6.7 లక్షల నుంచి రూ.9.92 లక్షల లోపు, ఎర్టిగా రూ.8.97 లక్షల నుంచి రూ.13.25 లక్షల లోపు లభించనున్నాయి.

## నిధుల సేకరణలో ఎస్బీఐ

న్యూఢిల్లీ : దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)..ఈక్విటీ, డెబిట్ మార్కెట్ల నుంచి రూ.45 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో క్యూఐపీ ద్వారా రూ.25 వేల కోట్ల నిధులు కూడా ఉన్నాయి. బుధవారం బ్యాంక్ క్యూఐపీ విక్రయాన్ని ప్రారంభించింది. దీంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా బాండ్లను విక్రయించడంతో మరో రూ.20 వేల కోట్లను సమీకరించాలని యోచిస్తున్నది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రూ.15 వేల కోట్లను క్యూఐపీ ద్వారా సేకరించిన విషయం తెలిసిందే.




# 5 వేల మందిని తొలగిస్తున్నాం.. లేఆఫ్స్ ప్రకటించిన ఇంటెల్

ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. తాజాగా చిప్ తయారీ సంస్థ ఇంటెల్ తన ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ వారంలో 5 వేల మందికిపైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. కాగా, ఇంటెల్ 4 వేల మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించనున్నట్లు ఇటీవలే అంచనాలు వెలువడిన విషయం తెలిసిందే. అయితే, 4 వేల మంది కాదని, 5 వేల మందిని తొలగిస్తున్నట్లు సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ వారంలోనే అమెరికా వ్యాప్తంగా తొలగింపులు ఉంటాయని స్పష్టం చేసింది. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా లే ఆఫ్‌లు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఒరెగాన్, కాలిఫోర్నియాలో ఎక్కువగా తొలగింపులు ఉంటాయని పేర్కొంది. ఇందులో కాలిఫోర్నియా ఆఫీస్ నుంచి 1,935 మంది, ఒరెగాన్ యూనిట్ నుంచి 2,392 మంది తమ ఉద్యోగాలను కోల్పోనున్నట్లు తెలిసింది. అరిజోనా కార్యాలయం నుంచి 696 మందిపై వేటు పడనున్నట్లు సమాచారం. ఈ ఏడాది మార్చిలో ఇంటెల్ కొత్త సీఈఓగా లిప్-బు టాన్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్న ఇంటెల్, తన ఉద్యోగుల్లో 20 శాతానికి పైగా తొలగించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే లేఆఫ్స్‌ను ప్రకటించింది.







## ఐవోబీ వడ్డీరేట్ల తగ్గింపు

చెన్నై : ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(ఐవోబీ) రుణగ్రహీతలకు శుభవార్తను అందించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని పది బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన రేట్లు వెంటనే అమలులోకి రానున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటును 8.25 శాతం నుంచి 8.15 శాతానికి దించిన సంస్థ..నెల రోజుల రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.40 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఇది 8.50 శాతంగా ఉన్నది. అలాగే మూడు, ఆరు, ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై పది బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో వడ్డీరేట్లు వరుసగా 8.55 శాతం, 8.80 శాతం, 9 శాతానికి దిగొచ్చాయి.

# ఇద్దరు సిఎంల భేటీలో తేలిందేమిటి ?

## బడాయి తప్ప పోలవరం,బనకచర్లపై చర్చలేవీ

## గతేడాది కూడా ఇద్దరు సిఎంల భేటీతో ఒరిగిందేమిటి

## చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారు

## మీడియా సమావేశంలో అంబటి రాంబాబు



అమరావతి,జూలై17 : ఢిల్లీలో పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులపై ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తారని చెప్పారు.. కొన్ని నిర్ణయాలు వస్తాయని అందరూ ఎదురు చూశారు.. కానీ ఈ సమావేశంలో అసలు ఏ ధమైన చర్చ జరగలేదు అని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. సీఎంల సమావేశంలో బనకచర్లపై అసలు ప్రస్తావనే లేదు.. వాళ్ళ పత్రికల్లోనే ఏపీలో ఒక రకంగా, తెలంగాణలో మరో రకంగా వచ్చింది.. చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడి బయటకు వచ్చాక ఉభయ రాష్ట్రాలు నాకు సమానమే అని ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు.. ఇరిగేషన్ మంత్రి రామానాయుడు కార్యాచరణకు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తామన్నారు.. వాళ్ళ మాటలు వింటుంటే సీఎం చంద్రబాబు మోసపు మాటలు చెబుతున్నారని అనకతప్పదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది 7- 7- 24న ప్రగతి భవన్ లో సమావేశమయ్యారు.. విభజన సమస్యల పరిష్కారం కోసం భేటీ అయ్యామన్నారు.. త్వరలో కమిటీ- వేసి తేల్చేస్తామన్నారు.. ఇప్పటికి ఏడాది దాటింది.. మీరు సాధించింది ఏంటి అని అంబటి రాంబాబు ప్రశ్నించారు. ఇక, నీళ్లను రాయలసీమకు తీసుకెళ్లి సస్యశ్యామల చేద్దామన్న ఆలోచన చంద్రబాబు లేదని వైసీపీ నేత అంబటి రాంబాబు విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన ప్రాజెక్టులు తప్ప మీరు చేసిందేమీ లేదు.. పోలవరం నుంచి బనకచర్లకు నీళ్లు తీసుకు వెళ్లాంటే 42 లెవెల్ ఉన్నప్పుడు మాత్రమే సాధ్యం అవుతుంది.. ఇవాళ దాన్ని 41.15 కే చంద్రబాబు అంగీకరించారు.. ఇప్పుడు పోలవరం, బనకచర్లకి 42 నుంచి నీళ్లు ఎలా తీసుకువెళతారు అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2027 వరకు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.. అక్కడ పనులు మాత్రం ముందుకు వెళ్ళడం లేదు.. డయాఫ్రమ్ వాల్ చాలా ప్రధానమైంది.. 0.65 వెడల్పుతో వేయాల్సిన డయాఫ్రమ్ వాల్ 0.9 వెడల్పులో వేస్తున్నారు.. ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు ప్రవర్తన సరినది కాదు.. ఆయనకు పోలవరం మీద అసలు ఇం-ట్రెస్ట్ లేదు.. ఆయన దృష్టి మొత్తం మొబలైజేషన్ ఫండ్ మీదే ఉందని మాజీ మంత్రి రాంబాబు ఆరోపించారు. ఎల్లో మీడియా, చంద్రబాబు.. రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని అంబటి రాంబాబు మండిపడ్డారు. పోలవరం, బనకచర్ల మీదనే రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశమంటూ ఎల్లో మీడియా చాలా రోజులుగా హడావుడి చేశాయి.. తీరా చూస్తే అసలు దీనిమీద చర్చే జరగలేదని అంబటి రాంబాబు అన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎవరిని మోసం చేయాలని ఇలాంటి పనులు చేస్తున్నారు చంద్రబాబూ? అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు శాలువాలు కప్పి బయటకు వచ్చారు. రెండు రాష్ట్రాలూ నాకు సమానమంటూ బడాయి మాటలు చెప్పి వచ్చేశారు. మంత్రి రామానాయుడు మాత్రం కమిటీ- వేస్తున్నట్టు- చెప్పి మళ్లీ మోసం చేయాలని చూశారు. విభజన సమస్యల పరిష్కారం కోసం అంటూ గతంలో ఇద్దరు సీఎంలు కలిశారు. ఆ రోజు కూడా తెగ బడాయి మాటలు చెప్పారు. తీరా చూస్తే ఏమీ జరగలేదు. కానీ వారి ఎల్లో మీడియా మాత్రం ఆహాఓహో అంటూ జాకీలు లేపింది. రాయలసీమకు నీరు అందించే ఆలోచనే చంద్రబాబు కు లేదు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఇంతకాలంలో రాయలసీమ కోసం ఒక్క పనైనా ఎందుకు చేయలేదు?. పోలవరంలో 42 మీటర్ల ఎత్తు ఉంటేనే బనకచర్లకు నీరు తీసుకెళ్లటానికి వీలవుతుంది. కానీ పోలవరాన్ని 41 మీటర్ల ఎత్తుకే ఆపేస్తే ఇక బనకచర్ల ఎలా సాధ్యం?. 2027కు పోలవరాన్ని పూర్తి చేస్తామని చంద్రబాబు చెప్పారు. కానీ ఆ స్థాయిలో పనులు జరగటం లేదని ఎల్లో మీడియానే రాసింది. డయాఫ్రం వాల్ నిర్మాణం1.6 మీటర్ల వెడల్పుతో వేయాల్సి ఉండగా కేవలం 0.9 మీటర్లకే వేస్తున్నారు. ఇది పోలవరం ప్రాజెక్టుకే అత్యంత ప్రమాదకరం. ప్రాజెక్టు నిర్మాణ సంస్థతో కుమ్మక్కై చంద్రబాబు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పోలవరాన్ని చంద్రబాబు సర్వనాశనం చేశారు. సీడబ్ల్యూసీ, పోలవరం అథారిటీ- వారు బనకచర్లకు అనుమతులు లేవని తేల్చిచెప్పింది. ఇది చంద్రబాబుకు సిగ్గుచేటు- కాదా?అన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు నీరు వదలటానికి చంద్రబాబు వెళ్లటం ఏంటి?. మంత్రులో, అధికారులే చేసే చేసే పనిని చంద్రబాబు చేయటం సిగ్గుచేటు-. హంద్రీనీవా కొత్త ప్రాజెక్టు కాదు. పోలవరం, అమరావతి విషయాలలో చంద్రబాబు దుర్మార్గపు పనులు చేస్తున్నారు. రాయలసీమకు చంద్రబాబు ఏనాడూ ఏమీ చేయలేదు. తప్పు ఒప్పో చూడకుండా పోలీసులు ఎలా కేసు పెడతారని ప్రశ్నించారు.

# మచిలీపట్టణంలో ఉద్రిక్తత

## టిడిపి,వైకాపానేతల బాహాబాహీ

మచిలీపట్టణం,జూలై17 : కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని నాని మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండటంతో.. రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలు, శ్రేణులు నిరసనలకు పిలుపునిచ్చారు. పేర్ని నాని వ్యాఖ్యలను నిరసిస్తూ నిన్న ఆయన నివాసానికి సమీపంలో తెలుగు దేశం పార్టీ మహిళ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ నిరసనలో చీపుళ్లతో పేర్ని కిట్టు-ను కొట్టారు. ఇక, నిన్న టీ-డీపీ ఆందోళనకు నిరసనగా నేడు వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంత్రి కొల్లు రవీంద్ర నివాసరం దగ్గర నిరసన చేపట్టారు. మంత్రి ఇంటి దగ్గర కొల్లు చిత్రపటాన్ని వైసీపీ మహిళ విభాగం నేతలు చీపుళ్లతో కొట్టారు. దీనికి కౌంటర్ గా వైసీపీ నిరసనపై టీ-డీపీ మహిళా నేతలు రామానాయుడు పేట సెంటర్లో పేర్ని నాని దిష్టిబొమ్మ తగలబెట్టారు. దీంతో మచిలీపట్నంలో రాజకీయం వేడెక్కింది. పేర్ని నాని ఇంటి దగ్గర పోలీసులను భారీగా ఏర్పాటు- చేశారు.

# ఫ్యాక్షన్‌తో సర్వస్వం కోల్పోయిన కుటుంబం

## వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చిన మంత్రి లోకేశ్

అమరావతి,జూలై17 : ఫ్యాక్షన్ బారిన పడి సర్వం కోల్పోయిన కుటుంబానికి విద్య, ఐటీ- శాఖల మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారు. రాయలసీమలో బోయ నరసింహులు కుటుంబం ఫ్యాక్షన్ భూతానికి బలి అయ్యింది. ప్రత్యర్థుల చేతుల్లో బోయ నరసింహులు సహా ముగ్గురు కిరాతకంగా హత్యకు గురయ్యారు. ఈ క్రమంలో బోయ నరసింహులు కుటుంబాన్ని మంత్రి లోకేష్.. ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉంటానని, అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రాయలసీమలో ఫ్యాక్షన్ బారిన పడి నష్టపోయిన కుటు-ంబాలను ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని మాట్లాడారు మంత్రి. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గం కామిరెడ్డిపల్లికి చెందిన దాసరి నరసింహులు టీ-డీపీలో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దీంతో ప్రత్యర్థులు దారి కాచి 2011లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న బోయ నరసింహులు సహా అతని కుమారుడు, కుమార్తెను దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. ఫ్యాక్షన్ బారిన పడి బోయ నరసింహులు కుటుంబం ఎంతో నష్టపోయింది. అప్పట్లో పార్టీ అధినేత చంద్రబాబు ఆ కుటు-ంబానికి అండగా నిలిచారు. ఇప్పుడు మృతుడి కుటు-ంబ సభ్యులను మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసానికి ఆహ్వానించారు. అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నాటి ఫ్యాక్షన్ హత్యా ఘటనలో రెండు నిలల చిన్నారి మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. సదరు బాలుడిని మంత్రి ఆప్యాయంగా పలకరించారు. బాలుడి చదువు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లాలని, తాను కుటు-ంబానికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని తమ యోగక్షేమాలు వాకబు చేయడం పట్ల మంత్రి నారా లోకేష్‌కు బోయ నరసింహులు కుటు-ంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణ...నేటికి వాయిదా

హైదరాబాద్,జూలై17 : ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించారు. ఓంఎసీకి అక్రమంగా మైనింగ్ లీజు అప్పగించారని అన్నారు. ఓఎంసీకి లీజు కేటాయించేలా శ్రీలక్ష్మి చొరవతీసుకున్నారని కోర్టుకు వివరించారు. పలు దరఖాస్తులు వచ్చినా ఓఎంసీకి లీజు వచ్చేలా చూశారని తెలిపారు. ఆమె అక్రమాలకు పాల్పడ్డారనడానికి ఆధారాలు ఉన్నాయని, సాక్ష్యాధారాలు పరిశీలించిన తర్వాతే సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. సబిత, కృపానందం కేసును తనకు అన్వయించుకోవడం సరికాదని.. శ్రీలక్ష్మి రివిజన్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను శు క్రవారానికి వాయిదా వేసింది.

# నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్,జూలై17 : నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం ప్రాంతంలో పలుచోట్ల వర్షం పడడంతో నగర ప్రజలు ఊరట చెందారు. కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, ప్రగతి నగర్, కాప్రా, ఈసీఐఎల్, సైనిక్‌పురి, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, తిరుమలగిరి, బొల్లారం, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, చిలకలగూడ, బేగంపేట, అల్వాల్ ప్రాంతాల్లో వర్షం పడింది. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు- కార్యాలయాల నుంచి వచ్చే ఉద్యోగులు అసౌకర్యానికి గురయ్యారు.

# కూటమిపై బురదజల్లడమే జగన్ పని

## గతంలో చేసిన అక్కృత్యాలను మరచి విమర్శలు

## జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత



విజయవాడ,జూలై17 : కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని జగన్ చూస్తున్నారు అని హోం మంత్రి వంగలపూడి ఆరోపించారు. గతంలో చేసిన అకృత్యాలను మరచి అదేపనిగా జగన్, ఆయన అనుయాయులు విమర్శలు చేస్తున్నారని అనిత మండిపడ్డారు. ఈ మేరకు కృష్ణా జిల్లాలో పర్యటించిన హోం మంత్రి వంగలపూడి అనిత కీలక వ్యాఖ్యలు చేసింది. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు పర్యటనలను అడ్డుకున్నది మీరు కదా?.. నా మీద ఎస్సీ ఎస్టీ కేసు పెట్టారు.. అవినీతి, అరాచకానికి మీరు విత్తనం వేశారు.. వివేకా హత్యతో ఆ విత్తనం పెరిగింది.. సినిమా డైలాగు బ్యానర్ లో వేస్తే తప్పుకాదు అంటున్నారు.. మరి, గతంలో పట్టాభి బోస్ డీకే అంటే ఎందుకు అరెస్ట్ చేశారు అని ప్రశ్నించారు. మా కార్యకర్తలకు పునకాలు వచాయి.. అందుకే టీడీపీ ఆఫీసుపై దాడి చేశారని అన్నారు.. బోస్ డీకే కూడా సినిమా డైలాగ్ కదా?.. రప్పా రప్పా అంటూ నరుకూతామంటే కేసులు పెట్టారా అని మంత్రి అనిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మా వాళ్ళు నా మాట వినరు అంటూ బెదిరిస్తున్నారా అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. పేర్ని నాని నోటికి వచ్చినట్లు- మాట్లాడుతున్నారు.. కుటుంబ సభ్యులను కూడా విమర్శిస్తున్నారు.. చీకటిలో వేసెయ్యాలా.. చంద్రబాబు ఇంకా ఎంతకాలం బతుకుతాడు అంటున్నాడు.. వైసీపీ వాళ్లు దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏం మాట్లాడినా చెల్లుబాటు- అవుతుందని అనుకుంటే ఎలా?.. గత ప్రభుత్వంలో పెట్టిన కేసులపై.. ఇప్పుడు నమోదు అవుతున్న కేసులపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై దాడి చేశారని జగన్ అంటున్నారు.. ఆయన ప్రశాంతి రెడ్డిని ఎలాంటి మాటలు అన్నారో గమనించారా అని అన్నారు. ప్రసన్న వ్యాఖ్యలను కోర్టు కూడా తప్పుబట్టింది.. సొంత చెల్లి కట్టుకున్న చీర గురించి మాట్లాడిన వ్యక్తి జగన్.. ఆయన నుంచి మంచిని ఆశించడం సరికాదు అని వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేసారు.

దొంగ ఓటర్లను గుర్తిస్తారు

# పహల్గామం ఉగ్రవాదులను మాత్రం కనిపెట్టరు: ఓవైసీ

కామారెడ్డి,జూలై17 : ఏఐఎంఐఎం అధ్యక్షుడు, పార్లమెంటరీ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ జమ్మూ కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి ఘటనపై మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణలోని బోధన్ పట్టణంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన ఆయన.. కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ ఓటర్ల జాబితాలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు, నేపాలీలు ఉన్నట్టు- గుర్తించగలగినప్పుడు.. పహల్గాంలో 26 మంది హిందూ పర్యాటకులను దారుణంగా హత్య చేసిన ఉగ్రవాదుల్ని ఎలా కనుగొనలేకపోయారని ప్రశ్నించారు. బీహార్ లో విదేశీయులను గుర్తించగలుగుతారు.. కానీ, పహల్గాంలోకి ఉగ్రవాదులు ఎలా చొరబడ్డారు అనే దానిపై మాత్రం విచారణ ఉండదు. మీరు నిద్రపోతున్నారా..? మీ పరిపాలన కళ్లు మూసుకుని కూర్చున్నదా..? అని ఒవైసీ ప్రశ్నించారు. పహల్గాం దాడిపై దేశవ్యాప్తంగా జరిగిన 'ఆపరేషన్ సిందూర్' లో భాగంగా.. ప్రతినిధుల బృందంలో సభ్యుడిగా ఉన్న ఒవైసీ, ఈ ఆపరేషన్‌ను నిలిపి వేయకూడదని.. నలుగురు ఉగ్రవాదుల్ని గుర్తించే వరకూ ఆపరేషన్ కొనసాగాలని కోరారు. ప్రభుత్వం సమాధానం చెప్పే వరకూ తాను ఇలాంటి కఠిన ప్రశ్నలు అడగడం మానని హెచ్చరించారు. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాపై కూడా విమర్శలు గుప్పించారు. జూలైలో మీరు మీ తప్పును ఒప్పుకుంటున్నారు. ఇది సెక్యూరిటీ- ఫెయిల్యూర్ అని చెబుతున్నారని మాకు తెలుసు. కానీ, దానికి పూర్తి బాధ్యత తీసుకుంటున్నారని చెప్పినట్టే సరిపోదు.. చర్యలు తీసుకోవాలని వ్యాఖ్యానించారు. ఉగ్రదాడిలో 26 మంది హిందూ పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఒవైసీ తీవ్రంగా తీసుకున్నారు. ఈ దాడిపై సమగ్ర విచారణ, దోషుల పట్ల కఠిన చర్యలు, భద్రతా లోపాలపై స్పష్టమైన సమాధానాలు ప్రభుత్వంతో అడుగుతానని స్పష్టం చేశారు.

# ఉపాధిహామీలో దక్షిణాదిలో ఎపి ఆదర్శం

## ఎక్స్ వేదికగా వెల్లడించిన పవన్ కళ్యాణ్

అమరావతి,జూలై17 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దక్షిణాది రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముందుకెళు న్నాయని వెల్లడించారు. ఇక, ఉపాధి ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతుండటంతో, రాష్ట్రంలోని గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. అధికారుల పని తీరును ఎప్పటికప్పుడు సోషల్ ఆడిట్ ద్వారా సమీక్షిస్తూ, నాణ్యతా తనిఖీలు, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం వల్ల ఇతర రాష్ట్రాల అధికారులు కూడా ఆంధ్రప్రదేశ్ పని తీరును మెచ్చుకుంటు-న్నారని పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# కేంద్రానికి బియ్యం సరఫరా

## నాణ్యతలో రాజీపడకుండా చూడాలి

## మిల్లర్లకు సూచించిన మంత్రి నాదెండ్ల

విజయవాడ,జూలై17 : కేంద్రానికి బియ్యం సరఫరాలో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉండాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. కేంద్ర నిబంధనల ప్రకారం బ్రోకెన్ శాతం 10శాతం లోపు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సరఫరా పక్రియలో ఆలస్యం జరగకుండా -టె-స్టింగ్, ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలోని సివిల్ సప్లయ్ భవనంలో రైస్ మిల్లర్లతో నాదెండ్ల మనోహర్ కీలక సమావేశం నిర్వహించారు. ఎఈఒకు సీఎంఆర్ 10 శాతం బ్రోకెన్ రైస్ సరఫరా చేయాల్సిన కీలక దశలో.. ఆంధ్రప్రదేశ్‌కు గోల్డెన్ ఛాన్స్ దక్కిందన్నారు. ఏపీలోని రైస్ మిల్లర్లు అలాగే, నాణ్యమైన బియ్యంతో పాటు- సమయానికి సరఫరా అనే రెండు అంశాల మీద రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది అని మంత్రి మనోహర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైంది.. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయింది.. ఇది కేంద్రానికి మంచి సిగ్నల్ అన్నారు. దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల నుంచి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఈఒ సేకరించేందుకు సిద్ధమైంది.. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు- పంజాబ్, హర్యానా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఉన్నాయి.. ఈ పోటీ-లో మనం నిలవాలంటే అందరి కంటే ముందు కదలాల్సిందేనన్నారు. నాణ్యమైన బియ్యంతో, సమయానికి సరఫరా చేయడంతో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పేరు నిలబెట్టాల్సిందే అని మంత్రి నాదెండ్ల మనోహర్ తేల్చి చెప్పారు.

# ప్రజలను మోసం చేస్తున్నకూటమి నేతలు: బొత్స



ఏలూరు,జూలై17 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి బొత్సా సత్యనారాయణ ఆరోపించారు. తాట తీస్తాం, తోలు తీస్తాం, మక్కెలు ఇరగగొడతాం అంటారు.. మీరు ఎవరి మక్కెలు ఇరగగొడతారు? అని ప్రశ్నించారు. మేము అంత ఖాళీగా కూర్చొన్నామా? అంత చేతకాని వాళ్లమా? మాకేం రాదా? అని బొత్సా ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించిన మాజీ మంత్రి బొత్సా సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక, మేము ప్రజాస్వామ్యాన్ని నమ్మేవాళ్లం, చట్టం మీద గౌరవం ఉన్న వాళ్లం అని బొత్స అన్నారు. మీలాగ వచ్చి చట్టాలతో చీట్ చెయ్యాలని చూస్తే ఊరుకోం అని హెచ్చరించారు. రైతులు, మహిళలంటే గౌరవంతో ముందుకెళ్లేదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని ఆయన స్పష్టం చేశారు.

# అసభ్య పదజాలంతో దూషిస్తున్న ఎమ్మెల్యే

## గాలి భాను ప్రకాశ్‌పై మాజీమంత్రి రోజా ఫిర్యాదు

చిత్తూరు,జూలై17 : చిత్తూరు జిల్లా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పై స్థానిక పోలీస్ స్టేషన్ లో మాజీ మంత్రి ఆర్కే రోజా ఫిర్యాదు చేసారు. తనపై అసభ్య పదజాలంతో దూషిస్తూ, అగౌరవంగా మాట్లాడిన ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షించాలని కోరారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ.. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఒక్క అభివృద్ధి పని చేయాలేదు.. గెలిచినప్పటి నుంచి నగరి ప్రజలకు ఆయన కనిపించలేదు అని మండిపడ్డారు. , ఇసుక అక్రమ రవాణాలో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లను అరెస్టు చేయడం దారుణం అన్నారు. అక్రమ కేసులు పెట్టి మా నేతలను రిమాండ్ కు పంపుతున్నారు.. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు అని ఆరోపించారు.. కేసులు ఎలా పెట్టాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చూసి నేర్చుకోవాలని మాజీ మంత్రి రోజా ఎద్దేవా చేశారు. ఇక, రాజంపేట నుంచి తిరుపతి మీదుగా వచ్చి నగరి మీదుగా ఇసుక చెన్నైకి వెళ్తుందని మాజీమంత్రి రోజా ఆరోపించారు. టిప్పర్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు.. లెక్కల్లో తేడా వస్తే పోలీసులు అరెస్టు చేశారు.. సుప్రీంకోర్టు, హైకోర్టు సోషల్ మీడియా పోస్టులపై ఏం చెప్పిందో పోలీసులకు తెలియదా అని ప్రశ్నించింది. ఎమ్మెల్యే అనుచరులు ఈ ఇసుక దందా చేస్తే.. మా వైసీపీ కౌన్సిలర్లకు సంబంధం ఉందని పోలీసులు అబద్దాలు చెబుతున్నారు.. వైసీపీ నేతలు ఇసుక దందా చేసి డబ్బులు సంపాదిస్తుంటే చంద్రబాబు, లోకేష్ వదిలేస్తారా అని అడిగింది. మూడు జిల్లాలు దాటి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే, అధికారులు ఏం చేస్తున్నారని వైసీపీ నేత రోజా విమర్శించారు.





# బాహుబలిని కట్టప్ప చంపకపోతే..

సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర చర్చ బాహుబలి మూవీపై ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర చర్చ సాగుతోంది. బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు' పదేళ్ల కిందట యావత్ భారత్ దేశం ఈ ప్రశ్నకు సమాధానం కోసం ఎదురు చూసింది. ఒకవేళ 'బాహుబలిని కట్టప్ప చంపకపోతే' అంటూ 'బాహుబలి' టీ-మ్ అడిగిన ప్రశ్నకు రానా సమాధానం ఇచ్చారు. 'అదే జరిగితే, అతని బదులు నేనే చంపేసేవాడిని' అని అన్నారు. దీనిపై ప్రభాస్ స్పందించారు. 'రూ.1000 కోట్ల కలెక్షన్స్ సాధించిన పోస్టర్‌ను పంచుకుంటూ 'దీని కోసం నేను అదే చేయనిచ్చేవాడిని భళ్లా' అని రిప్లై ఇచ్చారు. ప్రస్తుతం ఇద్దరి మధ్య జరిగిన చర్చ సామాజిక మాధ్యమాల వేదికగా నవ్వులు పూయిస్తోంది. ప్రభాస్, రానా, అనుష్క, సత్యరాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఎపిక్ యాక్షన్ మూవీ 'బాహుబలి'. రెండు భాగాలుగా వచ్చిన ఈ మూవీ తెలుగు సినీ ఖ్యాతిని ప్రపంచ యవనికపై నిలబెట్టింది. ఇప్పుడు ఈ రెండింటినీ కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే మూవీగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. ఈ క్రమంలో ప్రభాస్, రానాల మధ్య సామాజిక మాధ్యమాల వేదికగా ఆసక్తికర చర్చ నడిచింది. బాహుబలి: ది ఎపిక్' రన్-టైమ్‌పై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. 'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి: ది కన్‌క్లూజన్' రెండు సినిమాల నిడివి కలిపితే ఐదున్నర గంటలకు పైనే ఉంది. ఈ మొత్తాన్ని మూడున్నర గంటలకు కాస్త అటూఇటూగా కట్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం టీ-మ్ ఈ పనిలోనే ఉంది. కథాగమనంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా రెండు సినిమాలను కలపడం కత్తిమీద సామే. ఇదే విషయమై చిత్ర బృందం కూడా స్పందించింది. అక్టోబరు 31న 'బాహుబలి: ది ఎపిక్'ను విడుదల చేయనున్నారు.



# ప్రభాస్ ఇంట్లో ఖరీదైన కల్పవృక్షం

సినిమాల విషయం పక్కన పెడితే లైఫ్ స్టైల్ విషయాల్లో ప్రభాస్ వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. తాజాగా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆయన కొత్త ఇంట్లో ఏర్పాటు చేసిన ఒక విలువైన చెట్టుపై ఇప్పుడు అందిరి దీష్టి పడింది. అదే కల్పవృక్షం. ఈ చెట్టు- కోసం ప్రభాస్ ఏకంగా రూ. కోటి వరకు ఖర్చు పెట్టినట్టు- సమాచారం. ఈ విషయం సోషల్ మీడియా లో హాట్ టాపిక్ గా మారింది. హిందూ పురాణాలలో కల్పవృక్షంకి ఎంతో ప్రాధాన్యత ఉంది. దేవతల వనంలో ఉండే ఈ చెట్టు-, భక్తుల కోరికలు తీర్చే చెట్టు-గా చెప్పబడుతుంది. శాంతి, సంతానం, సంపద లాంటి ఆశయాల కోసం ఈ చెట్టును కొందరు గృహప్రవేశం సమయంలో, పూజ స్థలాల్లో లేదా ప్రత్యేకంగా ఇంటి పెరట్లో ఏర్పాటు చేస్తారు. ఈ చెట్టు వయస్సును బట్టి దాని విలువ నిర్ధారితమవుతుంది. ఇప్పుడు ప్రభాస్ కొనుగోలు చేసిన కల్పవృక్షం వయసు దాదాపు 100 ఏళ్లు. అందుకే దాని ధర ఏకంగా కోటి రూపాయలు దాటిందట. ప్రభాస్ హైదరాబాద్‌లో నిర్మిస్తున్న విలాసవంతమైన కొత్త ఇంటిలో ఈ చెట్టును ప్రత్యేకంగా దిగించి నాటించారట. ఇది కేవలం సౌందర్యాని కోసం కాదు - ఓ శుభం, శాంతిగా ఉండేందుకు ఏర్పాటు- చేసినదట. ఇంత వరకు ఈ రేంజ్‌లో ఉండే కల్పవృక్షం కేవలం ముఖేష్ అంబానీ ఇంట్లో ఉందని సమాచారం. ఇప్పుడు ప్రభాస్ కూడా అదే తరహాలో స్థిరపడినట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో టాక్.



# ఆస్కార్ లెవల్లో మహేశ్ మూవీకి ప్లాన్

దర్శకధీరుడు రాజమౌళి ఏం చేసినా భారీ ప్లాన్ తోనే చేస్తాడు. ఇప్పుడు మహేశ్ బాబుతో తీస్తున్న ఎస్ ఎస్ ఎంబీ29 సినిమా కోసం భారీ ప్లాన్ చేస్తున్నాడంట. ఆస్కార్ అవార్డు కోసం రాజమౌళి బిగ్ స్కెచ్ వేస్తున్నట్టు- తెలుస్తోంది. ఆల్రెడీ త్రిబుల్ ఆర్ మూవీతో ఒకటి తీసుకొచ్చాడు. ఇప్పుడు ఇంకోదానిపై కన్నేసినట్టు తెలుస్తోంది. అయితే తెలుగు నిర్మాణ సంస్థలతో మూవీ చేస్తే ప్రతిసారి ఫారిన్ కేటగిరీలో నామినేషన్స్ వేయాల్సి వస్తోంది. అప్పుడు ఆస్కార్ అవార్డుల అవకాశాలు బాగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం మహేశ్ తో చేస్తున్న మూవీని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ మీద డాక్టర్ కెఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. తెలుగు బ్యానర్ మీద కాకుండా హాలీవుడ్ బ్యానర్ ను మెయిన్ నిర్మాణ సంస్థగా చూపించేందుకు రాజమౌళి ప్రయత్నిస్తున్నారంట. అందుకోసం హాలీవుడ్ కు చెందిన నిర్మాణ సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు- తెలుస్తోంది. హాలీవుడ్ నిర్మాణ సంస్థను మొదటి ప్రొడ్యూసర్ గా చూపించి కేఎల్ నారాయణను రెండో సంస్థగా చూపించవచ్చు. అలా చేస్తే మూవీ హాలీవుడ్ కోటాలో నేరుగా ఆస్కార్ అవార్డుకు నామినేట్ చేయొచ్చు. అప్పుడు ఎక్కువ విభాగాల్లో ఆస్కార్ కు నామినేషన్స్ వేయొచ్చు. కాకపోతే మూవీ షూట్ ను డైరెక్ట్ గా ఇంగ్లిష్ లో చేయాలి. అదేమంత పెద్ద కష్టం కాకపోయినా.. కొంత బడ్జెట్ పెరుగుతుంది. ఆ లెక్కలు అన్నీ కార్తికేయ చూసుకుంటున్నట్టు- తెలుస్తోంది. అన్నీ కుదిరితే త్వరలోనే దీనిపై అనౌన్స్ మెంట్ వస్తుంది.





# హరిహరవీరమల్లు మూవీకి ఐదేళ్లు


## ప్రమోషన్లలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్ననిధి

హరిహర వీరమల్లు మూవీ జులై 24న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ నిధి అగర్వాల్ వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రమోషన్లు చేస్తోంది. అయితే ఈ సినిమా మొదలై ఐదేళ్లు అవుతోంది. ఇన్నేళు ్లగా మూవీ వాయిదాలు పడుతూనే వచ్చింది. ఇన్నేళ్లు పడుతుందనే విషయం నిధి అగర్వాల్ కు తెలియదు. అందుకే మూవీకి ఒప్పుకుంది. కానీ అనుకోకుండా మూవీ షూటింగ్ కు ఇన్నేళ్లు పట్టింది. అయితే ఈ ఐదేళ్లు నిధి వేరే సినిమాలు కూడా పెద్దగా చేయలేదు. ఎందుకంటే అందుకు నిధి చేసుకున్న వీరమల్లు అగ్రిమెంట్. ఈ అగ్రిమెంట్ ప్రకారం సినిమా అయిపోయేదాకా వేరే మూవీలు ఒప్పుకోవడానికి వీల్లేదు. మరి ఈ ఐదేళ్లు ఫైనాన్షియల్ గా ఎలాంటి ప్రాబ్లమ్ రాలేదా అంటూ ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు నిధి ఆన్సర్ ఇచ్చింది. ప్రతి నెల నాకు ఒక్క షాప్ ఓపెనింగ్ అయినా వచ్చేది. దాంతో పాటు- యాడ్ ప్రమోషన్లు కూడా వచ్చాయి. అందుకే వాటితో మేనేజ్ చేశాను. ఇన్నేళ్లు ఆలస్యం అయినా ఓ మంచి పాత్రతో వస్తున్నాను అనే మంచి ఫీల్ అయితే ఉంది. అంటూ తెలిపింది నిధి అగర్వాల్.




# సోషియో డ్రామాగా వస్తున్న పరదా మూవీ

అనుపమ పరమేశ్వరన్ కీలక పాత్రలో ప్రవీణ్ కంద్రేగుల తెరకెక్కించిన చిత్రం 'పరదా'. భిన్నమైన సోషియో డ్రామా కథాంశంతో రూపొందింది. ఆగస్టు 22న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ సినిమా నుంచి థీమ్ ఆఫ్ పరదా 'యత్ర నార్యస్తు పూజ్యంతే..' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన ఈవెంట్‌కు నిర్మాత సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒక మంచి విడుదల తేదీ దొరకడానికి ఆరు నెలలు పట్టింది. అన్ని ఏర్పాట్లు- చేసుకున్న తర్వాత అదేరోజు పెద్ద సినిమా రిలీజ్ అయ్యేది. థియేటర్లు దొరకలేదు. అందుకే ఇంత సమయం పట్టింది. నిజం చెప్పాలంటే.. ఒక అమ్మాయి ప్రధాన పాత్రలో నటించిన సినిమా వస్తుందంటే.. ఎవరూ ముందుకురారు. నిర్మాతలు, ఓటీటీ- సంస్థలు, ఒక్కోసారి ఆడియన్స్ కూడా ప్రోత్సహించడానికి ముందుకురారు. అది ఎంత మంచి సినిమా అయినా అంతే. దాన్ని తప్పు అని నేను అనడం లేదు. అది వాస్తవం. 'పరదా' కారణంగానే ఈ వాస్తవాన్ని తెలుసుకున్నాను. మా సినిమా సంవత్సరం క్రితమే రెడీ అయింది. ఏడాదిగా మా టీమ్ పడిన కష్టం దగ్గర నుంచి చూశాను. ఇది చిన్న సినిమా అని అందరూ చెబుతున్నారు.. కానీ ఇది చాలా మంచి సినిమా. ఎన్నో కమర్షియల్ మూమెంట్స్ ఉంటాయి. 'పరదా'ను థియేటర్‌లలో చూడాలని కోరుకుంటు-న్నాను. ఇప్పటివరకూ మీ సపోర్ట్‌కు ధన్యవాదాలు. ఇకపై కూడా ఇలానే ఆదరిస్తారని ఆశిస్తున్నాను అని అనుపమ అన్నారు. చిరంజీవి పుట్టినరోజుకు మించి ఈ సినిమాను విడుదల చేయడానికి మంచి తేదీ ఉండదు. అందుకే ఆగస్టు 22న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించాం. నా మొదటి చిత్రం 'సినిమా బండి'కి ఇఫీలో అవార్డు వచ్చినప్పుడు నేను చిరంజీవి దగ్గర నుంచి దీవెనలు తీసుకున్నాను. 10 ఏళ్ల క్రితం రామానాయుడు స్టూడియోలో సురేశ్ బాబును కలిశాను. అప్పుడే నన్ను ప్రోత్సహించారు. 'పరదా' కథ విన్న తర్వాత సురేశ్‌బాబు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇది నాకెంతో ప్రత్యేకం. సినిమా అంతా పరదాలోనే ఉండాలంటే ఏ నటీ- అంగీకరించదు. ఇలాంటి ఛాలెంజింగ్ రోల్‌కు అనుపమ ఓకే చెప్పారు. మా టీమ్ అందరికీ ఇది బాహుబలి లాంటి సినిమా అని దర్శకుడు చెప్పారు. దీని -ట్రైలర్ చూసి నిజంగా షాక్ అయ్యాను. చిత్రబృందమంతా ఎంతో ఆసక్తిగా పనిచేసింది. ధైర్యంగా దీన్ని తీశారు. సినిమా పరిశ్రమ ముందుకుసాగాలి అంటే ఇలాంటి చిత్రాలు రావాలి.




# మోనికా పాట కోసం బాగా కష్టపడ్డా: పూజాహెగ్డే

రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ' సినిమాలో స్పెషల్ సాంగ్ కోసం వర్క్ చేశారు నటి పూజా హెగ్డే. మోనికా బెల్లూచి అంటూ సాగే ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. పూజాహెగ్డే, సౌబిన్ షాహిర్ డ్యాన్స్‌కు సినీప్రియులు ఫిదా అయ్యారు. ఈ పాటకు వస్తోన్న ఆదరణను ఉద్దేశించి తాజాగా పూజాహెగ్డే ఆసక్తికర పోస్ట్ పెట్టారు. దీనిని ఆదరించిన వారందరికీ ధన్యవాదాలు చెప్పారు. కాలు బెణికినప్పటికీ పాట కోసం వర్క్ చేసినట్లు- ఆమె చెప్పారు. మోనికాపై మీరు చూపిస్తోన్న ప్రేమాభిమానానికి ధన్యవాదాలు. నా కెరీర్‌లో ఎంతగానో శ్రమించిన పాట ఇది. విపరీతమైన వేడి, ఎండ, దుమ్ము. కాలు బెణికిన తర్వాత నేను చేసిన తొలి సాంగ్ అయినప్పటికీ ఇవేమీ స్క్రీన్‌పై కనిపించకుండా కేవలం గ్లామరస్‌గా ప్రేక్షకులను అలరించేందుకు శ్రమించా. మోనికా కోసం నా బెస్ట్ ఇచ్చా. థియేటర్లలో చూసినప్పుడు ఇది తప్పకుండా అద్భుతంగా ఉంటుంది. నేను మీకు మాటిస్తున్నా. మీరంతా డ్యాన్స్ చేస్తారు. ఈ టాస్క్‌లో నాకు సపోర్ట్‌గా నిలిచిన డ్యాన్సర్లకు థాంక్యూ అని ఆమె చెప్పుకొచ్చారు. అంతేకాకుండా మహాశివరాత్రి నాడు ఈ పాట షూట్ చేసినట్లు- ఆమె చెప్పారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com